



ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక

వెల 4 అణాలు ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY 5-7-195

బర్మా, సింగపూర్‌లలో ప్రధాని నెహ్రూ



బర్మా ఇండియన్ కాంగ్రెస్‌వారు ఏర్పాటుచేసిన బహిరంగసభలో నెహ్రూ ప్రసంగం.



సింగపూర్‌లోని రామకృష్ణ మిషన్ అనాథశరణాలయానికి ప్రారంభోత్సవం జరిపి వస్తున్న ప్రధాని నెహ్రూ

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతిబుధవారము ప్రకటింపబడును.

ఒరులేయవియొనరించిన నరవర, యప్రియము తనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్.
(మహాభారతము)

Founder : K. NAGESWARA RAO

సంపుటము **42**
సంచిక **44**

వికృతి సంవత్సర అధికాషాఢ బహుళ షష్ఠి బుధవారము



బలిద్వీప మహారాజులతో, భారతప్రధాని నెహ్రూ, ఇండొనీషియా ప్రధాని సోకర్నోల సమావేశం.



ఆంధ్రపత్రిక

1950-వ సం॥ జూలై నెల 5-వ తేది బుధవారము

కొరియా యుద్ధము

దక్షిణకొరియానుండి అమెరికన్ సైన్యములు నిష్క్రమించినతరవాత సరిగా ఒక సంవత్సరములో ఉత్తరకొరియాకమ్యూనిస్టుసైన్యములు దక్షిణకొరియాపై దండయాత్ర జరిపినవి. ఐక్యరాజ్యసమితివారి సంఘపర్యవేక్షణక్రింద జరిగిన ఎన్నికల ఫలితముగా స్థాపింపబడిన దక్షిణ కొరియాప్రభుత్వమును రక్షించుబాధ్యత ఐక్యరాజ్యసమితిపై బడినది. భద్రతామండలి సమావేశమై ఉత్తరకొరియా ప్రభుత్వము దోషి యని నిర్ణయించి, సర్వదేశములును దక్షిణకొరియాను రక్షించవలసినదిగా ఆదేశమిచ్చినది. ఖండితముగా ఈ ఆదేశమివ్వబడుటకు ఒక రోజు ముందే దక్షిణ కొరియారక్షణకు జపాన్‌లోని తమ నౌకా వైమానిక బలములను పంపుచూ అమెరికన్ అధ్యక్షుడు ట్రూమన్ ఉత్తరువు చేసెను. మండలియొక్క ఆదేశమును పాటించి బ్రిటన్ కెనడా ఆస్ట్రేలియా మున్నగు ప్రభుత్వములు కూడా నౌకాదళములను అమెరికన్ నౌకాబలముల సహాయార్థము పంపినవి. పిమ్మట దక్షిణకొరియా సైన్యములు దాడిసైన్యముల నెదిర్చి పోరలేక వీగిపోవుచున్నందువలన అమెరికా స్వయముగా పదాతి దళమును పంపవలసిన అవసరము కలిగినది.

దీనితో ఐక్యరాజ్యసమితిచరిత్రలోనూ, అంతర్జాతీయరాజకీయములలోనూ నూతనఘట్ట మారంభమైనదని చెప్పవచ్చును. అమెరికా, రష్యా వర్గముల మధ్య సామరస్యమును చేకూర్చవలెనని జరుగుచున్న యత్నములు సాంతము కానసాగకముందే విఫలమైనవి. అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్సు, చీనాల సమ్మతి సహకారాలపైనే కేవలమాధారపడి నిర్వహించవలసిన ఐక్యరాజ్యసమితి దురాక్రమణను ప్రతిఘటించుటకు తీవ్రచర్య తీసుకొనుటవలన సమితికి పరీక్షాసమయ మాసన్నమైన దనవచ్చును.

ఇక ఉభయవర్గములమధ్యనూ వైరము అనివార్యమని నిర్ధారణమైనది. కొరియాఅంతర్యుద్ధము ఫలితముగా రాకపోయిన, త్వరలోనే మరొక సందర్భముననైననూ తృతీయప్రపంచసంగ్రామము కూడా అనివార్యమని నిర్ధారణ యైనది.

ఇట్టి పరిస్థితిలో భారతప్రభుత్వ తటస్థవిధానమునకు కూడ పరీక్ష యారంభమైనది. ఉభయవర్గముల మధ్యనూ వైరములలో ఏ వర్గముపక్షమునూ భారత ప్రభుత్వము సమర్థించబోదని మన ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ అనేకసార్లాయములు స్పష్టపరచియున్నారు. కాని బలప్రయోగమును హింసావాదమును ఎన్నడూ ఏ పరిస్థితిలోనూ సహించబోరనీ, దురాక్రమణ సంభవించినచో ఎట్టి దానికి గురియైనవారిపక్షమునే సమర్థించగలరనీ కూడ వారు స్పష్టపరచియుండిరి. ఆ విధానమున కనుగుణ్యముగనే కొరియాలో దురాక్రమణను ప్రతిఘటించుటకు భద్రతామండలి చేసిన తీర్మానమును భారతప్రభుత్వము బలపరిచియున్నది.

దేశమున గల ఆర్థికదుస్థితి నాధారముగా అశాంతిని అరాచకమునూ పురిగొల్పువారినీ, దురాక్రమణపరులనూ, శిక్షించనిచో పరోక్షముగా అరాచకవాదులనూ, దురాక్రమణపరులనూ ప్రోత్సహించినట్లేయగును. ఇది దేశీయవ్యవహారములలోనూ, అంతర్జాతీయవ్యవహారములలోనూ కూడా సత్యమే. చీనాలో వలెనే ఈనాడు కొరియాలోకూడా కమ్యూనిస్టుల దురాకాంక్షలు సరికట్టకున్నచో, మలయా, ఇండోచీనా, బర్మా ఫిలిప్పైన్సులలో కమ్యూనిస్టుహింసాకార్యక్రమము విజృంభించుటేగాక, అంతర్యుద్ధమునిమిత్తమై అన్యదేశములపై దురాక్రమణను కూడ ప్రోత్సహించినట్లే

యగును. శాసనబద్ధరాజకీయోద్యమములు, ఎన్నికల ద్వారా ప్రజాదరణను, తద్వారా పాలనాధికారమును సాధించజాలకపోయిన కమ్యూనిస్టుపక్షములు దేశమున అరాచకమును పురిగొల్పుటేగాక, అన్యదేశీయులవలని ఆయుధసహాయమును, నిపుణుల సహాయమును పొంది పరోక్షముగా దురాక్రమణకు అవకాశములు కల్పించుచున్నవి. ఈ విధాన మింక నిష్ప్రయోజనమని నిరూపించినగాని ప్రపంచమున, ముఖ్యముగా ఇప్పుడు ఆసియాఖండమున శాంతినీ, ఆర్థికాభివృద్ధినీ సాధించుట కష్టము.

కాని కొరియాలో దక్షిణకొరియాప్రభుత్వ మవలంబించిన విధానముగూడ సమర్థనీయము గాకున్నది. ఉభయప్రాంతముల రాజకీయవాదులందరును చేరి సర్వజనామోదమైన రాజ్యాంగాన్ని నిర్మించి ప్రజాస్వామ్యసిద్ధాంతముల కనుగుణముగా దేశమంతటికీ కలిపి ఒకే ప్రభుత్వమును స్థాపించవలె నని కొరియాలోని సర్వపక్షములకు చెందిన ప్రజలూ కోరుచున్నారు. ఉత్తర కొరియాలో నెలకొన్న కమ్యూనిస్టు నియంతృత్వమును కొరియావాసులు కోరుటలేదు. కేవలము అమెరికా ఆర్థికసహాయము, ఆయుధసామగ్రి సహాయముపై ఆధారపడి, పోలీసుబలప్రయోగమే పాలనాపరికరముగా ప్రయోగించుచున్న డా॥ సింగ్మన్‌రీ ఆధిపత్యము క్రింద నున్న దక్షిణకొరియాప్రభుత్వమునూ కొరియావాసులకు సమ్మతము లేదు. ఖనిజపారిశ్రామికసంపద యంతయూ ఉత్తరభాగమున, వ్యవసాయికోత్పత్తి సంపదయంతయూ దక్షిణముననున్న కొరియాదేశము కృత్రిమముగా, రష్యా అమెరికాల వైరములే ముఖ్యకారణముగా రెండు భాగములుగా విభజించబడినందువల్ల, ఉభయప్రాంతములందునూ ఆర్థికదుస్థితి నానాటికి క్షీణించుచూవచ్చినది. ఉభయప్రాంతములూ తిరిగి యేకమైనగాని దేశీయార్థికపరిస్థితి వృద్ధికాజాలదను విషయము అయిదేళ్లుగా అనుభవమైనది.

కాబట్టి అంతర్జాతీయపరిస్థితి ప్రమాదభరితముగా నున్న ఈ సమయమున కాకున్న ఏనాడైననూ ఉత్తర కొరియాప్రభుత్వము దక్షిణకొరియాపై దాడిజరిపియే యుండెడిది. అదియూ జరుగకున్నచో దక్షిణకొరియాప్రభుత్వమే ఉత్తరకొరియాపై దాడి జరిపియుండెడిది. ఉభయపక్షములనూ ప్రభుత్వములు దండయాత్రకు సన్నద్ధముగ నున్నట్లునూ, తరుచు సరిహద్దులవద్ద సంఘర్షణలు జరుగుచున్నట్లునూ, ఈ సంఘర్షణలకు ఉభయప్రాంతములవారూ, సమానముగ దోషులే ననియూ ఇదివరలో ఐక్యరాజ్యసమితివారికమిషన్ నివేదించియున్నది.

రష్యా — అమెరికాలమధ్య ప్రపంచయుద్ధవ్యూహమున మిలిటరీస్థావరముల అవసరమునే కేవలము యోచించక, కొరియాప్రజల క్షేమమును వాస్తవముగా కోరినవారైనచో, కొరియాలో ఏకప్రభుత్వస్థాపనకు రష్యా అమెరికా ప్రభుత్వప్రతినిధుల మధ్య ఇదివరకే సమాధానము సాధ్యమయ్యెడిది. ఈ కారణమువలననే ప్రజల విశ్వాసమును గోల్పోయి 'మే' మాసాంతమున జరిగిన ఎన్నికలలో ఓడిపోయిన ప్రభుత్వమును అమెరికా బలపరచవలసివచ్చినది. ఎట్టి పరిస్థితులలో నైననూ అమెరికాప్రాపు లభించగలదను ధైర్యముతోనే డా॥ సింగ్మన్‌రీ ఉత్తరకొరియావాసులతో రాయబారములనుకూడ నిరాకరించినాడు. కాబట్టి ఈనాటి కొరియాఅంతర్యుద్ధమునకు రష్యా అమెరికాలు సమానదోషులని చెప్పవలసియున్నది. అంతర్యుద్ధములో అమెరికాసైన్యముల సహాయము వలన ఫలిత మేరీతిగా నున్ననూ, కొరియాసమస్య పరిష్కారము కాజాలదు. ఈ యుద్ధమున అమెరికాబలములకు విజయము కల్గిననూ దక్షిణకొరియాప్రభుత్వమును చిరకాలము రక్షించజాలరు. కాబట్టి అమెరికా జోక్యము కొరియారాజ్యాంగ సమస్యాపరిష్కారమునకు వ్యర్థము. రష్యా ఈ యుద్ధమున ప్రత్యక్షముగ పాల్గొన్నను పాల్గొనకపోయిననూ, ఈ యుద్ధము ఆసియాలో అమెరికావిదేశాంగవిధానప్రాబల్యమునకు పరీక్ష కాగలదు. దీని ఫలితము ఆసియాఖండభవిష్యత్తు నొక విధముగా నిర్ణయించగలద నవచ్చును.

సోషలిస్టు ప్రణాళిక

భారతసోషలిస్టుపార్టీ, తన కార్యక్రమమును సూచించుటకై అష్టాదశసూత్రప్రణాళిక నొకదాని వెలువర్చినది.

ఈప్రణాళికలోని సూత్రములలో "ధర్మరాజ్య"

నిర్మాణమునకైన సూత్రములు కొన్ని ఆచరణకై ఏర్పరచుకొన్న సూత్రములు కొన్ని కలవు.

ఈ రెండవరకపు సూత్రములు ప్రజల సాంఘికోద్ధరణకై ఉద్దేశించబడినవి. వీటికి ప్రభుత్వఅధికారప్రమేయము లేదు. ప్రభుత్వఅధికారము లేకున్నను సత్పురుషుడు సంఘసేవాదీక్షతో సక్రమశిక్షణతో ఆచరించదలచిన, ఈ సూత్రములకు నేటి న్యాయశాస్త్రముగాని, రాజ్యాంగచట్టముగాని, కాంగ్రెసుప్రభుత్వముగాని, నిర్నిమిత్తముగా అభ్యంతరపెట్టజాలవు. పైపెచ్చు ప్రజలనుండి కాంగ్రెసుప్రభుత్వము ఆసించుచున్న సహాయములో ఇవి భాగములే కాబట్టి, ఒక ఉజ్వలమైన సంస్థ, స్వార్థరహితముగా, పదవీవ్యామోహరహితముగా ఇట్టి సేవ చేసిపెట్టెదమన్న, కాంగ్రెస్‌సంస్థ ఇతోధికముగ సంతసించి వీరిని ఆదరించుటకు అభ్యంతరములే లేవు.

దేశదారిద్ర్యము, నిరుద్యోగము, భూసంస్కరణము, విదేశవ్యాపారము, సంతాననిరోధము ఇత్యాది విషయములపై, సోషలిస్టుసంస్థ ఆచరణసాధ్యమగు దృక్పథమును దేనినీ వెలువరించలేకపోయినది. ఉదాహరణకు భారతదేశప్రజకు ప్రతిరైతుకు 12½ఎకరము లుండవలె నని తీర్మానించుటకు భారతదేశపు పంటభూమివిస్తీర్ణము భారతదేశపు ఎల్లలను దాటిఉండవలె ననికూడా ఏకు తీర్మానించియుండవలసివచ్చునేమో.

జమీందారీవిధానములు, మధ్యవర్తివిధానములు తొలగించుటకు ప్రత్యక్షసమస్యలతో పరిచయము కల్గించుకొనుచు, సామరస్యవిధానమున పరిష్కారముకై కాంగ్రెస్‌ప్రభుత్వము ప్రయత్నించుచునే యున్నది.

"రాజ్యాంగంలోని ప్రజాస్వాతంత్ర్యాలన్నీ నిజముగా ప్రజలకు అందుబాటులో ఉండేటట్టు చేయాలని" ఒక చేతితో తీర్మానిస్తూ, మరొకచేతితో, సర్వస్వాతంత్ర్యములను పరిమిత మొనర్చి దీర్ఘకాలపరిణామములను, అధికారధూర్వహత్వముతో అకస్మాత్తుగా పండించదలచుకొను ప్రణాళిక--ప్రజాస్వామ్యప్రణాళిక కాక, ప్రజాక్షేమనినాదముల నెంత బిగ్గరగా యరచుచున్నను, ఫాసిస్టు ప్రణాళికగానే ఆచరణలో మారక తప్పదు.

ప్రభుత్వఅధికారవాంఛ అంకురించనినాడే, కనుచూపుమేర ఆ భావము లేనినాడే, కాంగ్రెస్ పక్షమునకు మహాత్ముడు, సుస్థిరదార్ఢ్యమును, దీర్ఘాయుష్యావహమగు దేహపోషణమును, సమకూర్చిపెట్టియున్నాడు. కావుననే ప్రభుత్వ అధికార జీవనములోని సరసగుణములుకూడ కాంగ్రెస్‌సంస్థను నిర్జీవ మొనర్చలేకపోయినవి. తన సర్వవ్యవహారములు ప్రజాస్వామ్యపద్ధతిని బహిరంగముగా చేసుకొనుసూత్రముపై పెరిగివచ్చిన కాంగ్రెసు, నేడు దేశవ్యాప్తమైన ప్రజాసంస్థగా ఏర్పడి అట్టి విధానములోనే తన అంతరంగికవ్యవహారములను పరిష్కరించుకోవలసివచ్చినప్పుడు, బహిరంగవిధానములవలన కొంత కశ్మలము కనబడుచుండవచ్చును.

కాని నేటి కాంగ్రెసేతరసంస్థలు, అధికారములోకి వచ్చిననాడు కాంగ్రెస్‌మాత్రపు బుజుత్వముతోనైన తమ పాతమాటలు నిలుపుకొన ప్రయత్నింపగలవను నమ్మకము, ప్రజలలో కల్పించుటకు తగినంత ప్రజాసేవ ఏదైననూ--దేశవిస్తృతముగ గాని, సంక్షిప్తముగగాని--యొనర్చి, ప్రజాదరణ చూరగొనలేకపోయినవి. ఆ కారణముననే కాంగ్రెస్‌విజయములకు శ్రీ జయప్రకాశ్ వింతగా ఆశ్చర్యమును పొందవలసివచ్చినది.

నేడు ప్రపంచము తృతీయప్రపంచయుద్ధపు సరిహద్దులలోపల నిల్చినది. ఈ సమయమున భారత విదేశాంగనీతి, అభినందనీయముగా ప్రపంచప్రజాదరణను పొందినది.

ఈ క్లిష్టసమయమున, గాంధిమహాత్ముని నామ ముచ్చరించు పక్షము లన్నియు, శాంతి, అహింసలలోనే దేశక్షేమ మున్నదని నమ్మ పక్షములన్నియూ, అధికార మెవరి దన్నవివాదముతో దేశఆంతరంగికకల్లోలమును పెంచుటకు గాక, దేశ అంతరంగఐక్యతకే కృషిచేయవలసియున్నది. ప్రభుత్వము వెలుపలే, ప్రజాదరణ పొందుటకు, సోషలిస్టుపక్షమునకు, రెండుచేతులకు తగినంత సంఘసేవాకృషి గలదు. ఆవిధమున అధికారముకన్న ముందుగ ప్రజావిశ్వాసమును ఈ పార్టీవారు సంపాదించుకొనుట శ్రేయస్కరము.

నెలప్రపంచం

కొరియా అంతర్యుద్ధంలో భద్రతామండలి ఆదేశానుసారం అమెరికా, బ్రిటిష్ కామన్వెల్త్ దేశాలు దక్షిణకొరియాతరఫున ప్రవేశించాయి.

జూన్ 25వ తేదీ ఆదివారం ఉదయం 4 గంటలకు ఉత్తరకొరియాకమ్యూనిస్టులు దండయాత్ర ప్రారంభించి కెయ్ స్యాంగ్ రైల్వేకేంద్రాన్ని ఆక్రమించుకున్నారు. పరిహద్దువద్ద ఆరుచోటనుంచి దండయాత్ర ప్రారంభమయింది. ఇదికాక కాంగ్ నుంగ్ రేవువద్ద కొన్ని ఓడల్లో కమ్యూనిస్టు సైన్యాలు దిగాయి. దాడిసైన్యాలు సియూల్ నగరముఖంగా పురోగమిస్తున్న సమయంలో దక్షిణకొరియాప్రభుత్వం అమెరికాను సహాయం కోరింది. దక్షిణకొరియా ప్రభుత్వ సైన్యాలే దురాక్రమణ ప్రారంభించారనీ, ఆ ప్రభుత్వాన్ని తుదముట్టించడానికే ఉత్తరకొరియా యుద్ధం ప్రారంభించిందనీ ఉత్తరకొరియాప్రధానమంత్రి కిమ్ఇల్ సుంగ్ పయంగ్ యంగ్ రేడియోద్వారా ప్రకటించాడు. దక్షిణకొరియాప్రజల్ని డా॥ రీ ప్రభుత్వాన్ని పడగొట్టవలసిందిగా ఉద్బోధించాడు.

యుద్ధమారంభమైనరోజునే సాయంకాలం అమెరికా కోరికపై, భారతప్రతినిధి బి. యన్. రావుగారి అధ్యక్షతకింద భద్రతామండలి సమావేశమయింది. ఉత్తరకొరియాప్రభుత్వంపైన దురాక్రమణనేరాన్ని మోపి, వెంటనే యుద్ధం విరమించి పరిహద్దులోకి మళ్లిపోవలసిందిగా ఆదేశమిస్తూ, అమెరికా ప్రతిపాదనపై మండలి తీర్మానించింది. దక్షిణకొరియాలోని ఐక్యరాజ్యసమితికమిషన్ను పరిస్థితిని నివేదించవలసిందనీ, ఉత్తరకొరియా ఏరీతిగా మండలి తీర్మానాన్ని పాటిస్తున్నదో తెలుపవలసిందనీ ఉత్తరువిచ్చింది. ఈ తీర్మానాన్ని అమలుజరపడంలో ఐక్యరాజ్యసమితికి సహాయపడవలసిందనీ, ఉత్తరకొరియాప్రభుత్వాని కెట్టి సహాయాన్నీ అందించరాదనీ సమితిసభ్యులనందరినీ భద్రతామండలి కోరింది.

చీనాసభ్యత్వవివాదంతో రష్యా ఈ సమావేశంలో పాల్గొనలేదు. యుగోస్లావియాతప్ప మిగతా తొమ్మిదిమంది సభ్యులూ అమెరికన్ తీర్మానానికి అనుకూలంగా వోటు చేశారు. యుద్ధం విరమించాలని చేసిన ఆదేశానికి మాత్రం అనుకూలంగానూ, మిగతా సూచనలకు ప్రతికూలంగానూ యుగోస్లావియా వోటుచేసింది. సమావేశానికి దక్షిణకొరియాప్రభుత్వప్రతినిధి వాదిగా హాజరైనాడు. ఉత్తరకొరియాప్రతినిధిని ఆహ్వానించాలని యుగోస్లావియా సూచిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానం వీడిపోయింది. ఈ తీర్మానంపైన భారతదేశం, ఈజిప్టు, నార్వే ప్రతినిధులు వోటుచెయ్యలేదు. ఉత్తర కొరియా ఎన్నికల్లో సమితికమిషన్ అజమాయిషీ నిరాకరించబడినందువల్ల ఆ ప్రభుత్వాన్ని సమితి గుర్తించలేదు. దక్షిణకొరియాప్రభుత్వాన్ని మాత్రమే గుర్తించింది.

యుద్ధమారంభమైనరోజునే సియూల్ నగరంలో ఉన్న సమితికమిషన్ సమితి ప్రధానకార్యదర్శి ట్రిగ్వేలీకి పరిస్థితిని తంతిద్వారా నివేదించింది. దురాక్రమణ జరిపినది ఉత్తరకొరియాసైన్యాలేనని ఈ నివేదికలో చెప్పబడింది.

ఉత్తరకొరియాదురాక్రమణను నిలుపుచేయవలసిందిగా కోరుతూ ట్రిగ్వేలీ, అమెరికాప్రభుత్వప్రతినిధులు రష్యాను కోరారు.

కాని ఈతీర్మానాన్ని ఉత్తరకొరియా పాటించలేదు. దక్షిణకొరియా ప్రధాననగరమైన సియూల్ 27వ తేది మంగళవారం ఉదయం కమ్యూనిస్టుల వశమయింది. వెంటనే అమెరికన్ అధ్యక్షుడు ట్రూమన్ దక్షిణకొరియాప్రభుత్వానికి జపాన్లో నిలవరించబడిన నౌకావిమానబలాలను సహాయం పంపవలసిందని జనరల్ మెకార్థర్కు ఉత్తరువిచ్చాడు. ఈరీతిగా కొరియా అంతర్యుద్ధంలో జోక్యం జేసుకోడానికి ఆదివారంనాటి భద్రతామండలితీర్మానంలో సమితిసభ్యుల కివ్వబడిన ఆదేశమే ఆధారమని ట్రూమన్ చెప్పాడు. మిలిటరీచర్యల ద్వారా దక్షిణకొరియాప్రభుత్వానికి సహాయపడి దాడి సైన్యాలను ఉత్తరకొరియా సరిహద్దుల్లోకి తరిమివెయ్యవలసిందని భద్రతామండలి సమితిసభ్యులకు సూచిస్తూ 28వ తేది బుధవారంనాటి సమావేశంలో తీర్మానించింది. బుధవారంనాటి సమావేశంలో కూడా రష్యా పాల్గొనలేదు. హాజరైన పదిమంది సభ్యుల్లో ఏడుదేశాల ప్రతినిధులు అనగా, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, చీనా (చియాంగ్ ప్రతినిధి,) క్యూబా, ఈక్వెడార్, నార్వే ప్రతినిధులు తీర్మానానికి అనుకూలంగా వోటుచేశారు. యుగోస్లావియాప్రతినిధి ప్రతికూలంగా వోటుచేశాడు. భారతదేశం, ఈజిప్టు ప్రతినిధులకు వారి ప్రభుత్వాల ఉత్తరువు లందనందువల్ల వోటింగ్లో పాల్గొనలేదు. దాడిసైన్యాల నుంచి రక్షించడానికి దక్షిణకొరియాప్రభుత్వానికి తగిన సహాయమివ్వవలసినదిగా సమితిసభ్యులకు ఈ తీర్మానంద్వారా ఆదేశమివ్వబడింది.

ఉభయప్రాంతప్రభుత్వాలమధ్య సమాధానమార్గాలను నడపాలని సూచిస్తూ ఉత్తరకొరియాప్రతినిధిని కూడా ఆహ్వానించాలని కోరుతూ యుగోస్లావియా ప్రతిపాదించిన తీర్మానాన్ని మండలి నిరాకరించింది. గురువారంనాడు భారతప్రభుత్వం మండలితీర్మానాన్ని ఆమోదించింది. మిలిటరీచర్యలకు భారతప్రభుత్వ సమర్థనను ఆంగ్లో అమెరికన్ వర్గరాజ్యాలన్నీ ఆనందోత్సాహాలతో ప్రశంసించాయి.

అయితే భారతప్రభుత్వవిదేశాంగవిధానంలో, అనగా ప్రపంచరాజ్యకూటాలమధ్య తటస్థవైఖరిలో మార్పు ఏమీ రాలేదని ప్రభుత్వంతరఫున ఒకరు ప్రకటించారు. దురాక్రమణ ఎక్కడ ఎవరివల్ల సంభవించినా సరే ప్రతీకారం జరిగితీరాలనీ, ఐక్యరాజ్యసమితిదురాక్రమణను ప్రతిఘటించవలసిందేననీ భారతప్రభుత్వంఅభిప్రాయమైనందువల్ల భద్రతామండలితీర్మానాన్ని ఆమోదించింది. భారతదేశం స్వయంగా సైన్యాలనుగాని సామగ్రిసహాయాన్నిగాని పంపలేకపోవచ్చును. కాని సమితిచర్యను పూర్తిగా ఆమోదించింది. సమితి మొత్తం 59 సభ్యత్వదేశాలలోను 31 దేశాలింతవరకూ ఆమోదం ప్రకటించాయి. బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ప్రభుత్వాలు నౌకాబలా

లను దక్షిణకొరియా సహాయార్థం అమెరికన్ మిలిటరీఅధికారులకు పంపాయి.

ఈజిప్టుప్రభుత్వంమాత్రం భద్రతామండలి తీర్మానాన్ని ఆమోదించక పూర్తిగాతటస్థ వైఖరి నవలంబించింది. ఈజిప్టు ప్రధాని నహాస్‌పాషా (పండిట్ నెహ్రూ మిత్రుడు) కైరోపత్రికావిలేఖరికి తనఅభిప్రాయాన్ని ఈవిధంగా విశదపరిచాడు.

"అంతర్జాతీయ రాజకీయాల్లో బలమైన దేశాలు ఆశ్రితదేశాలపట్ల పక్షపాతం వహించేపద్ధతివల్ల ప్రపంచంలో శాంతి రక్షణ జరగదు.

"ఐక్యరాజ్యసమితిద్వారా సమస్యలను వివాదాలను పరిష్కరించుకోడానికి వచ్చిన ప్రతిదేశం సమితి న్యాయాన్నే నిర్ణయిస్తుందనీ, బలం అన్యపక్షాన ఉన్నప్పటికీ, తమ పక్షాన గల న్యాయమే సమితిలో జయించగలదనీ ఆశించింది. కాని సమితిపైనా భద్రతామండలిపైనా ఆశలు పెట్టుకున్న ఈ దేశాలు గమనించినవిషయం ఏమిటంటే నిర్ణయాలు రెండురకాలుగా ఉంటున్నాయి. కొరియా సమస్యలో మాత్రమే జాప్యం లేకుండా చర్యకు దిగి బలాన్ని ప్రయోగిస్తున్నారు. అన్యసమస్యలలో అది జరుగలేదు.

"ఇంకా భద్రతామండలీచర్చనీయాంశాలలో ఉన్న ఈజిప్టుప్రభుత్వఫిర్యాదును ఈజిప్టు ఎన్నడూ మరవదు. ఈ ఫిర్యాదులో జరిగినది దురాక్రమణం.

"అన్యదేశాల సమస్యలకు సంబంధించి జరిగిన దురాక్రమణలనుకూడా మరవలేము. అంతర్జాతీయరంగంలో ఆశ్రితపక్షపాతంఫలితంగా అధోగతిపాలై మగ్గిపోతున్న దేశాల్ని మరువలేము. ఈ ఆశ్రితపక్షపాతంద్వారా ప్రపంచశాంతి నిలకడ అసంభవం."

అమెరికాఅధ్యక్షుడు ట్రూమన్ నౌకా విమానబలాల సహాయం ఇవ్వడంతో తృప్తిపడలేదు. చైనాకమ్యూనిస్టులు ఫార్మోజాద్వీపంపైన దాడికి సన్నాహాలు చేసినట్లు, ఇండోచీనాలోకూడా అంతర్యుద్ధం విజృంభింపజేయడానికి కమ్యూనిస్టులు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వచ్చినందువల్ల ఈ రెండూ సంభవింపకుండా చర్య తీసుకున్నాడు. అమెరికన్ ఏడవనౌకాదళాన్ని ఫార్మోజాకు పంపి రక్షించాలని ఉత్తరువు చేశాడు. ఈఉత్తరువుతోపాటు చీనాభూభాగంపైన విమానదాడులుగాని నౌకాచర్యలుగాని జరపరాదని చియాంగ్-కై-షేక్‌ను ఆదేశించాడు. కాని చియాంగ్ ఈ ఆదేశానికి భిన్నంగా ఉత్తరచీనాపైకి విమానాన్ని పంపి దాడులు జరిపించాడు. అది ఒక్కరోజునే జరిగింది. తరువాత కొరియాలో చర్యలకు తనసైనికబలంలో రెండుదళాల్ని పంపగలనని ట్రూమన్‌కు చెప్పాడు.

ఐక్యరాజ్యసమితిసభ్యులు ఏ మిలిటరీచర్య తీసుకోవలసివచ్చినా, భద్రతామండలికి నివేదించాలని సమితినిబంధనలలో ఉంది. కాని ట్రూమన్ ఫార్మోజారక్షణకు నౌకాబలాన్ని నియోగించినట్లు, ఇండోచీనాకు త్వరితంగా విమానబలాన్ని పంపినట్లు భద్రతామండలికి తెలియపరచలేదు. ఫార్మోజా చీనాప్రభుత్వానికి చెందినదేనని యుద్ధకాలపు అగ్రరాజ్యనాయకసమావేశాలు అంగీకరించాయి. కాబట్టి చీనాకు చెందిన ఫార్మోజాను రక్షించే హేతువుపై నౌకాబలాన్ని పంపి అమెరికా సమితినిబంధనలను ఉల్లంఘించినట్లే. చీనాలో కమ్యూనిస్టుప్రభుత్వాన్ని గుర్తించకపోయినప్పటికీ ఈ రీతిగా జోక్యం చేసుకోవడం న్యాయసమ్మతం కాదు. చీనాఅంతర్యుద్ధంలో చియాంగ్కై-షేక్‌కు ప్రచ్ఛన్నంగా తోడ్పడిన కార్యక్రమం ఇప్పుడుప్రత్యక్షరూపం దాల్చింది అంతే. అయితే ఈ చర్యవల్ల ఆసియాలో ప్రజలకు తిరిగి తమదేశాలు అగ్రరాజ్యాల మధ్య రణరంగక్షేత్రాలు కాగలవనే భయం ఉత్పన్నమయింది.

అమెరికాచర్యపట్ల ఆసియాలో అభిప్రాయాలను సేకరించిన ఒక ఆంగ్లపత్రికవిలేఖరి ఈ క్రిందివిషయాలను తెలుపుతున్నాడు. కమ్యూనిస్టులపై బద్ధవిరోధం వహించి ప్రాణాలొడ్డి పోరాడుతున్న బర్మాలో తమ దేశాన్ని ఇకముందు ఏయుద్ధాలలోనూ దిగనివ్వరాదనే అభిప్రాయం ప్రబలంగా ఉంది. కొరియాయుద్ధంలో అమెరికన్‌పక్షాన చేరినట్లయితే బర్మాలోశాంతిస్థాపన దుస్సాధ్యం కావచ్చుననే అభిప్రాయం అధికారవర్గాల్లో కలిగింది.

మలయాలో బ్రిటిష్ సైన్యాలున్నప్పటికీ అశాంతి, యుద్ధం అక్కడకు కూడా వ్యాపించగలదని అన్నిపక్షాలవారూ భయపడుతున్నారు. సయాంకు అమెరికాతోడ్పాటు ఉన్నప్పటికీ అక్కడకూడా ప్రజలు భయపడుతున్నారు. ఆసియాలో మరొక యుద్ధం సంభవించకుండా కాపాడవలసిందని ప్రజలు భగవంతుని ప్రార్థిస్తున్నారు.

రెండోప్రపంచయుద్ధంతరవాత యూరప్‌లో పారిశ్రామికవిజ్ఞానశాస్త్రాభివృద్ధిఫలితంగా చాలవరకూ ఆర్థికపునరుద్ధరణ సాధ్యమయింది. యుద్ధంలో సంభవించిన విధ్వంసంనుంచి దేశాన్ని వారు పునర్నిర్మించుకొన్నారు. అదీకాక వారికి అమెరికా మార్షల్ సహాయం లభించింది. ఆసియాదేశాల్లో మాత్రం ఆర్థికదుస్థితి ఎప్పటిమాదిరిగానే ఉంది. యుద్ధంలో సంభవించిన నష్టంనుంచి ఏదేశమూ కోలుకోలేదు. కొన్నిదేశాలు మరింత హీనమైనాయి. అశాంతి నానాటికి వృద్ధి అవుతోంది. కమ్యూనిజాన్ని అణచడానికి పాశ్చాత్యబలాలు యూరప్‌లో యుద్ధాలు చేసి ఆసియాదేశాలను విడిచిపెట్టాలని ఆసియావాసు లభిప్రాయపడుతున్నారని అవిలేఖరి వ్రాశాడు.

ఆసియావాసుల భయాలు నిరాధారమైనవి కావు. చీనాను కవ్విస్తున్న అమెరికా వైఖరి చూస్తే ఇది బోధపడుతుంది. ఏటంబాంబుల్ని ఆసియాకోసం ప్రత్యేకించకుండా యూరప్‌లో పరస్పరంప్రయోగించుకోడం మంచిది. అక్కడైతే పరిశ్రమలు ధ్వంసమౌతాయి. చనిపోయే జనం వేల సంఖ్యలోమాత్రమే ఉంటారు. ఆసియాలో అయితే లక్షలకొద్దీ బలికావచ్చును.

ట్రూమన్ ఆదేశానుసారం జనరల్ మెకార్థర్ నౌకాబలాలను వినియోగించి ఫార్మోజాను రక్షిస్తున్నాడు. కొరియా చుట్టు దిగ్బంధం చేశాడు. పురోగమించే కమ్యూనిస్టుసైన్యాలపైన బాంబులు రాకెట్లుకురిపించాడు. కాని టాంకులతో విమానబల సహాయంతో దాడిచేస్తున్న కమ్యూనిస్టు సైన్యాలను నిరోధించలేక దక్షిణకొరియా సైన్యాలు పోరాడకుండా దక్షిణానికి పారిపోతున్నాయి. జనరల్ మెకార్థర్ శుక్రవారంనాడు స్వయంగా కొరియా వెళ్లి పరిస్థితిని పరిశీలించి ట్రూమన్‌కు తెలిపాడు. దక్షిణకొరియాను కాపాడ్డానికి స్వయంగా అమెరికన్ సైన్యాలు పోరాడక తప్పదని తేలింది. జపాన్‌లో అమెరికన్ సైనికులు 1,30,000 మంది ఉన్నారు. సరిహద్దు దాటి ఉత్తరకొరియాలోని మిలిటరీకేంద్రాలపైన విమానదాడులు జరపాలనీ, అమెరికన్ సైన్యాన్ని కొరియాకు పంపాలనీ ట్రూమన్ ఉత్తరువు చేశాడు. ఆ ప్రకారం అమెరికన్ సైన్యాలు కొరియాకు విమానాలలోనూ, నౌకల్లోనూ పంపబడుతున్నాయి.

— [సూర్యనారాయణ]

కొరియా బలిపీఠం

రష్యా, మంచూరియా, జపాన్‌ల మధ్యగున ఉన్నందువల్ల కొరియా మొదటినుంచీ అన్యదేశాల దౌర్జన్యానికి గురై బలిపీఠమయినది. మంచూరియాకు ఆగ్నేయదిశ నంటి ఉన్న కొరియా ద్వీపకల్పాన్ని ఉత్తరాన దాదాపు అరవై మైళ్ల పొడుగున సన్నని సింధుశాఖ రష్యానుంచి విడదీస్తుంది. జపాన్‌లోని నాగసాకీ నౌకా కేంద్రానికి కొరియాలోని ఫూసాన్ రేవుకీ మధ్య నూరు మైళ్లపైగా కొరియన్ ఛానెల్ వ్యాపించి ఉంది. మంచూరియాలో జపాన్ 1905 లో రష్యాను ఓడించింది. ఈ యుద్ధంలో లభించిన ప్రతిష్ఠ ఆధారంగా, బ్రిటిష్ అమెరికాల ప్రోద్బలంపైన జపాన్ కొరియాలో తన "సంరక్షకత్వం" స్థాపించుకుంది. 1910 లో జపాన్ తన సైన్యాలను పంపి పరిపాలన స్థిరపరచుకుంది. అప్పటినుంచి 1945 లో అమెరికన్ రష్యన్ సైన్యాల ఆక్రమణ వరకూ కొరియా జపాన్‌వారి ఆక్రమణలోనే ఉండిపోయింది.

కాని కొరియావాసు లెన్నడూ రాజకీయదాస్యాన్ని శాంతంగా అంగీకరించలేదు. అనేక విప్లవాలు, రాజకీయోద్యమాలు వచ్చాయి. జపాన్ పాలకులు అమానుషంగా రాజకీయనాయకుల్ని అణచివేసి, ప్రజల్ని హింసించి అదుపులో ఉంచా[రు]. జపాన్ ఆక్రమణ నంగీకరించ జాలకపోయిన జాతీయవాదులు, ధనవంతులు, రైతులు, సైనికులు అనేక వేలమంది 1910లో దేశం విడిచి మంచూరియా, సైబీరియాలకు పారిపోయి అక్కడ స్థిర నివాసం ఏర్పరచుకొన్నారు. అక్కడనుంచి సైనికులు జాతీయవాదులు అనేకసంవత్సరాలు గొరిల్లాయుద్ధం సాగించారు. ఆనాటినుంచి రెండో ప్రపంచ యుద్ధం అంతమయేవరకూ మంచూరియాలోని కొరియా దేశస్థులు కొరియాలో జాతీయోద్యమాలకు తోడ్పడుతూ ఉన్నారు.

వీరి తోడ్పాటుతోనే 1919 లో ప్రవాసులైన కొరియా దేశస్థులందరూ షాంఘై నగరంలో సమావేశమై డా॥ సింగ్మన్ రీ అధ్యక్షత క్రింద ప్రవాస ప్రభుత్వాన్ని స్థాపించారు. దేశస్వాతంత్ర్య సాధనకు ఏ మార్గం అనుసరించాలనే విషయంపై అభిప్రాయభేదం వల్ల ఈ ప్రవాసప్రభుత్వంలో రెండు కక్షు లేర్పడినాయి. ఒక పక్షాన్ని "అమెరికన్ పక్షం" అన్నారు. రెండో దాన్ని "సైబీరియా - మంచూరియా" పక్షం అన్నారు. మొదటి పక్షానికి డా॥ రీ నాయకుడు. రెండో పక్షానికి ల్యూ వూన్ హ్యోంగ్ నాయకుడు. అమెరికా మైత్రి పొంది జపాన్ పై రాజకీయంగా ఒత్తిడి తేవాలని డా॥ రీ వాదన. ఈ రాజకీయాల వల్ల ప్రయోజనం లేదనీ, కొరియా పై దండెత్తి స్వాతంత్ర్యాన్ని సాధించాలనీ ల్యూ వాదం. మంచూరియాలో స్థిరావాసం ఏర్పరచుకున్న పదిలక్షల మంది, సైబీరియాలో స్థిరావాస మేర్పరచుకున్న ఎనిమిదిలక్షలమంది కొరియా దేశస్థులలో అత్యధికసంఖ్యాకులు రెండో పక్షాన్నే బలపరిచేవారు. కాబట్టి కొరియా జాతీయోద్యమం ఆరంభంలోనే రష్యన్ అమెరికన్ కక్షల ప్రభావానికి లోనయిందని తెలుస్తున్నది. అప్పటికి జపాన్‌వారు కొరియాలో తమ ప్రాబల్యాన్ని స్థిరపరచుకున్నారు. ఖనిజ పారిశ్రామిక సంపదలో నూరింట 85 వంతు, వ్యావసాయికభూమిలో నూరింట 80 వంతు జపానీవారి ఆస్తిలో చేరిపోయింది. జపాన్‌లో విద్యకీ, వ్యాపారానికీ వెళ్లిన కొరియా దేశస్థులు జపాన్‌వారి దౌర్జన్యాన్ని సహించలేక దక్షిణచీనాలోని కాంటన్ నగరంలో చేరి, చీనాజాతీయ విప్లవకారులతో చేరారు. కాని 1922 లో చీనా సన్‌యట్‌సెన్ ఆధ్వర్యంకింద విప్లవాన్ని సాధించి రిపబ్లిక్‌ను స్థాపించిన ఆ విప్లవకారుల కొరియా దేశవిముక్తికి యత్నించనైనలేదు. 1923 ప్రాంతాల విప్లవభీతివల్ల జపాన్ పాలకులు అతిక్రూరంగా కొరియాలోని జాతీయోద్యమాన్ని అణచివేశారు.

జపాన్‌వారు మంచూరియాపై దాడి చేసినప్పుడు ప్రవాసంలో ఉన్న ఉద్యమకారులను కొందరిని అణచివేశారు. కొంద[రు]

(33-వ పేజీ చూడుడు).



కాశ్మీర్ తగాదా పరిష్కార మధ్యవర్తి సర్ ఓవెన్ డిక్సన్ గారి సైనిక సలహాదారు జనరల్ హార్డ జూన్ 27-వ తేదీన ఢిల్లీకి వచ్చారు. పాలం విమాన కేంద్రంలో సైనికాధికారులతో మాటాడుతున్న దృశ్యం.

మనదేశం

శరణార్థుల ఆస్తి *

1947 లో దేశవిభజనసమయంలో ప్రారంభించిన మతకలహాలఫలితంగా అనేకలక్షల మంది హిందువులు దాదాపు 4000 కోట్ల రూపాయల విలువగల స్థిరచరాస్తులను విడిచి ప్రాణాలు అరచేత పట్టుకుని పాకిస్తాన్ నుంచి భారతదేశం వచ్చేశారు. భారతదేశం నుంచి పాకిస్తాన్ పారిపోయిన శరణార్థులు ఈదేశంలో దాదాపు 400 కోట్లరూపాయల విలువగల స్థిరచరాస్తులను విడిచివెళ్లారు. స్థిరాస్తులను అమ్ముకుని ధనాన్నీ, చరాస్తినీ తెచ్చుకోడానికి శరణార్థులకు వీలుపడలేదు. పాకిస్తాన్‌లో హిందువుల ఆస్తులలోచాల భాగాన్ని భారతదేశంనుంచి వెళ్లిన శరణార్థులు, అక్కడి మహమ్మదీయులు స్వాధీన పరుచుకుని అనుభవిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వమే ఆ ఆస్తివిలువను ఆక్రమించుకున్న వారివద్ద రాబట్టుకుని భారతప్రభుత్వాని కొప్పగించాలనీ, భారతదేశంలో శరణార్థులు విడిచిపెట్టిపోయిన ఆస్తి విలువను ఆవిధంగానే తాము ఒప్పగించగలరనీ భారతప్రభుత్వం సూచించింది. ఇది పాకిస్తాన్ ప్రభుత్వానికి రుచించలేదు. 4000 కోట్లరూపాయల విలువను రాబట్టడానికి పూనుకొన్నట్లయితే పాకిస్తాన్ ప్రభుత్వంపట్ల ప్రజలకు, అక్కడి శరణార్థులకు అసంతృప్తి కలగవచ్చును.

ఈవిషయమై తిరిగి ఈవారం ఢిల్లీలో చర్చలు జరిగాయి. భారతప్రతినిధివర్గం మంత్రిగోపాలస్వామి అయ్యంగార్ నాయకత్వం కిందనూ, పాకిస్తాన్ ప్రతినిధివర్గం మంత్రి మహబూబ్ నాయకత్వం కిందనూ సమావేశమైనారు. చరాస్తివిషయమైమాత్రం ఈ సమావేశంలో ఒప్పందం కుదరింది.

శరణార్థుల ఆస్తి సంరక్షణకర్త అనుమతి అవసరంలేకుండానే చరాస్తిని శరణార్థులు తీసుకుపోవచ్చుననీ, లేక అమ్మి ధనం తీసుకుపోవచ్చుననీ నిర్ణయించబడింది.

అయితే భూస్థాపితం చేయబడిన యంత్రాల్నీ పరికరాల్నీ తవ్వితియ్యకూడదనీ, వానిని అమ్మి ధనంతీసుకుపోవచ్చుననీ, ఎగుమతి చెయ్యకూడదని నిషేధించబడిన వస్తుసామగ్రిని అమ్మి ధనంతీసుకుపోవచ్చుననీ విధించబడింది. ప్రభుత్వం కాని శరణార్థుల ఆస్తిసంరక్షకుడు గాని అన్యాక్రాంతంచేసిన శరణార్థుల చరాస్తికి నష్టపరిహారం నిర్ణయించి చెల్లించడానికి నిబంధనలపైన అంగీకారం కుదిరింది.

స్థిరాస్తివిషయమై తిరిగి సమావేశం జరపడానికి నిశ్చయించుకున్నారు. ఇందులో భారతదేశానికి వచ్చిన శరణార్థులు విడిచిపెట్టిన స్థిరాస్థివిలువ దాదాపు రు 2 000కోట్లుంటుంది. చరాస్తిరవానా అమ్మకాలెల్లా జరుగుతాయో చూస్తే, ముందు స్థిరాస్తి



గోపాలస్వామి అయ్యంగార్

విషయమైఒప్పందం కుదిరేదీ కుదరనిదీ తెలుస్తుంది. కాశ్మీర్‌సమస్యతో సమానమైన శరణార్థుల ఆస్తిపరిహారసమస్య క్రమక్రమంగా పరిష్కారసాధ్యంకావడం భారత పాకిస్తాన్‌ప్రభుత్వాల మధ్య మైత్రిసాధనకు అవకాశ మివ్వవచ్చును.

వనమహోత్సవం *

వర్షాలు సమృద్ధిగా కురవాలంటే, సస్యం వృద్ధికావాలంటే, అందరికీ అన్నందొరకాలంటే మొక్కలు నాటి వృక్షాల్ని అడవుల్ని వృద్ధిపరచాలన్నారు భారత ప్రభుత్వం. ఉన్న చెట్లనికొట్టెయ్యకుండా, చెట్లు, అరణ్యాల అవసరాన్ని ప్రజలకు విశదపరచడానికి ప్రతిఏటా తొలకరిలో వారంరోజులపాటు వనమహోత్సవం జరపాలన్నారు ఆహారశాఖామంత్రి మున్షీగారు. పదిమంది పుత్రులకు ఒక వృక్షంసమానమని మన అగ్నిపురాణంలో చెప్పబడినట్లు ప్రభుత్వం తెలియచెప్పింది. అడవులవల్ల అన్యదేశాలేవిధంగా భోగాలనుభవిస్తున్నదీ మద్రాసు ప్రభుత్వం తెలిపింది.

ఉత్తర అమెరికాఖండంలో భాగ్యవంతులు పెద్దపెద్ద ఎస్టేట్లు కొని పెద్ద పెద్దకలప వృక్షాలఅడవులు పెంచుతారు. ఊళ్లోనూ రోడ్లప్రక్కనూ క్రోటన్స్ మొక్కలు పువ్వుల మొక్కలు మాత్రం వేస్తారు. మనదేశంలో పెద్దవృక్షాల్ని గృహప్రాంగణంలో పెంచరాదని నిషేధంఉండేది. అయితే వృక్షాల అవసరాలన్ని గ్రహించిన మన పూర్వులు వేప, చింత, వగైరా చెట్లని ఇళ్లవద్ద పెంచుతుండేవారు. వృక్షాల నీడనూ పరిసరాల్లోనూ చల్లదనం వస్తుంది. ఒక్కొక్క పెద్దచెట్టు 1400గాలన్ల నీటిని ఒకవారంలో పీల్చి క్రమక్రమంగా ఆ తడిని గాలిలోకి విడిచిపెడుతుంది. కాబట్టి పరిసరాలలో చల్లగా ఉంటుంది. అడవులున్నచోటగాలి దుమారాలను కీలపైన దుమ్మెగిరిపోకుండా భూమిసారం కాపాడబడుతుంది. నూతులవల్ల పైకితీసుకురాలేని భూగర్భంలోని నీటిని పైకితెచ్చి ఆవిరిరూపంలో ఆకాశంలోకి పంపి తిరిగి వర్షరూపంలో మనకిస్తాయి. వనదేవతల్ని, చెట్లమొదళ్లలో అమ్మవార్లని పూజించే మనదేశం మున్షీగారి కోరికను సఫలమొనర్చి భారతదేశాన్ని అడవులమయం చెయ్యగలగవచ్చును.

[సీతారామ్]

కంట్రోళ్ల రద్దు

"వ్యాపారస్థులు తమ ప్రయోజనాలను సురక్షితం చేసేందుకని ప్రభుత్వం జోక్యం కల్పించుకొన్నందుకు ఎప్పుడూ ఆక్షేపించలేదు. ఉదాహరణకే తీసికొందాము. 'టారిఫు'లు 'సబ్సిడీ'లు, ఎగుమతులపై ప్రభుత్వవిరాళాలు, ప్రత్యేక పెట్టుబడివసతులు, వీటిని వారెప్పుడూ ప్రశంసించకుండా ఉండలేదు. కాని వినియోగదార్ల (consumers) రక్షణకని 'కార్మికుల అంగడి' (Labour-market) లో తక్కువ స్థితిపరుల రక్షణకని ప్రభుత్వం జోక్యం కల్పించుకుంటే మటుకు, ఆ జోక్యానికి వారు (వ్యాపారస్థులు - వే. సం) అభ్యంతరపెట్టుతారు." హెరాల్డు. జె. లాస్కీ. (Reflections on the Revolution of our time)

కంట్రోళ్లు తీసేయాలనేమాట మళ్లీ పదే పదే వింటున్నాం. మనుష్యుల్లో నీతి నియమాలు క్షీణించటమే ఈ కంట్రోళ్లకు కారణం. ఈకంట్రోళ్ల మూలాన నైతిక పతనం మరింత హెచ్చుతోంది. కంట్రోళ్లే బ్లాకుమార్కెటుకు మూలం అని ఒకవాదన. కంట్రోళ్లు ఎత్తివేస్తే వెంటనే ధరలు పెరిగినా తర్వాత మళ్లీవ్యాపారం మామూలు స్థితికి రాగలదని వీరి ఆశ.

ఇప్పుడు ముందు ఆహారపదార్థాలపై కంట్రోలును క్రమంగా తీసేయవచ్చునని కొందరు వాదిస్తున్నారు, దేశంలో ఆహారం కొల్లకొల్లలుగా ఉందని కంట్రోళ్లు తీసివేస్తేనే, ప్రజలకు ఆహారం విరివిగా లభించగలదని అంటున్నారు. ప్రభుత్వపులెక్కలు గుడ్డిలెక్కలు, ధాన్యాల కొరతలేదని వీరి అభిప్రాయం. నిజానికి ప్రభుత్వపు లెక్కలలో చాలా లోపాలున్నయ్. కాని ఏమి లోపాలున్నా, ఆహారపు కొరతలేదనటం అతిశయోక్తి.

కమ్యూనిస్టు, సోషలిస్టు రాజ్యాల్లో రాజ్యాంగ, సాంఘికవిధానాలబట్టి అమలు జరిగే కంట్రోళ్లు వేరు. ఈ కంట్రోళ్లు వేరు ఆ రాజ్యాల్లో దేశపు

శ్రీ

సహజానందం


మొత్తం సంపద ప్రజలందరికీ వారి, వారి కాయకష్టం, (బుద్ధికష్టంకూడనూ) కొద్దీ వినియోగించటం లక్ష్యం. కాని ఈకంట్రోళ్లకు కారణం అలక్ష్యం కాదు. ప్రజలకు కావలసినంత పదార్థం ఉత్పత్తికాకపోవటం వల్లనే ఈ కంట్రోళ్లు పెట్టారు. ఇలా పెట్టకపోతే ఉత్పత్తి అందరికీ అందుబాటులోకి రాదు. లక్షలాది ప్రజలు లేమితో కృశించిటమే కాక, ఎన్నో రెట్లు డబ్బుపెట్టి కొనుక్కోవలసివస్తుంది. తగినంతసరుకు లేకపోవటమే కంట్రోళ్లకు కారణం. ఈ దృష్ట్యాచూసినా, ఆహారధాన్యాలు ప్రజల అవసరాలకు తగినంత ఉత్పత్తి అయితేనే, కంట్రోళ్ల రద్దు గురించి మాట్లాడవచ్చు.

ఈ ఏడాది 45 లక్షల ఎకరాలు ధాన్యాల ఉత్పత్తికి బదులు, ప్రత్తి, జనపనార పంటలకు వినియోగించబడింది.

ఇందువలన 15 లక్షలటన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గుతుంది. స్థానికంగా ఉన్నభూముల నెంత సారవంతం చేసినా, దిగుమతులు లేనిదే ఈ తెచ్చిపెట్టుకొన్న కొరత తీరదు. ఇంక ప్రజల అవసరాలు. (జనాభా 34 కోట్ల 24 లక్ష లనుకుంటే)

	కావలసిన ధాన్యం కోటి టన్నులు
1. వ్యక్తికి సగటున రోజుకు 11. 4 ఔన్సుల చొప్పున	1.07
2. రైతులకు 16 ఔన్సుల చొ. మిగతావారికి 12 ఔన్సుల చొ.	4.44
3. వ్యక్తికి సగటున 16 ఔ. చొ.	4.80

పై లెక్కలబట్టి 1948 - 49లో అయిన ఉత్పత్తి 3 కోట్ల 94 లక్షల టన్నులయితే, కావలసినవి వ్యక్తికి 11 4 ఔన్సుల చొ.



కేంద్రమంత్రివర్గంలో తిరిగి ఆరోగ్యశాఖామంత్రిగా నియమించబడిన శ్రీమతి రాజకుమారీ అమృతకౌర్ దేశభక్తిప్రమాణం స్వీకరించుచున్నారు. ఈమె విదేశాలలోవున్న కారణంగా ఈ ప్రమాణస్వీకరణ యింతవరకూ జరగలేదు.

వేసినా 4 కోట్ల 7 లక్షల టన్నులు. కాబట్టి ఉత్పత్తిని దిగుమతులతో కలుపుకొంటె, 12 ఔన్సుల రేషన్‌కు ఎలాగో బటాబటీగా సరిపోతోంది. ఆరోగ్యం దృష్ట్యా ఈ రేషన్ చాలదు. ఈ పరిస్థితుల్లో కంట్రోలు తీసివేస్తే, ఇదే సమయం అని డబ్బున్నవాడల్లా చేతనైనంత కొని నిల్వచేసుకుంటాడు. కనీసం ప్రతివాడూ 16 ఔన్సుల చొప్పున 'భుజిస్తాడు'. అంటే ఇప్పుడు రేషను తీసుకుంటున్న ప్రతినలుగురిలో ఒకనికి తిండిలేమి తప్పదు. 31-12-49 కి రేషన్లు తీసుకుంటున్న ప్రజలు దేశం మొత్తంమీద 11 కోట్ల మందికి పైగా ఉన్నారు. దాదాపు 3 కోట్ల మంది తిండికరువుకు ఆహుతి అవుతారు. కాబట్టి కంట్రోలు తీసివేస్తే క్షామానికి తలుపుతీయటమన్నమాట.

కంట్రోలు ఎత్తివేయగానే, ధాన్యాల కోసం జనం విరగబడిపోక తప్పదు. ఈ అదును చూసుకొని వ్యాపారులు ధరలు పెంచితీరుతారు. 1947 డిసెంబరులో కంట్రోలు తీసివేయగా పెరిగినవి చూద్దాం:

(1947 డిసెంబరు మొదటివారంలో కంట్రోలు ధర 100 అనే ప్రమాణం ప్రకారం).

	ధాన్యం	గోధుమ
1948 జనవరి	137	167
,, ఏప్రిలు	'44	152
,, జూన్	166	165
,, జులై	185	180
,, అక్టోబరు 2-9 తేదీల్లో	188	202

ఈమధ్య డాల్మియా భాగస్వాములు, గాంధీజీస్మారకనిధికి తాము హృదయపూర్వకంగా చందాలిచ్చినట్టు, వ్యాపారస్థులకు, పెట్టుబడిదార్లకు గాంధీజీఅంటె మరణానికి పూర్వం ంచీకూడా అత్యంత శ్రద్ధలున్నాయని ప్రకటించారు. డాల్మియాకు వ్యతిరేకంగా ఈ భక్తిశ్రద్ధ తెలాంటిదో 'డి-కంట్రోల్' తర్వాత ఈ వ్యాపారుల, పెట్టుబడిదారుల ప్రవర్తనబట్టే ప్రజలు తెలుసుకోగలరు.

దేశంలో వ్యాపారుల ప్రవర్తన ఇలా ఉంటే (గాంధీజీకిచ్చిన మాట కంటె, నెహ్రూకిచ్చేమాటకు పిరెస్కువ నిలబడుతారనుకోటం భ్రాంతి), కంట్రోళ్లు తీసివెయ్యటం, దేశంలో అశాంతిని, అసంతృప్తిని వృద్ధిచెయ్యటమవుతుంది. కంట్రోళ్లు తీసివేస్తే అధికసంఖ్యాకులైన దరిద్రులకు, అల్పాదాయాలున్న వారికి కష్టా లెక్కువవుతాయ్. గాంధీజీ సలహా అనుసరించి 'డి-కంట్రోలు' పెట్టినప్పుడు అన్నివస్తువుల ధరలు వ్యాపారుల వాగ్దానాలకు వ్యతిరేకంగా ఎలా పెరిగిందీ మనం మరచిపోకూడదు.

సంవత్సరం.	అన్ని సరుకుల ధరలు (1939=100)
1947-నవంబరు (డి-కంట్రోలుకు పూర్వం)	302
1948-మార్చి (డి-కంట్రోలుతర్వాత)	310.7
1948-జూలై	389.6
1949-మార్చి	370.2
8-4-50	391.2
6-5-50	394.1

కాబట్టి 'డి-కంట్రోలు' వలన ప్రజలకు జరిగిన ఉపకారం ధరలు పెరగటం, 1948 అక్టోబరులో ప్రభుత్వం 'ఇన్‌ఫ్లేషన్' తగ్గించేందుకని కొన్నివిధానాలను ప్రకటించారు, అయినా ధరలు పడలేదు.

	అన్ని సరకుల ధరలు (1939=100)
2-4-'48 ఈప్రకటనకు పూర్వపువారం	382.0
4-5-49	376 9
18-4.50	391.2
6-5-50	394.1
13-5 50	393 2

డి. కంట్రోలు వలన సరుకూ సమృద్ధిగా లభించలేదు. ధరలూ విపరీతంగా పెరిగినయ్. ప్రభుత్వవిధానాలవల్లనూ ధరలు పడలేదు.

ఈ పరిస్థితిలో కంట్రోళ్లను రద్దుచేయాలనటం బుద్ధిపూర్వకంగానో, అబుద్ధిపూర్వకంగానో వ్యాపారులకు ఊతం, ఉషారు ఇచ్చినట్టవుతుంది. ప్రజల శ్రేయస్సుకోసం అని అనుకోటం పొరపాటు.

స్కెచ్:

భక్తికి కీలకం

శ్రీ డా. జి. వి. స్వామి

నాకు ఆశ్చర్యం వేసింది. మా రాజులో వచ్చిన మార్పు నాకు చాల ఆశ్చర్యం వేసింది.

రాజు గొప్ప నాస్తికవాది. నాతో వైద్యం చదివే రోజుల్లో, తీవ్రమైన నాస్తికవాది. ఆఖరుకు నన్ను కూడా నాస్తికుణ్ణి చేసేడంటే నమ్మండి!

రాజు నాస్తికవాదంలో ప్రముఖుడవటం చేతనే గొప్ప జీవశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, రసాయనికశాస్త్రంలలో ప్రావీణ్యత గల విద్యార్థిగా తయారయాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. ఇంత నాస్తికుడు హఠాత్తుగా గొప్ప ఆస్తికుడయి పోయాడు కదా అని;

ఇంత గొప్పమార్పును, ఏ ప్రబలమైన సంఘటనలు తీసుకొచ్చాయా అనీ...ఇంత మార్పును కలిగిన సంఘటన ఏ జాతికి చెందుతుందా అని...ఆ జాతికి చెందిన ఆ సంఘటన ఎంత తీవ్రంగా ఉండాలా అనీ ఆశ్చర్యపోయాను.

చలనం లేని నాస్తికుడనుకున్నాం. ఏ మంత్రంకల్లో ఏ తంత్రంకల్లో, ఏ షాకల్లో ఇలా తయారయ్యాడులా వుంది అనుకున్నాను.

అయినా ఆశ్చర్యకరమైన మార్పేమిటంటే పెద్ద వ్రతాలు చేయడం—వ్రతాలుచేయడమే కాదు, వ్రతాలుచేస్తున్నానని అందరికీ చెప్పడం—చెప్పడమేమిటి ప్రకటన చేయడం—అంతే కాదు. ఆహ్వానాలు ముద్రించిపంచడం.

వ్రతం నెలరోజుల వుందనగానే... అందరకూ ఉత్సాహంతో ఈ సంగతి ఎరుక పరిచేస్తూ డప్పు వాయించేవాడు. మురిసి పోతూ చెప్పేవాడు.

వ్రతానికి నెలకు ముందే వ్రతమయినంత పని చేసేవాడు. వ్రతంకంటె ఎక్కువ హడావిడి చేసేవాడేమో!

ఈ వ్రతం, ఈ పూజ, ఇంత ఆసక్తి, ఇంత శ్రద్ధ—ఎక్కడొచ్చాయా? అని ఆలోచించాను.

ఒక వ్రతానికి నేనూ హాజరయ్యాను. రాజు వ్రతంపై భక్తికంటె వ్రతానికి వచ్చే వాళ్ళపై భక్తి చూపడం ప్రారంభించాడు.

అతిథులంటె, ఇంత శ్రద్ధ ఎందుకా అని యోచించాను.

ఏమీ పాలుపోలేదు.

వ్రతమైన తెల్లారి రాజు చాలా హుషారుగా ఉన్నాడు.

ఆనాటి సాయంకాలము, నేనూ రాజు ఒక కేసు చూడడానికి పోయాం.

కార్లో, అడిగాను 'రాజూ, ఏమిటీ పరివర్తనం' అని.

రాజు ఏమిటి అన్నట్లు చూసి 'ఓహో, ఈ భక్తి, వ్రతాలా?' అన్నాడు.

నేను ఏమో చెపుతాడని ఎదురు చూచాను.

రాజు, ఏదో తలుచుకొని నవ్వాడు!

"...ఇది పాలకొల్లురా స్వామీ... కలకత్తా కాదు ...ఒక్కొక కేసు చూడటం... ఆఖరురోజున బిల్లు వాళ్ళచేతుల్లో పెట్టడం. కోటలోపల జేబు నింపుకోడానికి—ఇది కలకత్తా కాదు, ఇది పాలకొల్లు!

'అయితే...?' అన్నాను అర్థంకాక,

"అయితే యిక్కడ రోగులు వైద్యం చేయించుకొంటారు. వెళ్ళిపోతారు, అగపడితే సలాంగిలాం కొడతారే గాని బిల్లుమాట ఏమీ ఎత్తరు! —"

పాలకొల్లులో ప్రాక్టీసు పెట్టాలనుకున్న నాకు ఆశ్చర్యం.. ఇంకా భయం వేసింది!

"అందుచేత సంవత్సరానికొకసారి, ఏ పెళ్ళీ పబ్బమో చేయించాలి.. అలా చేయించితే గాని, పిల్లల శుభకార్యాల పేర్లతో!—మన పచ్చటి పందిరిలో కూర్చుంటేగాని మనకు చదివింపులు పేరుతో పచ్చటి కాగితాలు మన ఖజానాలో నిండవు—" అన్నాడు సునాయాసంగా!

అయిదేళ్లూ నానాఅవస్థపడి డాక్టరుచదివిందానికంటె, రోగులచుట్టూ తిరిగి వాళ్ళను పరిశీలించేకంటె పెళ్ళిళ్ళు, పబ్బాలకు బదులు ఈ వ్రతాలు చేయడం కష్టం, బాధ అనిపించింది.!

'పెళ్ళిళ్ళు పబ్బాలు చేయక వ్రతాలు చేస్తావేం రా' అని అడిగాను.

"...మనకు బిడ్డా, పిక్కా లేదు కాదటోయ్! అందుకని వ్రతాలు చేయాలి—పిల్లలకోసం కాకపోయినా మన ఫీజు కోసం...!" అంటూండగానే అద్దేపల్లివారింటిముందర కారు ఆగింది.

అద్దేపల్లివారింట్లో కాలుపెట్టగానే రోగిని గురించి మాట్లాడేముందు, ఆయనగారు 'మొన్న వ్రతానికి చెక్కు పంపాను ...గ్రహించారనుకుంటాను' అన్నాడు.

నేనూ మా రాజూ నవ్వుకున్నాం, ఏదో అర్థం చేసుకున్నట్లు—నేను.

కామాక్షమ్మ

శ్రీ భమిడిపాటి వెంకటరమణ

★

కామాక్షమ్మ పేరు వింటే నా గుండె గడగడలాడుతుంది. ఆడది సాహసిస్తే ఎంత పనయినా చెయ్యగల్గుతుంది.

ఆడదాని అసూయాగ్ని ముందు పురుషుని ప్రతాపం గడ్డిపోచకున్న పనికిమాలినిది. నా సంగతికూడా అంతే అయింది: కామాక్షమ్మ క్రోధాగ్నిలో పూర్తిగా నేనూ నా భార్య, రెండుకాలలయినా నిండని నాబిడ్డ ఏడాదయినా పూర్తిగాని మా కొత్త సంసారము, కొత్తగా కొనుక్కున్న గిన్నెముంతా, కట్టుబట్టలూ, బంగారం— సమస్తంతో ఆ అగ్నిలో పడి తగలబడేవారమే కాని. ఏకొంచెమో అదృష్టం ఉండబట్టి మాగింజలు ఇంకా ఈ నేలమీద మిగిలి ఉన్నాయి కాబట్టి అగండం గడచి బయటపడ్డాం. చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు మా సమస్తమూ ఆదేవి ఆగ్రాగ్నికి ఆహుతి చేసి మేము తనువులతో మిగిలాము. బ్రతికాము.

ఉన్నట్టుండి పదిరోజులలో ఇల్లు ఖాళీ చేయమని కబురుపెట్టాడు అప్పుడు మేము ఉంటున్న యింటియజమాని. తన తన భార్యా పిల్లలతో వచ్చి అక్కడ ఉండేందుకు నిశ్చయించాడుట ఆయన. అడిగిన వెంటనే ఇల్లు ఇచ్చి, ఇన్నాళ్లు ఉండనిచ్చి, అద్దెకోసం బాధపెట్టక, నేను ఎప్పుడు ఇస్తే అప్పుడు ఎంత యిస్తే అంత పుచ్చుకొని అత్యంత సహాయకారి అయిన యింటియజమాని మాట ఎలాగ కాదని అక్కడే నిలవద్రొక్కుకుని ఉండగలను? ఆయిల్లు తనకు చాలకపోయినా, పట్నంలో తనకు సరిపోయే ఇల్లు వేరే దొరకని కారణం చేత చిన్నదయినా ఊరుచివర్ని ఉన్నప్పటికీ తనయింటికే చేరకోవలసిన అవసరం తప్పింది కాదు ఆయనకి.

తాత్కాలికంగా రెండు గడ్డిశాలలు కట్టించి కాలక్షేపం చేస్తూ క్రమంగా ఇల్లు అభివృద్ధి పరుచుకోవాలని ఆయన సంకల్పం తప్పదు. 10 వ తేదీనాటికి ఇల్లు ఖాళీచేసి వేరే ఇంటికి మారక తప్పదు. అయితే ఇంత వేగం ఇల్లెక్కడ దొరుకుతుంది? ఆయనకి మాట ఇచ్చాను. 10 వ తేదీ సాయంకాలానికల్లా మీ ఇల్లు ఖాళీచేసి మీరు వచ్చిదిగేందుకు సిద్ధంగా వుంచుతానని.

ఎక్కడయినా రెండుగదులుంటేభాగం దొరుకుతే చాలు. ఏ ఇంటికయినా ఇచ్చే అద్దే దానికికూడా ఇచ్చి ఉండవచ్చు. ప్రస్తుతానికి మళ్లీ మంచిఇల్లు దొరికేవరకు. అశ్రుతిగా వీధులన్నీ తిరుగుతున్నాను. ఏఇల్లు చూసినా రెండుకూడిళ్ళకు సరిపోయే మనుష్యులతో నిండివుండేగానీ ఏ యింటిలోనూ మరొకమనిషి నిలుమందుకి చోటులేదు.

10 వ తారీఖు వచ్చింది. ఈ సాయంకాలానికి ఇల్లు ఖాళీచేసి ఉండకపోతే ఇంటి యజమానితో నాకు జగడం తప్పదు. ఆయన ఇన్నాళ్ళుగా చూపుతూవచ్చిన ఔదార్యం ఇవాళ ఆగ్రహంగా మారక తప్పదు. నేను మాటతప్పినవాణ్ణే గాకుండా మర్యాద పోగొట్టుకున్నవాణ్ణి కూడా అవుతాను. ఈ సాయంకాలంలోపుగా ఇల్లు దొరికితే నేను ధన్యుణ్ణి.

ఆవీధిమలుపు తిరిగానో లేదో రెండు మూడిళ్లు దాటగానే మేడఇల్లు వీధితలుపు తెరుచుకొని గుమ్మంలో కామాక్షమ్మ నిలబడివుంది. కామాక్షమ్మగురించి ఇదివరకు విన్నాను. ఆడవాళ్లలో లెక్కపెట్టినలసినదని. ఆమె స్వంతప్రయోజకత్వంవల్ల భూమి, పుట్రా కొని ఇల్లూవాకిలీ కట్టిందని ఏదో పాతికవేలఆస్తి సంపాదించిందనీ. ఆవిడ అనుగ్రహిస్తే మనకష్టం గట్టెక్కక పోదు.

“ఏమండీ మీ యింట్లో అద్దెకివ్వడానికి ఏవయినా భాగాలు ఖాళీగా ఉన్నాయా?” అని ఆమెను నిండు ఆశతో ప్రశ్నించాను. నా ఆశ ఫలించింది.

“రా నాయనా, లోపల కొంత భాగం ఖాళీగానే ఉంది. మీకు సరిపోతుందేమో చూసుకుందువుగాని?” అని దగ్గరుండి నాకు ఇల్లంతా చూపించింది ఆవిడ. మాకయితే రెండుగదులు చాలు. కాని మేము కామాక్షమ్మ ఇంటివెనకకి ఉండాలి. రోడ్డుమీదకి మా యిల్లు లేకపోవడం చాలా చింతించవలసిన విషయమే అయినా ఆ పరిస్థితుల్లో నాకు ఆలోచించేందుకు వ్యవధి లేదు. సాయంకాలానికల్లా మా సామానుతో మేము దిగిపోతున్నాం. ఈలోగా మీరు ఇల్లు బాగుచేయించి సిద్ధంగా ఉంచండి. అని ఆమెకు మాట ఇచ్చేశాను. నా సమస్య ఇంత సులువుగా తీరిపోయినందుకు నాకు చాలా సంతోషమయింది. కామాక్షమ్మ నాపాలిట నిజంగా దేవతవలె అవతరించిందనిపించింది. కాని నా ఊహ కేవలం పొరపాటు. నాకు చిక్కులు ఎక్కువయాయి. నిజంగా జీవనమరణసమస్య వచ్చి పడింది. కామాక్షమ్మ నాపాలిట కాళికావతారము అయిపోయింది.

మేము సాయంకాలం సామానులతో వచ్చి దిగేసరికి మాకు మొదట ఇస్తాన్న ఇల్లు మారిపోయింది. పెరట్లో ఇంకా వెనకగా ఉండే భాగంలో రెండుగదులు మా కోసం శుభ్రపరచి సిద్ధంగా ఉంచానని చూపింది కామాక్షమ్మ. ఆ గదులు మరుగుదొడ్లకి బాగా దగ్గర. ఆపక్కనే నుయ్యి. పదిమందిఆ వాడుకునేందుకి అదే నుయ్యి. మేము కి గదులలోకి వెళ్లడానికి రావడానికి పెరటి ద్వారమే శరణ్యం. దొడ్డి బాగుచేసేది వెళ్ళడానికి పశువులు వెళ్లడానికి కూడా అదే మార్గం.

ఆ పెరటి చివరిభాగంలో కూడా మాకు ఇరుగుపొరుగులు లేకపోలేదు. మరుగుదొడ్లకి తగిలి కట్టబడిన కొట్లలో కొందరు కులం చెడ్డవాళ్లు, కాపురాలు చేస్తున్నారు. కామాక్షమ్మ చాల ఉదారస్వభావురాలు. తనదొడ్లోనే కొట్లు కట్టి ఆ కులహీనులకి ఆశ్రయం ఇచ్చింది. అందుకని ఆవిడ వాళ్లదగ్గర పదేసిరూపాయలకన్న అధికం తీసుకోదు. ఈ విషయమై పైవాళ్లకి ఎంత తెలియ

కుండావుంటే అంత మంచిది. ఆ సంగతి తెలిసినందువల్ల తనకి పన్నులు అధికం అవుతాయనే విచారం కామాక్షమ్మకు లేదు గానీ ప్రజలు తన దాతృత్వాన్నిగురించి ప్రశంసించటం ఆమెకు ఇష్టంలేదు.

కామాక్షమ్మ ధర్మసంకటాల మాట ఎలాగున్నా నాకుమాత్రం ప్రాణసంకటం వచ్చిపడింది. నా చుట్టూ మరుగుదొడ్లూ పశువుల శాలలూ, కులటల కొట్లూ దుర్గంధం. వీటికితోడు కామాక్షమ్మ మా వాటగదినే తనకు దొడ్డికి పోవడానికి దారిగా చేసుకుంది. అదీగాక ఆవిడకు బుద్ధిపుట్టినప్పుడెల్లా మాయింటిమీద వచ్చి కూచునేది. ఎప్పుడూ ఏదో తన వ్యవహారము, వ్యాపార విషయాలు మాటాడుతుంది. నన్ను తన ఏజంటుగా పనిచేయమంటుంది. చాలా లాభకరంగా వుంటుందని చెప్తుంది. ఆవిడ చెప్పిన మాటలు వింటేనేనాకు మనస్సు బాధిస్తుంది. నన్నీ నరకంమధ్యనుండి తప్పించమని నేను భగవంతుణ్ణి ప్రార్థించవలసివచ్చింది.

మేము ఉంటున్నది నరకం అన్నసంగతి మాకు మరిరెండురోజులు పోగానే స్పష్టమయింది. నేను చాలా శోచనీయమైన స్థితిలో పడ్డాను. కామాక్షమ్మ క్రూరకర్కశమైన అధికారహస్తం మామీదకూడ ప్రయోగిస్తూంది మమ్మల్నికూడా ఆ కులహీనులతోపాటుగానే సంబోధిస్తూ ఉండేది.

మాతో తన శక్తిసామర్థ్యాన్నిగురించి అప్పుడప్పుడు ముచ్చటిస్తూ తనకు తెలిసి ప్రవర్తించమనేలా బెదిరించేది.

పిల్లల్ని కొందర్ని కన్నది కామాక్షమ్మ. భర్తకూడా ఉన్నాడు. అయితే అసలే ఒకకాలు విరిగిన భర్తను మరోకాలుకూడ విరిచేసి ఒకమూల కూర్చుండబెట్టింది. అంతే కాదు; అతనిహృదయాన్ని కూడా తనపిడికిట్లో బిగించి పట్టి తన ఇష్టంవచ్చినట్లలా ఆయన్ని ఆడిస్తూంది. కామాక్షమ్మ స్వబుద్ధి ప్రయోజకత్వం విలువలు నేను నిర్ణయించలేను. వయస్సువచ్చిన తన కూతుర్ని పొరుగునే తనయింట అద్దెకుంటున్న కాలేజీకుర్రాడి చేతిల్లో పెట్టేసింది. రాబోయే అల్లుడికి చెయ్యబోయే ఆదరణకు చిహ్నంగా తను కూడా. వాడిగదిలో ఉంటూ తన కాఫీలు ఫలహారాలు అక్కడే గడుపు కునేది. ఇంట్లో మిరపకాయకూడా మాడ్చవలసిన అవసరం రానిచ్చేది కాదు కామాక్షమ్మ. ఈ సూత్రాన్నే కొంతవరకు మా క్షేమాన్ని కూడా అభిలషించి మా ఆవిడకు ఉపదేశం చేసింది. రోజూ కూరలకని, ఫలహారాలకని అంతడబ్బు ఖర్చు చెయ్యకూడదు. అంత డబ్బూ తిండికిందే ఖర్చుపెడితే మీరు మరేం ఇల్లు వాకలి చేసుకుంటారు. అని బోధపరిచేది కాని మాకీ ఉపదేశాలు పనిచేయలేదు. మేము బ్రతకడంకోసం తిండితింటూ పరుల్ని భక్షిస్తూ పొట్టలు నింపుకునే విద్యలో ప్రవీణులం కాలేము. ఆవిడగారిమాటలు మామీద పనిచెయ్యక పోవడం చూచి కామాక్షమ్మ మామీద కోపం వహించింది. కామాక్షమ్మ మా శ్రేయస్సుని ఎన్నోసార్లు ఉపదేశాలు ఇస్తూ మాకు తన అభయహస్తం చూపుతూ వుండేది. కాని మాకు ఆ మనిద్రలో ముందుముందు ఏదో మహావిపత్తు ఎదుర్కొనవలసి వుంటుందని భయమేసేది. ఎంతత్వరగా వీలయితే అంతత్వరగా కామాక్షమ్మ కవరుణాకటాక్షవీక్షణాల్నుండి తప్పించుకొనిపోతే హాయిగా బ్రతకవచ్చు ననిపించింది మాకు.

ఒకమారు కామాక్షమ్మ చేతుల్లో పడ్డవారు మళ్లీ ఆపట్టు వదలించుకొని బయటపడడం ఎంత కష్టమో నాకు ఇప్పుడిప్పుడు బోధపడింది. మేము ఆపట్టు తప్పించుకోవాలని ఎంతగట్టిగా ప్రయత్నం చేస్తున్నామో మమ్మల్ని కట్టివుంచడానికి ఆమె అంతగట్టిగా పిడికిలి బిగిస్తూంది.

సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి రాగానే మా ఆవిడ మార్గశిర లక్ష్మీవారం



నాడు కట్టుకున్న కొత్తచీర కనబడటంలేదని రిపోర్టు చేసింది. చీర మాయింటికి కామాక్షమ్మ ఇంటికి మధ్యనున్న పొట్లపందిరమీద ఆరవేసినది. సాయంకాలంవరకూ అక్కడే ఉంది సాయంకాలం కాగానే మాయమయినది. చీరకొత్తదికాకపోతే చింతలేకపోయేది. కాని కొనుక్కొని మూడురోజులయినా కాలేదు. అందులో మాఆవిడకు అత్యంత ప్రీతిపాత్రమైనది ఆచీర. సాయంకాలం ఇంట్లో పనులేవో చక్కబెట్టుకొని పందిరనున్న చీర తీసుకుందామని ఆవిడ వచ్చేసరికి చీరలేదు. ఈమాట కామాక్షమ్మతో చెప్పింది. కామాక్షమ్మ తన ఆశ్చర్యాన్నంతటినీ ప్రకటిస్తూ 'ఏమయింది?' అని అడిగింది.

ఇరుగుపొరుగుల బీదకుటుంబాలవాళ్లని పోయినచీరసంగతి ప్రశ్నిస్తూ వాళ్లని నిందాపూర్వకంగా తిట్టింది. వాళ్లని కొద్దిగా కించపరచింది. వాళ్లు మా ఆవిడఅజాగ్రత్త కారణంగా తమకు నింద వచ్చినందుకు మ మీద కళ్లు ఎర్ర చేస్తున్నారు.

"కామాక్షమ్మ అనుమతి లేకుండా ఈ ఇంట్లోపురుగయినా ప్రవేశించలేదు; ఆవిడకు తెలియకుండా పూచికపుల్లయినా పోలేదుదీని అంతేమిటో కనుక్కుందా"మని నేను స్వయంగా బయలుదేరి వెళ్లాను. నా దోరణి కనిపెట్టి కామాక్షమ్మ అవసరానికి పనికొచ్చే ఆయుధంలా తనభర్తను నామీద తోలింది. ఆయన చాలా జాగ్రత్తగా జరిగిన సంగతంతా విని, తను ముప్ఫైఏళ్లుగా కామాక్షమ్మతో చేస్తున్న కాపురం; [illegible] మాష్టరుగిరి ఈరెండిటి అనుభవాన్ని ఉపయోగిస్తూ సమాధానంఇచ్చాడు.

"మీరు చిన్నవాళ్లు; తొందరపడి ఏమాట అనేసినా మేము తొందరపడకూడదు. ఎప్పుడయినా మేము మీశ్రేయస్సును కోరేవారమే కాని మీకు కష్టం కల్గించే వాళ్లము కాము. ఎందుకయినా మంచిది. మీరు మీ వస్తువుల్ని ఇంకొకన్న జాగ్రత్తగా ఉంచుకోవడం మేలు" అని తీర్పు చెప్పాడు. కామాక్షమ్మకు తనకరుణాస్వభావమే అవిణ్ణి అప్పుడప్పుడు ముప్పు తెచ్చిపెట్టుందని మళ్లీ అలవాటుప్రకారంగా మందలించాడు.

ఈ సంఘటన ఇంతటితో ఆగితే నాకు సంతోషమయ్యేది. పోయినచీరగురించి విచారించడం ప్రయోజనం లేనిపని.

కాని అది అంతటితో ఆగలేదు.

కామాక్షమ్మ ఈ అవకాశాన్ని తీసుకొని మరొక్క దెబ్బ మామీద తియ్యాలనుకుంది కానీ అదికూడా నిష్ప్రయోజనం అయిందనగానే ఆవిడకు మేము నిజంగా శత్రువులమయిపోయాం.

"అసలు చీర పోనూలేదు, ఏమీ లేదు. నా పెరట్లోకి చీమయినా మారగలరా, ఎప్పుడయినా నా యింట్లో పూచికపుల్లయినా పోవడం మీరెరుగుదురా? ఆ అమ్మాయి అలాగ ఎత్తువేసింది. రోజూ తింటున్న చిరుతిళ్లకి బుఖాణపువాడికి డబ్బు ఇవ్వాలి. ఆయన్నడిగితే కోప్పడుతాడు. అందుకని ఆచీర అమ్మింది. లేకపోతే అంతవరకూ పందిరినున్న చీర అంతలో అంతర్ధానమవుతుందా? ఆశ్చర్యంగానీ!" అని ఇరుగుపొరుగుల ఇళ్లలో ప్రచారం చెయ్యడం ప్రారంభించింది. కామాక్షమ్మతోమాట మా ఆవిడ చెవిని పడింది.

"వెంటనే ఇల్లు మార్చడమో లేకుంటే తనకు ఆత్మహత్య చేసుకుందికి ఉపాయం చెప్పడమో ఏదో ఒకటి నిర్ణయించండి" అంది మా ఆవిడ.

నాకు తెలుసు మా ఆవిడస్వభావం. ఇతరులు నా భార్యగురించి చెప్పగా వినవలసిన అవసరం నాకు లేదు.

"ఇల్లు మార్చడమే నిశ్చయం" అన్నాను. అపొరుగునే రోడ్డుమీదకి ఉన్న ఇంట్లో అంతవరకు హాస్పిటల్ పనిమీద వచ్చివున్న కోమట్లు ఆ ఉదయమే ఇల్లు ఖాళీచేసి వెళ్లారని సంగతి తెలిసింది. వెంటనే వెళ్లి ఇంటి యజమానిని తాళం అడిగి పట్టుకొచ్చాను. కాని వెంటనే ఇల్లు మార్చడానికి కామాక్షమ్మ అనుమతి ఇవ్వలేదు. నెలాఖరు వరకు ఉంది. నెల అద్దె పూర్తిగా చెల్లించి వెళ్లిపోవడం ఉభయులకూ శ్రేయస్కరం అంది కాని కామాక్షమ్మ మాశ్రేయంకోరి చెప్పిన మాటలు కావు అవి. వాటికి చాలా అర్థముంది. తన గూటిలో చేరిన పిట్టలు చూస్తుండగా ఎగిరిపోవడం కామాక్షమ్మకు కష్టకారణం. తన ఆదాయంలో పదిరూపాయలు తగ్గిపోవడం ఆమెకు నిరుత్సాహకారణం. ఈరెండిటికీ కారణమయిన మమ్మ ఆవిడ సాధారణంగా క్షమించదలచుకోలేదు.

"నాయింటికన్న అది మంచిఇల్లా? అలాంటి [illegible] ఏపనయినా చేస్తూ ఉంటే మంచిది. ఎవరు తీసుకొన్న గోతిలో వాళ్లే పడకుండా చూచుకోవాలి" అని [illegible] పోయింది కామాక్షమ్మ.

ఆమర్నాడు మంగళవారమయింది, చవితి రానిది, దుర్ముహూర్తాలు ఉండవేది. ఇల్లు మార్చక విధి లేదు అని పట్టు బట్టింది మా ఆవిడ. ఇల్లు మార్చాం. కాని ఏం ప్రయోజనం? పూర్వంకన్న అశాంతి రేగింది. కొత్త యింట్లో నుయ్యిలేదు. నీళ్లుపోయించుకోవాలి. కామాక్షమ్మనూతిలో ఒకచుక్కయినా నీరు ముట్టుకునేందుకు మాకు అర్హత లేదని ఆవిడ శాసించింది. అంతే కాదు. అటువంటి ప్రమాదం తటస్థించకుండా మేము వచ్చేటందుకు మా చేదను కనబడకుండా చేసింది. మేము కామాక్షమ్మపోరు పూర్తిగా వదలించుకోవాలని ఎలాగా తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నామో అలాగే ఆవిడకూడా మాతో పోరుపెట్టుకోవాలని తీవ్రంగా ప్రయత్నంచేస్తోంది. కామాక్షమ్మకి కారణాలు వెతుక్కోవలసిన అవసరం లేదు.

"ఈసారి మళ్లీ మా పెరట్లోకి వచ్చినట్టుగా గానీ మానూతిలో నీరు తీసినట్టుగా గానీ తెలుసే చాలావరకు వస్తుంది. వద్దని చెప్పాక మళ్లీ ఏమొహంపెట్టుకొని నా పెరట్లో కాలు పెట్టారో? పిల్ల సంగతి మొదాగా చాలా వడిగా వుంటే, నా కంట పడితే చంపేస్తాను నా తడాఖా!" అని కామాక్షమ్మ మోసమీద గరిటె [illegible] రోడ్డుమీదకి వినపడేలా అరుస్తోంది. మా దాసీదాన్ని పిలిచి కేక లేస్తోంది. ఆమాటలలో విశేషాలు నన్ను విస్మయపరిచింది. అగ్ని ఇక్కడే ఆపకపోతే చాలాప్రమాదం కలుగచేస్తుంది. అరికేరినఆపద శత్రువుగా పక్కన వుండడం పక్కలో బల్లెంలాంటిది. అందులో ఆమాయకురాలు మా ఆవిడ ఈవిణ్ణి ఎలా ఎదిరించగల్గుతుంది. ఈ కయ్యం ఇప్పుడే త్రుంచి వెయ్యాలి సాధువుగా అని నేనే స్వయంగా వెళ్లి కామాక్షమ్మవాళ్లకి సాష్టాంగపడి మన

(32 పేజీ చూడుడు)

మన సాహిత్యంలో స్త్రీవర్ణన

శ్రీ పెనుమర్తి కామేశ్వరరావు

ఏ దేశసాహిత్యము జూచినను ఆ దేశ సాంఘిక, నైతిక, రాజకీయ పరిస్థితు లందు ప్రతిబింబించుచుండును. అది నిరవద్యము రచయితల స్వానుభవములు రచన లందు స్ఫోరకములగుటచూ సర్వసామాన్యము


సంస్కృతసాహిత్యమాంధ్రసాహిత్యమునకు గురుస్థానముగా నుండుటవలన, మన సాహిత్యములో సంస్కృతసాహిత్యమువలె స్త్రీవర్ణన మపారము. స్త్రీ శరీరసౌందర్యమును వర్ణించుటలో ప్రబంధకవులు సంస్కృతకవులను, కవిత్రయమును మించిపోయినారు. కృతిభర్తలు రాజులు. రాజులు భోగపరాయణులు. భోగపరాయణులమనసు రంజింపచేయుటకు శృంగారరసము ప్రధానము. శృంగారమునకు స్త్రీ ముఖ్యవస్తువు. మరి స్త్రీలను వర్ణించుటలో భారతదేశకవులు ప్రపంచసాహిత్యములో ప్రత్యేకస్థానమును గడించుటకు కారణ మీ దేశములోని సాంఘికపరిస్థితులు. స్త్రీ లబల. స్త్రీ భర్తను దైవముగా పూజించవలెనని మనశాస్త్రదృక్పథము. పరస్త్రీసంగమము పాపహేతువు. స్త్రీకి స్వాతంత్ర్య మస్వాభావికమని పెద్దల మూఢనమ్మకము. వనిత పురుషునివలె సర్వావయవములు గలిగి ఆలోచనాశక్తి గలిగి పురుషునికి బానిసవలె నుండి సేవాధర్మము నిర్వర్తించుట పుణ్యమను సనాతనాచారదృక్పథము భారతదేశమున విపుల ప్రచారము నంది, స్త్రీపురుషుల మధ్య ఆకర్షణము ఫలించని స్వప్నమువలె నైనది. ఫలించని కోరికలు ఫలించిన కోరికలు గల వారికథలను పఠించడమువలన పతితకాత్మలో తృప్తికల్గించును. ఇటువంటి మానసికానందము శృంగార[illegible]భంగిమలు [illegible] ప్రబంధములు ప్రజల కిప్పటికి నిచ్చుచున్నవి ప్రజల ప్రబంధ[illegible] కారణ[illegible] నోటి [illegible] స్త్రీపురుషుల మధ్య నున్న మానసికాశాంతి !

ఒకవంక ధర్మశాస్త్రములు పురుషుల కేకపత్నీవ్రతము, స్త్రీకి పాతివ్రత్యము బోధించుచుండగా, వేరొకవంక ప్రజలకు సాహిత్యముద్వారా కవులు శృంగారమును అమృతపాత్రలలో నింపి పెదవుల కందించినారు. ఆ శృంగారప్రబంధములలో కూడ వైదికాచార ప్రాముఖ్యము, శాస్త్రాదరణము, ధర్మనిష్ఠ ద్యోతకమగుచున్నవి. మనుచరిత్రలో ప్రవరాఖ్యుని పాత్ర వైదికాచారమునకు ప్రతిబింబము. కాని మనుచరిత్రను ప్రజలు వైదికాచారవిశిష్టత నెరుంగుటకు పఠించుటలేదు. ప్రజ లందరి వరూధినీకథాభాగముచే నాకర్షింపబడుచున్నారు. ఇట్లే తదితర ప్రబంధములు. మన కవులు స్త్రీలను వర్ణించెడిసందర్భములో వెనుకముందులు చూడలేదు. పార్వతి, లక్ష్మి, సరస్వతిని వర్ణించినను, వరూధిని, గిరిక, కలభాషిణి, ప్రభావతి, సుభద్రలను వర్ణించినను వారి నొక రీతిగా అవయవవర్ణన మొనరించి వారసాకారులని ప్రజ లనుకొనకుండునట్లు చిత్రించినారు. కథాభాగమున ఆ యా స్త్రీల మానసికగుణముల వర్ణించుటయందుకంటె, స్త్రీశరీరావయవముల వర్ణనములో మనకవులు విశృంఖలముగా, మిన్నగా రచించుటకు కారణము మన దేశసాంఘికపరిస్థితులు !

మన సాహిత్యములోవలె ఆంగ్లసాహిత్యములో స్త్రీశరీరావయవములను వర్ణించుట కానరాదు. 'స్త్రీముఖము ఏప్రియలు ఉదయవేళవలె నున్నది!' అని ఆంగ్లకవి వర్ణించును. వారిది చలిదేశము. ఎండకు కరువేర్పడి చలితో బాధపడెడివారికి ఏప్రియల్ మాసమున దోచు అరుణరేఖలు ఆహ్లాదకరమైనవి. ఆ అరుణరేఖలవలె స్త్రీముఖ మాహ్లాదకరమైనది.

ఆంధ్రసాహిత్యములో ప్రబంధయుగము అంతరించిన పిమ్మట-ఇటీవల ఆధునికకవులు స్త్రీలపట్ల చాల న్యాయముగ వర్తించినారు. వీరు బైరన్, షెల్లీ, కీట్సువలె ప్రణయ కవిత్వము రచించినారు గాని, తమ ప్రాచీన సాంప్రదాయమైన స్త్రీ శరీరావయవవర్ణనమును నిరాదరించుట మిక్కిలి శ్లాఘనీయము. కాని ఇప్పటివారిలో శ్రీ విశ్వనాథసత్యనారాయణగారి 'శృంగారవీధి' అనుగ్రంథము ప్రబంధమార్గమున ఆఖరు మైలురాయివలె కనిపిస్తున్నది

. ప్రబంధకవులు గ్రంథప్రారంభములో ప్రార్థనపద్యములందే స్త్రీసౌందర్యోపాసన



ఆగ్నేయాసియా పర్యటన ముగించుకొని భారతదేశానికి తిరిగి వచ్చిన ప్రధాని నెహ్రూ. పాలం విమానకేంద్రంలో ప్రముఖుల స్వాగతం.

ప్రారంభించి తాము వ్రాయబోవు శృంగార ప్రబంధములకు విజయము నాకాంక్షించినారు

కవిత్రయము ప్రార్థనపద్యములలో స్త్రీమూర్తి అవయవముల నతిగా వర్ణింపకపోవుటవలన వారు వందనీయులు. నన్నయగారు—

శ్రీవాణీగిరిజాశ్చిరాయ దధతో
వక్షోముఖాఙ్గేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం
స్త్రీపుంసయోగోద్భవామ్
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా
స్సంపూజితా వస్సురై
ర్భూయాసుః పురుషోత్తమామ్బుజభవ
శ్రీకన్ధరాః శ్రేయసే

అని మంగళశ్లోకముతో భారతము ప్రారంభించినారు

తిక్కనగారు —

శ్రీయన గౌరి నాబరగు
చెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయితమూర్తియై హరిహ
రాకారంబగు రూపము దాల్చి విష్ణురూ
పాయ నమశ్శివాయ యని
పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చు మెచ్చు పర
తత్త్వము గొల్చెద నిష్టసిద్ధికిన్.

అని తమ తెలుగుదనమాదిలో నిరూపించినారు.

వేదవ్యాసఋషిపుంగవుని సంస్కృత భారతమును కవిత్రయమువారు తెనిగించినప్పటికి— అది వారి స్వతంత్రరచనమువలె గాన్పించును భారతములో స్త్రీవర్ణనము అత్యంతరమణీయమై మనోజ్ఞాలంకారమంజులమై యొప్పుచున్నది. సంస్కృతసాహిత్యమాంధ్రసాహిత్యమునకు గురుస్థానము వహించియున్నదని ముందుగనే మనవిచేసుకొనినాను. అందువలన భారతమునకూడ స్త్రీశరీరావయవవర్ణనము సూక్ష్మముగ లేకపోలేదు. ఆదిపర్వము, చతుర్థాశ్వాసములో నన్నయ్యగారు మేనకను వర్ణించుట చూడుడు.

'అలసత యొప్పగా దరుణి
యమ్ముని వల్లభుప్రోల నున్ననా
మిళితసుగంధబంధుర రస
మీరవశంబున దూలి చేలపై
వడె వెడలన్ బయల్పడియె
వద్ధకుచంబులు గక్షయుగ్మ
మున్, లలితక్షోదరమ్ము దర
శత్రివళీయుతరోమరాజియున్.'

పెద్దనగారి మనుచరిత్రలో—

'అత డావాతపరంపరాపరిమళ
వ్యాపార లీలన్ జనా
న్వితమిచ్చోటని చేరబోయి కనియెన్
విద్యుల్లతావిగ్రహన్,
శతపత్రేక్షణ, చంచరీకచికురన్,
చంద్రాస్య, జక్రస్తనిన్,
నతనాభిన్ నవలన్ ఒకానొకమరు
న్నారీ శిరోరత్నమున్'

అను పద్యముకంటె పై నన్నయగారి పద్యము సమర్థనీయము పెద్దనగారు వరూధినిని తాను చూచి వర్ణించినటులున్నది. నన్నయ్యగారి పద్యములు గాలివలన పైట సంపూర్ణముగా తొలిగిపోవుటవలన మేనక అవయవములు విశ్వామిత్రుని కంటబడుట కవకాశము గలిగినటులున్నది.

తిక్కనసోమయాజిగారి విరాటపర్వమునండి కొన్ని యుదాహరణములు బృహన్నలవద్ద నర్తనము నేర్చుకొనునిమిత్తమై ఉత్తర తండ్రిచే కొలువునకు పిలిపించబడినప్పుడు—ఉత్తరనుగురించిన పద్యము.

అల్లదనంబున యనువుమై కొనజూచు
నడపు కాంతికి వింత తోడవు గాగ
జడవడ నూగారి వింతయై యేర్పడు
దేరని నఖులలో వారు నిగుడ,
సిట్టను ద్రోచుచు సెలవుల కలమేర
తెల్లను బిగి యెక్కి యేర్పడంగ,
దెలుపును గప్పును వలయంగ మెఱుగెక్క
తారకంబుల గెల్కితనము దొడర
జరణములును నడుము జన్నులు గన్నులు
జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు
చునికి దలుపుచుండ నుత్తర సనుదెంచె
నలువవిలుతు పువ్వుటమ్మువోలె;

మదనారూఢైన కీచకుడు ద్రౌపదితో ననుచున్నాడు.

నెత్తమ్మిరేకుల మెత్తదనము దెచ్చి
యచ్చున బెట్టిన ట్లంద మొంది
చక్రవాకంబుల చందంబు గొనివచ్చి
కుప్పలు చేసిన ట్లొప్పు మెఱసి
చందమామను గాంతికం దేర్చి కూర్చి బా
గునకు దెచ్చినయట్లు గొమరు మిగిలి
యళికులంబుల కప్పు గలయంతయును దెచ్చి
నారువోసినభంగి నవక మెక్కి
యంఘ్రితలములు కుచములు నాననంబు
కచభరంబును నిట్లున్న రుచిరమూర్తి
యనుపమానభోగములకు నాస్పదంబు
కాదె యీ త్రిప్పులెటికి గమలవదన!

ఇట్టి పద్యము లింక నన్నవి. వీనిలో శృంగారరస మాస్వాదనీయమేగాని ఇంత నాటిగ ఏ పురుషుడు తాను ప్రేమించని స్త్రీతో ననునో యూహింప శక్యము కాదు. ఇవి భావనాప్రపంచమున సంభవించెడి యపూర్వసంఘటనము.

భారతములో, ప్రబంధములలో నున్న యీ శృంగార రసము విద్యావ్యాసంగము దక్షిణిదేశము గల కొద్దిమంది కందుబాటులో నున్నది. ఏమైనను, స్త్రీఅవయవవర్ణనములో నతి-వర్ణనీయమేగాని కోరదగినది కాదు. విదేశములలోవలె మన దేశమునకూడ స్త్రీపురుషులు నిజమైన స్వాతంత్ర్యము కలిగియున్న, ప్రజలకీభావనాశృంగారపరనమ్మైన వాంఛ తగ్గిపోవును. యువతీయువకుల మధ్య వర్తమానకాలమున ప్రదాయము అత్యున్నతశిఖరాల నందుకొని, స్వేచ్ఛాప్రణయమున కవకాశములు లేక బూతుకథల పుస్తకములు, పత్రికలు చదివి మనశ్శాంతిని పొందుచుండుటవలననే, దేశములో సెక్సు పత్రికలకు విలువ ఏర్పడినది. ఈ పత్రికల ప్రచురణకు ప్రభుత్వ మనుమతించుట మరియునో శోచనీయము!

ప్రబంధయుగమును మించి నేడు శృంగారసాహిత్యము_స్వల్పభావములతో_నీచ వర్ణనములతో-వెలువడుచున్నది ఈసందర్భమున ప్రభుత్వము ప్రజాశ్రేయస్సుకోసము_భారత స్త్రీయున్నతికోసము పాటుపడి నీచసాహిత్యమునరికట్టి ప్రజల నభ్యుదయమార్గములలో నడిపించవలసియున్నది.

దేశమున సాంఘికవిప్లవము వర్ధిల్లినగాని సాహిత్యములో పురోగమనము లభ్యము కాదు.

మన సాహిత్యములో స్త్రీఅవయవవర్ణన మనుస్యూతముగ వచ్చుచున్న ఒక సంప్రదాయము. ఈ వర్ణన ముండవలసినంత యుండిన జుగుప్స కలిగించదు.

భారతీయసాహిత్యమును విదేశపండితుడు పరిశీలించిన భారతీయులు శృంగారరసప్రియులని తప్పక భావించగలడు. అధిశీతోష్ణదేశములో శృంగారరసాధిక్యత యుండుట ప్రకృతిసిద్ధముగాని అన్యము గాదు. ఈ శృంగార రసాధిక్యత జాతి నున్నతిపరచు ననుట సందేహాస్పదవిషయము. ఇది సాహిత్యమున కలంకారముమాత్రము!

ఐక్యరాజ్యసమితికి అగ్నిపరీక్ష

[సూర్యనారాయణ]


ఐక్యరాజ్యసమితి వారి భద్రతామండలి అయిదేళ్ల చరిత్రలో మొట్టమొదటి సారిగా మిలిటరీచర్య తీసుకుంది. ఉత్తర కొరియా ప్రభుత్వసైన్యాలు దక్షిణకొరియా ప్రభుత్వంపైన దురాక్రమణ జరిపినందువల్ల, దక్షిణకొరియాను రక్షించి, దురాక్రమణ దారులను వారి సరిహద్దులలోకి తరిమివెయ్యాలని సమితిసభ్యులకు భద్రతామండలి ఆదేశమిచ్చింది. దీనితో ఐక్యరాజ్యసమితి బ్రతుకుతుందో లేక నానారాజ్యసమితి దోవనే పోతుందో తేలగలదని కొందరు ప్రతినిధులన్నారు. ఇటలీ అబిసీనియాపై దురాక్రమణ ప్రారంభించినప్పుడే నానా రాజ్యసమితి అంతమయింది.

ఇప్పుడు కొరియాలో దురాక్రమణకు అమెరికా ప్రతీకారం చెయ్యకపోతే ఐక్యరాజ్యసమితి అంతమయేదా? లేక ట్రూమన్ చెప్పిన "సమితివారి పోలీసు చర్య"వల్ల అంతమౌతుందా? లేక మళ్లీ ప్రాణం పోసుకుంటుందా? అసలు కమ్యూనిస్టు చీనా సభ్యత్వసమస్యపై ట్రిగ్వీలీ రాయబారం విఫలం కావడంతోనే సమితి అంతం కాలేదా?

ఈ విషయాన్ని నిర్ణయించేముందు రష్యా అమెరికాల తంత్రాల్ని కొంత గమనించాలి. ప్రాచ్యరాజకీయనిపుణుడు ఓవెన్ లాటిమోర్ కొరియాలో సంఘటనల్ని గురించి వ్రాస్తూ రష్యా అమెరికాలు రెండూ తోడిదొంగలే నని ఆసియావాసులంతా భావిస్తారన్నాడు. ఆసియావాసులీ విషయాన్ని గ్రహించగలిగినట్లయితే కొరియాలో ఏపక్షమూ సమర్థించరానిదని బోధపడుతుంది.

రెండో ప్రపంచయుద్ధంలో మిత్రరాజ్యాలుగా చేరి దెబ్బతియ్యడంలోనూ దెబ్బతినడంలోనూ అగ్రస్థానం వహించిన దేశాలయిదూ "అగ్రరాజ్యా"లని పేరుపెట్టుకొని, ఈ అయిదురాజ్యాల అనుమతి, అంగీకారం లేనిదే ముఖ్యనిర్ణయాలు జరగరాదని ఐక్యరాజ్యసమితి స్థాపించబడినప్పుడే నిర్ణయించబడింది. ఇవి అమెరికా, రష్యా, బ్రిటన్ ఫ్రాన్సు, చీనా దేశాలు. దీన్నే వీటో అధికారం అన్నారు. నిర్ణయాలు చిన్నదేశాలకు హితవు లేకపోయినా సరే శిరసావహించవలసిందే కాని ఆ అయిదు దేశాలూ శిరసావహించవనీ, నిర్బంధించడం నిరుపయోగమనీ భావించి ఈ అధికారాన్ని అయిదుగురూ ఒకరికొకరు ఇచ్చుకొన్నారు. అప్పుడే అన్యాయమైన నిర్ణయాలకూ అగ్రరాజ్యాలమధ్య వైషమ్యాలకు అవకాశానికీ తావివ్వబడింది.

యుద్ధం ఆఖరుదినాలలో మిత్రరాజ్యాలుగా వ్యవహరించిన రష్యా అమెరికా



ఐక్యరాజ్యసమితి వైజ్ఞానిక మండలి సర్వసభ్య సమావేశానికి భారతప్రతినిధిగా వెళ్లిన సర్ కె. యస్. కృష్ణన్ కొలంబియా విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్ర శాఖ ఆచార్యులు రాబీతో ప్రసంగించుతున్నారు. ఫ్లోరెన్సు విశ్వవిద్యాలయం చేరువలో వాహ్యాళి జరుపుతుండగా తీసిన చిత్రం.

సైనికవ్యూహాలు పరస్పరసందేహాలతో నడిచాయి. ఆఅంతర్వైరాలను ఐక్యరాజ్యసమితి ద్వారా పరిష్కరించుకోడానికి వీలౌతుందని మొదట అందరూ ఆశించారు. కాని సమితి క్రమంగా ఈవ్యూహాలకు తంత్రాలకు రంగమయింది. సమితిలో కల "చిన్న దేశాలను" తమ పక్షానికి చేర్చుకుని తమ కనుకూలంగా నిర్ణయాలు చేయించాలని రష్యా అమెరికాలు రెండూ కృషిచెయ్య నారంభించాయి. వివాదాలు అంతర్జాతీయకలహాలూ సంభవించినప్పుడు రష్యా అమెరికాలు తమ తమ అనుకూలపరిస్థితులను పరిగణించాయే కాని న్యాయాన్యాయాలను విచారించనే లేదు. ప్రతివిషయాన్నీ రాగల మూడో ప్రపంచయుద్ధంలో వ్యూహాల అంచనాలను బట్టి స్థావరాల ఆర్జననుబట్టి, ఆయా దేశాలను తమ పక్షానికి తిప్పుకునే అవకాశాన్ని బట్టి విచారించ నారంభించాయి. ఈనాటకంలో "చిన్న రాజ్యాలు" తటస్థవైఖరిని కాని న్యాయమార్గాన్ని కాని అనుసరించలేకపోయినవి. ఏ భారతదేశమో అనుసరించ యత్నించినా తటస్థవైఖరి అసంభవమయింది. ఉభయవర్గాలను నిరోధించగల బలమైన తటస్థ వర్గ మొకదాన్ని నిర్మించగల అవకాశం అనేకమార్లు లభించినప్పటికీ చిన్న రాజ్యాలు ఆ తరుణాన్ని వినియోగించలేకపోయినవి.

జర్మనీ, జపాన్, ఇటలీ, హంగేరీ మొదలైన దేశాలతో శాంతిసంధిఒడింబడికల సందర్భంలో కాని, ఇండోనీషియా, కాశ్మీర్ దురాక్రమణల్లో గాని, దక్షిణాఫ్రికా ప్రభుత్వజాతివిద్వేషసమస్యలో గాని అగ్రదేశాలూ, వాని నంటిపెట్టుకున్న చిన్న దేశాలూ న్యాయవిచారణ జరపలేకపోయినవి. అనేకదేశాలలో ప్రజలు నిరంకుశ పరిపాలనకీ పీడనకీలోనై అన్యాయానికి గురైనప్పుడు సమితి వారిని రక్షించలేకపోయింది.

ఈరీతిగా ప్రారంభమై న్యాయాన్యాయాలతో నిమిత్తంలేకుండా కేవలం రష్యా అమెరికాల ఎత్తుపైయెత్తులకు మాత్రమే వినియోగపడిన ఐక్యరాజ్యసమితి ఆదిలోనే బలైపోయిందనీ, అనేకచిన్న రాజ్యాల, పీడిత ప్రజల ఆశ భగ్నమయిపోయిందనీ చెప్పాలి.

ఈ వ్యూహాల కారణంగా ఒక్క స్థిరమైన నిర్ణయం చెయ్యలేక, ఒక్కచోట కూడా అన్యాయాన్నీ దురాక్రమణనీ అరికట్టలేకపోయిన ఐక్యరాజ్యసమితి ఈనాడు కార్యదక్షత కనపరిచిందంటే, ఇది సమితి దుష్టశిక్షణకు శిష్టరక్షణకు బలాన్ని ఆర్జించగలిగిందని కాని న్యాయమార్గాన్ని గోచరింపచేసుకుందని కాని అర్థంకాదు. ఒకవర్గం చేతిలో కీలుబొమ్మగా మారిపోవడంవల్లనే. అమెరికా రష్యాలు సమితిలో బలం ఆర్జించుకోడానికి చేసిన పోటీలో ఒకరుగెల్చి మరొకరు వీగిపోవడంవల్లనే, వీగిపోయిన రష్యా తన అనుచరవర్గంతోసహా సమితిసంస్థలన్నిటినుంచీ (సర్వసభ్య సమావేశంనుంచితప్ప) నిష్క్రమించింది, ఇంక సమితిచేత నిశానీ సంతకం పెట్టించడానికి అమెరికాకు క్షణం పట్టలేదు. పేకాటలో గెలుపొందుతున్న అమెరికాచేతిలో తురఫుల్ని ప్రాణపణంగా పట్టుకుని కూచుంది. రష్యా పేచీపెట్టి ముక్కలు పారవేసి లేచిపోయింది. తురఫులు తన చేతో పట్టుకుని, మిగతావారి చేత కానసాగిస్తోంది అమెరికా. ఈఆట సక్రమమైన దేనని, దీనివల్ల లోకశాంతిని కాపాడుతున్నాననీ చెప్తూ ట్రూమన్ కొరియామీద తురఫు ప్రయోగించాడు. భారతప్రభుత్వంకూడా రష్యా లేచిపోయినా ఆట ఆగిపోలేదన్నట్లుగా తురఫుప్రయోగం సక్రమమేనని వ్యాఖ్యానించింది.

ఈరీతిగా తన నిర్ణయాల్ని చిన్న రాజ్యాలన్నిటినెత్తిపైనా రుద్దడానికే అమెరికా ఇంకా సమితినాటకాన్ని నడుపుతోంది: రష్యావర్గాన్ని సమితిలో ఉంచి సంఖ్యాధిక్యతఆధారంతో తననిర్ణయాల్ని సమితినెత్తిపైన రుద్దడానికి అమెరికా యత్నించి సాధించగలిగింది. రష్యా సాధించలేక చీనా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని సమితిలో ప్రవేశపెట్టే వంకతో ప్రతిష్టంభన తెచ్చి ఏనిర్ణయాలుచేసినా చెల్లకుండాచేసింది. కాని ఈ నిర్ణయాలు చెల్లాలని అమెరికా పట్టుదల. రష్యన్ వర్గంలేని సమితిలో అమెరికామాటకి తిరుగులేదు. భారతదేశం యుగోస్లావియా తటస్థవైఖరిని అవలంబించినప్పటికీ అమెరికా మాటకి తిరుగుండదు.

ఈ ఎత్తుతోనే పెకింగ్ ప్రభుత్వానికి ప్రవేశమివ్వాలని బ్రిటన్ కోరినా అమెరికా ప్రతిఘటించింది. సమితిప్రధానకార్యదర్శి ట్రిగ్వీలీ సూచించిన శాంతిసాధన కార్యక్రమాన్ని నిరాకరించింది.

వాస్తవానికి ఐక్యరాజ్యసమితి ప్రాబల్యం మార్షల్ ఆర్థికప్రణాళిక ప్రారంభంతోనే క్షీణించిందని చెప్పాలి. దేశాలమధ్య శాంతిని కాపాడాలంటే సమితి చాలదనీ, ఏదేశానికాదేశం స్వయంగానో, కొన్ని ఇతరదేశాలతోనో చేర ప్రమాదసమయంలో ఒకరికొకరు తోడుగా ఉండడం అవసరమనీ అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు మొదలైన దేశాలు భావించినప్పుడే సమితిప్రతిష్ఠ కొరతపడింది. ఆనాటినుంచీ రష్యా అమెరికాలు సమితిపైన దెబ్బతీస్తూ వచ్చాయి. రెండో ప్రపంచయుద్ధంలో మిత్రరాజ్యాల సైన్యాలకు విజయాలు లభించడం ఆరంభమైనదిమొదలు స్థావరాల సంపాదన రష్యా అమెరికాలకు ముఖ్యాశయమయింది. సమితి రాజకీయాల్లోకూడా ఇదే ప్రధానమయింది. ఈఉభయదేశాల వ్యూహాలకు గురైనవి జర్మనీ, బాల్టిక్ దేశాలు, బాల్కన్ దేశాలు (ముఖ్యంగా గ్రీస్, యుగోస్లావియా), టర్కీ పర్షియా, భరతఖండం, (ఫలితం విభజన) తూర్పుఆసియా (ముఖ్యంగా చీనా, కొరియా, ఇండోచీనా) జపాన్ దేశాలు. జపాన్ నౌకాబలం ధ్వంసమై ఓటమి నిస్సందేహమని తోచినప్పుడుకూడా రెండు పట్టణాలపై ఏటంబాంబులు ప్రయోగించి లక్షలాదినిరాయుధప్రజల్ని హతమార్చడానిక్కూడా ఇదేకారణం. ఉభయవర్గాల వ్యూహాలూ క్రమంగా రూపొంది వానిమధ్య కల దేశాలు దాదాపు అన్నీ ఏదోఒకవర్గానికి చెందినట్లు స్థిరపడిపోవడం తటస్థించగానే ఈవ్యూహం బలహీనమైన తావులకోసం వెతకడం ప్రారంభమయింది.

రష్యాచుట్టూ పశ్చిమోత్తరంనుంచి తూర్పువరకూ ఈక్రింది ప్రాంతాల ఆంగ్లో—అమెరికన్ వర్గం వ్యూహం పన్నింది: నార్వే, స్వీడన్, పశ్చిమజర్మనీ, బెర్లిన్, ఆస్ట్రియా, యుగోస్లావియా, గ్రీస్, టర్కీ, పర్షియా, ఆఫ్ఘనిస్తాన్, టిబెట్, నేపాల్, భారతదేశం, పాకిస్తాన్, మలయా, సయాం, ఇండోచీనా, హాంకాంగ్, ఫిలిప్పైన్సు, ఫార్మోజా, చీనా, ఒకినావా, కొరియా, జపాన్, ఎల్యూషియన్సు, అలాస్కా. ఈ పద్ధతిలో చీనా రష్యన్‌వర్గంపాల బడింది. రక్షకులోనున్న దేశాల్ని రష్యా పూర్తిగా లోబరుచుకుంది, టిబెట్,—నేపాళదేశాలలో భారతదేశం తటస్థవిధానం మూలంగా అమెరికన్‌వ్యూహం విఫలమయింది. ఇంక కొరియా, ఇండోచీనా, సయాం, ఫిలిప్పైన్సు ఆఫ్ఘనిస్తాన్, ఆస్ట్రియా గ్రీస్‌లు బలహీనంగా ఉన్నాయి. కొన్ని పూర్తిగా అమెరికాపక్షానికి చేరి

పోలేదు. కొన్ని అశాంతికి గురైనాయి. హాంకాంగ్, మలయాలలో బ్రిటన్ స్థిర స్థావరాలేర్పరచుకుంది. పర్షియా, టర్కీ, యుగోస్లావియా స్కాండినేవియన్ దేశాలు అమెరికా పక్షం చేరిపోయాయి. సందిగ్ధంగా ఉన్న ప్రాంతం క్రమంగా చిన్నదైపోయింది. బలహీనంగా ఉన్న ప్రాంతాలలో అమెరికా ఆయుధసామగ్రి సహాయాన్ని, ఆర్థికసహాయాన్ని విరజిమ్ముతోంది.

కాబట్టి ఇంక కమ్యూనిస్టువర్గం ఎక్కడ కదిలినా అమెరికా దెబ్బతియ్యడానికి సన్నద్ధమయింది. అందువల్లనే ఐక్యరాజ్యసమితిలో కమ్యూనిస్టుచీనా సభ్యత్వసమస్య పరిష్కారసాధ్యమైనప్పుడు కూడా సాధ్యపడకుండా అమెరికా చేసింది. బ్రిటన్ ప్రతిపాదనను కూడా అమెరికా నిరాకరించింది.

ఉభయత్రా వ్యూహం ఈరీతిగా ప్రమాదభరితంగా ఉండగా కాలం అట్టేమీరడం ఉభయవర్గాలకీ లాభదాయకంగా లేదు. ఈతంత్రాల ఫలితంగా ప్రపంచంలో తటస్థ విధానం బలపడే సూచనలు కానవస్తున్నాయి.


అమెరికాతో అట్లాంటిక్ పాక్ట్ చేసుకున్నది మొదలు పశ్చిమయూరప్‌లో సోషలిస్టుపక్షాలు క్రమంగా తటస్థవైఖరిపట్ల మొగ్గుతూ వచ్చాయి. అమెరికా ఒత్తిడి మూలంగా ఆదేశాల దేశరక్షణఖర్చులు అమితంగా పెరిగిపోయాయి. ఈఖర్చు హెచ్చింపు 1952 లో మార్షల్ ప్రణాళిక ముగింపుతో పరిస్థితి తారుమారై తటస్థవర్గం బలపడే సూచనలు కనిపించాయి. ఖర్చుల హెచ్చింపు ఫలితం ఆదేశాల ఆర్థికవ్యవస్థలో కానరాక పూర్వమే ఆదేశాలన్నిటినీ అమెరికా తన పక్షాన శాశ్వతంగా బంధించుకోడానికి సాధనం అవసరమయింది. రష్యన్ ప్రచారం, ఆర్థికహైన్యం బలపడకముందే పశ్చిమయూరప్‌పై బలహీనవర్గంలో చేరకముందే కార్యాచరణ అవసరమయింది. ఈ తరుణం మించిపోకుండానే సమితిలో రష్యన్‌వర్గాన్ని పూర్తిగా ఓడించగలిగింది. అమెరికా ఇండోచీనాలో బావోడాయ్ ప్రభుత్వాన్ని యుద్ధానికి సన్నద్ధపరుస్తున్న సమయం చూసి రష్యన్‌వర్గం కొరియాలో కమ్యూనిస్టులకు సైగనిచ్చింది. చీనాలో దెబ్బతిన్న అమెరికా తనబలాన్నీ, సమితిలో తన ప్రాబల్యాన్నీ నిరూపించుకోడానికి తరుణాన్ని పోనివ్వలేదు.



ఇండొనీషియాలో ప్రధాని నెహ్రూ — టాండ్ జాంగ్ ప్రియాకుకు ప్రధాని నెహ్రూ సోకర్నోల ఆగమనం. వెనుకనున్న వారు ఇండొనీషియాలోని భారతరాయబారి సుబ్బరాయన్.

చర్య తీసుకోవాలని భద్రతామండలి ఆదేశించకముందే అమెరికన్ అధ్యక్షుడు తననౌకావిమానబలాలకు ఆజ్ఞ ఇచ్చాడు. దురాక్రమణ విరమించి సరిహద్దుకు మరలిపోవాలని ఉత్తరకొరియాకు సూచిస్తూ భద్రతామండలి ఆదివారంనాడు చేసిన తీర్మానం ఆధారంగా ఈరీతిగా చేసినట్లు ట్రూమన్ ప్రకటించాడు. వాస్తవంగా చర్య తీసుకోవాలని భద్రతామండలి మంగళవారంనాడు ఆదేశించింది. అమెరికన్ అధ్యక్షుడు సోమవారంనాడే యుద్ధంలో జోక్యం చేసుకున్నాడు.

దీనివల్ల సమితి ఏనాడో నిర్జీవమైపోయిందని భావించవలసివస్తుంది. న్యాయాన్యాయ విచక్షణ చేయలేక, అశక్యం కలిగినప్పుడు కూడా స్థైర్యంతో చర్య తీసుకోలేకపోయినప్పుడే సమితికి మారకదశ ప్రారంభమయింది. ఏ ఆశతో ప్రపంచంలోని అత్యధిక దేశాలు, ముఖ్యంగా చిన్నదేశాలు సమితిలో చేరాయో ఆ ఆశ ఆరంభంలోనే భగ్నమైపోయింది. సమితిలో తన మాటకెదురులేదనే భావంతో, తటస్థవాదులకు, రాయబారాలకు అవకాశమివ్వకుండా అమెరికా చర్యతీసుకోవడంతో సమితి తుదముట్టినట్లే భావించాలి. ఇకపైన (సర్వసభ్యసమావేశంలో రష్యా పాల్గొనదనీ, పరిస్థితిలో మార్పురాదనీ స్థిరీకరించుకునే పక్షంలో) అమెరికా ఆజ్ఞలను చిన్నరాజ్యాలచేతను తటస్థరాజ్యాలచే తనూ శిరసావహింపచేయడంమాత్రమే సమితికర్తవ్యానికి మిగిలి ఉంటుంది. పరిస్థితి మారితే తప్ప వాస్తవంగా తటస్థవిధానాన్ని అవలంబించగోరే దేశాలకు సమితినుంచి నిష్క్రమించడం తప్ప అన్యమార్గం లేదు.



సింగపూర్‌లోని కాళంగ్ విమానకేంద్రంలో ప్రధాని నెహ్రూకు ఆహ్వానం, ప్రజలందరికి దర్శన మివ్వడానికిగాను ప్రధాని నెహ్రూ కారులో లేచి నిల్చున్నారు.



బోగ్యోకే, అంగ సాన్ మొదలైన బర్మా మృతవీరుల సమాధులవద్ద పుష్పమాలనుంచి భారత ప్రధాని నెహ్రూ జోహారు లర్పించుతున్న దృశ్యం.




ష్వే డాగన్ బౌద్ధ స్వర్ణ దేవాలయంలో ప్రధాని నెహ్రూ స్వర్ణపత్రాన్ని ప్రతిష్ఠించుచున్న దృశ్యం.

పూర్,
స్తా
లో
ని
గ్రా



భారతప్రధాని నెహ్రూకు మంగళదాస్ విమాన కేంద్రంలో బర్మాప్రధాని థాకిన్నూ స్వాగతం.





సింగపూర్‌లో మహాత్మాగాంధీ స్మారకచిహ్నం. ప్రధాని నెహ్రూ శంకుస్థాపన.

ఫిలింపరిశ్రమ: పెద్దలసలహాలు

ఫిలిం పరిశ్రమయొక్క మంచిచెడ్డలు విచారించడానికీ, దాని అభివృద్ధికై చేసినసూచనలుసేకరించి ఒక నిర్దిష్టప్రణాళిక తయారుచేయడానికీ కేంద్రప్రభుత్వం నియమించిన ఫిల్ము ఎంక్వయిరీకమిటీ మద్రాసు, ఢిల్లీ, అల్లాహాబాదునగరాల్లో ఫిల్ముపరిశ్రమపరిస్థితులు విచారించినపిదప బొంబాయిలో విచారణ ప్రారంభించింది. ఈవిచారణ బొంబాయి కౌన్సిల్ హాల్లో 11 రోజులపాటు జరిగింది. ఎంక్వయిరీకమిటీచైర్ మెన్ యస్. కె. పటేల్ తాత్కాలిక చైర్ మెన్ డాక్టర్ ఆర్. పి త్రిపాఠీ హాజరుకానందున వారిస్థానంలో సమావేశాలకు పార్లమెంటుసభ్యుడు సత్యనారాయణ అధ్యక్షతవహించారు. సమావేశాల్లో పాల్గొన్న మిగతాసభ్యులు శ్రీయుతులు వి. శాంతారామ్, యస్. యన్. సర్కార్, వి. శంకర్, యస్, గోపాలన్ (సెక్రటరీ). ఈ సమావేశాల్లో ప్రముఖవ్యక్తులు యిచ్చిన సాక్ష్యాలు:

చందులాల్ షా:

ఫిలింపరిశ్రమ మొత్తంగా తీసుకుంటే దెబ్బతిన్నదనే చెప్పాలి. దీనికి ముఖ్యంగా కారణం చిత్రనిర్మాణానికి కావలసిన పెట్టుబడి సేకరించడంలో ఎదురయ్యే కష్టాలే.

దేశంలో కావలసినన్ని థియేటర్లు లేవు. దీనివల్ల చిత్రాలు విడుదలచేయటానికి థియేటర్లులేక ఆచిత్రాలు టిన్నుల్లోనే మూల్గుతూ వుండవలసివస్తుంది.

ప్రభుత్వాధికారులు పరిశ్రమమీద తమ చిత్తమొచ్చినట్లు విధించేపన్నులు పరిశ్రమ రక్తాన్ని పీల్చేస్తున్నాయి.

పరిశ్రమనిలకడ నికరంగా, దృఢంగా వుండాలంటే కనీసం 5 కోట్ల రూపాయల ఫండయినా వుండాలి. చిత్రనిర్మాణం ప్రారంభమయినదగ్గరనుండీ ప్రజలనుండి డబ్బు వసూలుచేసుకునేవరకు ఆర్థికస్తోమతుండాలి. దీనివల్ల ప్రొడ్యూసర్లు, డిస్ట్రిబ్యూటర్లు అవసరానికి విపరీతమైన వడ్డీలతో అప్పులుచేసే పరిస్థితులనుండి విముక్తులవుతారు:

ప్రస్తుతం పరిశ్రమలో బాగా డబ్బు చేసుకుంటుండేది థియేటరుయజమానులు, [illegible] థియేటరుయజమానులు సంపాదించే లాభాలుమాత్రం పరిశ్రమకు తిరిగి రావడంలేదు. తయారైన చిత్రాలలో నూటికి 75 చిత్రాలు ఖర్చులుకూడా పూడ్చుకోలేకపోయాయి.

చున్నీలాల్:

యుద్ధానంతరపరిశ్రమలో చాలావరకూ అభివృద్ధి కనిపిస్తోన్నా, ఆర్థికవ్యవస్థమాత్రం అసంతృప్తిగా వుంది. పెట్టుబడిపై ఫలామణీ

'కౌసరా'

లోవున్న విపరీతమైన వడ్డీలు ఆదాయంలోని చాలాభాగాన్ని మింగేస్తోంది. దీనికి మార్గం ప్రభుత్వం కల్పించుకోవడమే. ఇంగ్లాండులో ప్రభుత్వం స్థాపించిన 'ఫైనాన్స్ కార్పొరేషన్' లాంటి సినిమా ఆర్థికసహాయసంస్థను అయిదుకోట్ల పెట్టుబడితో స్థాపించి ప్రొడ్యూసర్లయొక్క ఆర్థికావసరాలనుతీరుస్తూ వుండాలి.

బొంబాయి - మద్రాసు ప్రభుత్వాలు విధించే వినోదపన్నుభారం ప్రేక్షకులమీదనే పడుతుంది.


దేశంలో ఇంకా అయిదు వందలు పర్మనెంటు సినిమాలు ఎంతైనా అవసరం.

టెక్నీషియన్లనీ, నటీనటుల్నీ, తరిఫీదు చేయటానికి ఒక కేంద్రం నెలకొల్పాలి. దేశీయభాషల్లోకి 'డబ్' చేయబడ్డ విదేశీయ చిత్రాల ప్రదర్శనం అరికట్టాలి.

ప్రభుత్వం నియమించిన ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ స్కీముల్లో ఫిల్ముపరిశ్రమనుకూడా చేర్చాలి.

బాబూరావ్ పాయ్:

అవసరమైతే భారతేతర చిత్రాలు



1949 వ సంవత్సరపు ఉత్తమ తెలుగుచిత్రంగా నిర్ణయించబడిన 'నవజీవనం' చిత్రనిర్మాత కె. బి. నాగభూషణంగారికి మద్రాసు ప్రధాని శ్రీ కుమారస్వామిరాజాగారు రజితపాత్రను బహూకరించిన దృశ్యం.

నిర్మించి ఇతరదేశాల్లో ప్రదర్శనాలు ఏర్పాటుచేయాలి.

చిత్రంయొక్క నిడివిపై నిర్బంధాలు వుండకూడదు. తన చిత్రాలకు కావలసిన నిడివిని ఎంచుకోవడానికి ప్రొడ్యూసరుకు పూర్తిస్వేచ్ఛవుండాలి,

అనేకచిత్రాలు తయారవుతోన్నా కొన్నిమాత్రమే విడుదలకావడం పరిశ్రమకు తీరని నష్టం.

యుద్ధకాలంలో చిత్రనిర్మాణంపై యున్న నిర్బంధాల్లోకొన్ని అవసరంగా కనిపిస్తున్నాయి. యిటువంటి కంట్రోల్ వల్ల పరిశ్రమలో రద్దు చాలావరకు తగ్గుతూంది.

నటీనటుల కొరవ ముఖ్యంగా ఈనాటి సమస్య. పాత్రలకు తగిననటీనటుల్ని ఏరుకోవడం కష్టంగా వుంది,

నటీనటుల్ని తరిఫీదుచేయడాని కితగిన కొన్నికేంద్రాలు నెలకొల్పాలి.

చిత్రాల్ని ప్రదర్శించే అవకాశం ప్రభుత్వం ఎక్కువకలిగించాలి. గ్రామసీమల్లోకి చిత్రాల్ని తీసుకుపోయేటూరింగ్ సినీమాలపై నిర్బంధాలు తగ్గించాలి.

క్రొత్తథియేటర్లని వికట్టకూడదన్న నిషేధంద్వారా థియేటర్ యజమానులు సంపాదించే లాభాల్లో కొంతభాగాన్ని తిరిగి పరిశ్రమకు పెట్టుబడి పెట్టించే ఏర్పాటు చేయాలి.

జె. పి. తివారి :

చిత్రనిర్మాణంలో అనేకఅవకతవకలు కనిపిస్తోన్నాయి. సరైన కార్యక్రమం లేకపోవడం—అనుకున్న ప్లానుప్రకారం నడుచుకోక—ఎప్పటికప్పుడు క్రొత్తఆలోచనలకుపోవడం—చిత్రనిర్మాణంలో ఎక్కువఖర్చులకు కారణమౌతోంది.

పూర్వం ఫిలిమ్‌పరిశ్రమను కేవలం కొంతమంది నాట్యకత్తెల - గాయకులతోమాత్రమే వినోదకేంద్రంగా భావించేవారు. ఆదృష్టి మారి ఒక వ్యాపారసంస్థలా ఫిల్ముపరిశ్రమకూడా కష్టపడి పనిచేసి వినోదాన్నిస్తుందని తెలుసుకుంటేకాని పరిశ్రమ అభివృద్ధి కాదు.

సినీమాప్రేక్షకుడు చెల్లించే రూపాయిలో ఎక్కువ బాధ్యతతో శ్రమపడ్డ ప్రొడ్యూసరుకు కేవలం మూడణాలు మాత్రం దక్కుతూంది. వినోదంపన్నుద్వారా ఆదాయంలో మూడవభాగం ప్రభుత్వం స్వాహా చేస్తుంది. మిగిలినదాంట్లో సగం ఎగ్జిబిటర్ తీసుకుంటాడు. ఆమిగిలినదాంట్లో డిస్ట్రిబ్యూటరు మూడవభాగంవరకూ తనవంతుగా తీసుకుని శేషాన్ని ప్రొడ్యూసరుకు వదుల్తాడు. ఈవిధంగా ఎగ్జిబిటర్‌వంతుకు అధికంగా పోతుంది.

చిత్రనిర్మాణంలో ప్రభుత్వం కొన్ని నిర్బంధాలు పెట్టడం అంతమంచిపని గాదు. కాని పరిశ్రమే కొంతమందివ్యక్తులతో ఒక సంఘాన్ని స్థాపించి అది తయారుచేసే కొన్ని సూత్రాలూ - నిర్బంధాలూ - అంటే అధికనిర్మాణాన్నీ - అవకతవకలాభాలపంపకాన్నీ - అరికట్టడానికి - పాటించబడడం యుక్తంగా వుంటుంది.

ఏ. జె. పటేల్:

భారతీయపరిశ్రమఅవసరాల మేరకు ముడిఫిల్ముపరిశ్రమను స్థాపించడం అంతసమంజసం కాదు. అటు పశ్చిమరాజ్యాల్లో ఇటు జపానులో ముడిఫిల్ముపరిశ్రమను పరిశీలిస్తే, జపానుపరిశ్రమలో పద్ధతులు తక్కువ పెట్టుబడి, తక్కువ పెషినరీతో ఎక్కువ ఫలితనం చూపిస్తూ విజయవంతం కావడం కనిపిస్తుంది.

మనదేశంలో తయారయే కెమికల్సు యొక్క దిగుమతిపై ఎక్కువ నిర్బంధముండడంచేత కెమికల్సుయొక్క నాణ్యంపై ఏవిధమైన కంట్రోల్ లేకపోవడంచేత తయారయ్యే కెమికల్సు ఒకవిధంగా వుండక ఖర్చుకు దారితీస్తుంది, పోటీలవల్ల బొంబాయిలో ప్రాసెసింగ్ చార్జీలు చాలచౌకగా వున్నాయి. కాని యీచార్జీలు ఏవిధంగానూ లాభదాయకం కాదు.

నలినీ జయంత్

చిత్రనిర్మాణంలో ముందుగానే ఒక చక్కటి కార్యక్రమం తయారుచేసుకోడం యీరోజుల్లో కనబడ్డంలేదు. చాలవరకూ షూటింగురోజునే నటులకు వారిపాత్రలేమిటో చెప్తారు. డైరక్టరు సెట్టుమీదనే ఆపాత్రకు కావలసిన 'యాక్షన్' నిర్ణయిస్తాడు. ఒకవైపు షూటింగు జలుగుతూండగానే ఒక్కోసారి డైలాగ్సు తిరిగి వ్రాయిస్తూవుంటాడు. ఈ పరిస్థితులవల్ల నటీనటులు చాలవరకు రాణించలేకపోతున్నారు.

ఈనాడు బాగా చలామణీలో వున్న ఎరువుగొంతుపద్ధతి (ప్లేబేక్) వ్యక్తిగతంగా నాకేమీ యిష్టంలేదు. దీనికి కారణం ఎరువు తెచ్చుకున్న గొంతు సాధారణంగా ఆ తారకు నరిపడదు. పైగా సంగీతదర్శకులు గొంతుల విషయంలో వాళ్లయిష్టమొచ్చినట్లు వ్యవహరిస్తారు. పరిస్థితు లెట్లావున్నా ఒకప్రత్యేకగొంతును వినియోగించడం మీద ఒత్తిడి తెస్తారు. చిత్రనిర్మాణంలో సంగీతం ఎక్కువ ప్రాతినిధ్యం వహించడంచేత సంగీతదర్శకునిమాట నిరభ్యంతరంగా చలామణీ అయిపోతుంది.

తారల జీవితాల్లో ఆదాయంపన్ను చాలాభాగం పోగా మిగిలింది ప్రజలు వూహించుకున్నంత పెద్దమొత్తాలు కావు. తారలయొక్క సంపాదనకాలం చాలాతక్కువ. ఎదురుచూడ్డానికి ఎటువంటి పెన్షన్లు లేకపోవడంచేత ఈకాలంలో సంపాదించిన ఆదాయంతోనే జీవితాన్నంతా పోషించుకోవాలి. తారల ఆదాయంమీద పూర్తి ఆదాయంపన్ను వసూలుచేయడం న్యాయం కాదు. కాగా చెదురుగా తారలకు సభంవించే ప్రమాదాలకయే ఖర్చు మినహాయింపు చేయడంలేదు. సంగీతం, నృత్యం తప్పెదుకై ఖర్చుపెట్టినడబ్బు వారికి తిరిగి ముట్టడంలేదు.

తారలు ఒకేసారి అనేకచిత్రాల్లో నటించడంవల్ల చిత్రనిర్మాణం అనవసరంగా దెబ్బతింటుందని ప్రొడ్యూసర్లు ఫిర్యాదుచేస్తే దానికి విరుగుడుకూడ ఆప్రొడ్యూసర్ల చేతుల్లోనేవుంది, తారల్ని క్రొత్త కాంట్రాక్టులపై బలవంతంగా సంతకాలు చేయించేది ప్రొడ్యూసర్లు. ఆ సమయంలో తారలు మాసంలో కనీసం నాలుగైదు షూటింగు రోజులు తమచిత్రానికిస్తే చాలన్న తృప్తిని ప్రొడ్యూసర్లు వెల్లడిస్తారు. ఈ ప్రొడ్యూసర్లే తరువాత తారలిచ్చే షూటింగు రోజులు సరిపోవడంలేదని తత్కారణంగా చిత్రనిర్మాణం మందగించిందని ఫిర్యాదుచేయడం సమంజసం కాదు.

ఒకసంస్థతో కొంతకాలం కాంట్రాక్టు చేసుకోవడం—స్వేచ్ఛగా(*Free La ci g*) వ్యవహరించడం యీ రెండు పద్ధతుల్లో రెండోపద్ధతే నేను వుత్తమంగా తలుస్తున్నాను. కొంతకాలం కాంట్రాక్టు చేసుకోడంలో కొన్ని సాధకబాధకాలున్నాయి. ప్రొడ్యూసరు యీకాంట్రాక్టుకాలంలో తీసే రెండుమూడుచిత్రాలు బాగా దెబ్బతిన్నాయంటే వాటితో తారపేరుకూడా దెబ్బతింటుంది. కాని తార అనేకచిత్రాల్లో ఒకేసారి నటించడంవల్ల ఆసంవత్సరానికి

ఏ ఒక్క మంచిచిత్రంద్వారానన్నా తను మంచిపేరు సంపాదించడానికి అవకాశ ముంది.

తారతనయొక్క నటనా ప్రతిభను చక్కగా ఒప్పించాలంటే ఒకేసారి రెండు కంటె ఎక్కువచిత్రాల్లో నటించకూడదు. కాని తార అటువంటి నిర్బంధానికి ఒప్పుదల యినప్పుడు ఆ ప్రొడ్యూసరుకూడ తన చిత్రాన్ని మూడునాలుగు మాసాల్లో పూర్తిచేయవలసిన బాధ్యత వుంది.

ఎ. ఆర్. కర్దార్ :

విదేశాల్లో తయ్యారయ్యే చారిత్రాత్మక విద్యాప్రబోధిత చిత్రాలు మనప్రేక్షకులకై మతభాషల్లోకి డబ్ చేయవచ్చు. కాని యీ డబ్బింగ్ మిగతా 'ఫీచర్' చిత్రాలకు వర్తించడం మన పరిశ్రమను దెబ్బతీంటుంది.

చిత్రనిర్మాణానికి ఒక లైసెన్సుపద్ధతి పెట్టడం మంచిది. దీనివల్ల పరిశ్రమలో అనర్హులయిన వ్యక్తులు చొరబడి పరిశ్రమను పాడుచేయడం తప్పుతుంది.

చిత్రంయొక్క నిడివిపై ఎటువంటి నిర్బంధం వుండకూడదు. అటువంటి నిర్బంధం తప్పనిసరయితే 14,000 అడుగులు హద్దు పెట్టవచ్చు.

కిశోర్ సాహు :

చిత్రనిర్మాణాన్ని సాగించాలన్న కోరిక యీనాడు ప్రబలంగా వుంది. ఈ నిర్మాణంలో ఏవో లాభాలు గుంజుకోవచ్చునన్న దురభిప్రాయమే దీనికి కారణం. ఈ అభిప్రాయంతో పరిశ్రమలోకి వచ్చిన ప్రొడ్యూసర్లు చాలామంది తమచిత్రాలు పూర్తిగాకముందే విచారించే పరిస్థితికి వస్తున్నారు.

మహబూబ్ :

ఈనాడు ప్రేక్షకులు చిత్రంలో సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యత యిస్తున్నారు. యుద్ధానికి ముందు సంగీతంకంటే చక్కటి కథపై మోజు చూపేవారు. కాని యిప్పుడు చిత్రంలోని సంగీతంకాని యింపుగావుంటే ఆచిత్రానికి కనీసం రెండుసార్లయినా వెళ్తున్నారు.

చిత్రం నిడివిపై 11,000 అడుగుల నిర్బంధం వుంచితే ఒక మంచికథను ఆ నిడివిలో తీయడం కష్టం. దీనికికారణం ఆచిత్రంలో సంగీతమే 4000 అడుగులు తీసుకుంటుంది. కాబట్టి చిత్రపునిడివి 12,500 అడుగులు వుంచవచ్చును.

మామావరేఖర్ :(మహారాష్ట్ర రచయిత)

భారతీయచిత్రాలు విద్యాధికుల్లో నేగాకుండా జనసామాన్యంలోకూడ పతనమైపోయాయి. వాడుకభాషను చలనచిత్రాలలో వాడాలని అంటూ సారస్వతాన్ని తమ యిష్టమొచ్చినట్లు ఖూనీచేయడమే దీనికి కారణం.

విదేశీయచిత్రాల్ని, గ్రంథాల్ని, కనీసం కృతజ్ఞతనైనా తెలుపకండా కాపీ చేసే పద్ధతి చాలా అన్యాయం.

చిత్రాల్లో శాస్త్రీయసంగీతం అసాధ్యమయినా నేడు ఎక్కువగా దిగుమతవుతున్న విదేశీయసంగీతం నిరసించాలి.

అభినయాన్ని నేర్చుకోవాలన్న ఉత్సాహాన్నివ్వడానికి, చిత్రాలకు కావలసిన మంచి నటులకు తరిఫీదు యివ్వడానికి ఫిల్మ్ ప్రొడ్యూసర్లు యీనాడు ఆర్థికంగా స్వయం పోషకంగా లేక దెబ్బతింటున్న నాటకరంగానికి ప్రోత్సాహమివ్వాలి.

రోహిత్ దేవ్ :

(మోహన్ పిక్చర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు) బొంబాయి స్టూడియోల్లో పనిచేసే 2600 మంది కార్మికుల్లోనూ 1300 మంది మోహన్ పిక్చర్స్ ఎంప్లాయిస్ అసోషియేషన్ సభ్యులు. స్టూడియోయజమాని యిష్టాయిష్టాలనుబట్టి, పనితొందరలనుబట్టి కార్మికులచే పనిచేయించడం జరుగుతుంది. ఒకప్లాను లేకుండా మేనేజ్మెంటు పనిచేయడం కార్మికులకు కష్టతరమౌతుంది.

ఖర్చు విపరీతం కావడంవల్ల స్టూడియోల్ని మూసివేసే పరిస్థితుల్లో వేతనాలు తగ్గించడంకంటె ఆ స్టూడియోల్ని పనివాళ్లతోటే సహకారపద్ధతితో నడిపించడం మంచిది.

కార్మికుల నిమిత్తం స్టూడియో ఖర్చుపెడుతున్న వేతనాలు తగ్గించడానికి ప్రయత్నించకూడదు.

నవీనయాగ్నిక్ :

(జూనియర్ సినీఆర్టిస్టుల అసోషియేషన్ (ప్రెసిడెంటు) బొంబాయిస్టూడియోల చుట్టూ తిరిగే ఎక్స్ట్రాలకు నెలకు పదిరోజుల పనికూడా దొరకడం లేదు.

హిరిస్ :

(సినీ ఆర్టిస్టుల అసోషియేషన్ ప్రెసిడెంటు) ఎక్స్ట్రా కనీసపు రోజుకూలీని పెంచాలి. కొన్ని సందర్భాలలో ఎక్స్ట్రాలకు రోజుకు మూడురూపాయలు కూడా యివ్వని ఉదాహరణలున్నాయి,

హారిస్ :

పరిశ్రమకు జీవనాడిలాంటి ముసిషియన్స్ యొక్క సప్లయి బాగావుండాలి.


పృథ్వీరాజకపూర్

చిత్రాలు ఎక్కువగా తీసికట్టుగా వుండడానికి కారణం ఫిలింసెన్సారుపాలసీ అని చెప్పాలి. ఫిలింసెన్సారు చిత్రంలోని కేవలం అసభ్యతలనే గాక, కళారహితంగా, నీరసంగావుండే దృశ్యాల్నికూడ నిషేధించాలి.

విదేశీయప్రొడ్యూసర్లకు అనుమనించినట్లు భారతీయ ప్రొడ్యూసర్లకు కూడ జీవితాన్ని యథాతథంగా చిత్రించడానికి అనుమతివ్వాలి. మంచిచిత్రాలకు ప్రత్యేకత చూపించాలి. వ్యక్తిగతచిత్రనిర్మాణం యొక్క సుగుణాన్ని ప్రభుత్వం గుర్తించినట్లైతే మహదాశయాలతో పనిచేసే ప్రొడ్యూసర్లకు ప్రోత్సాహకరంగా వుంటుంది.

ఆర్టిస్టుల్ని బంగారంలాగు పరిశోధించి అవసరమైతే పరిశుభ్రంచేసి మెరుగులు పెట్టాలి. కళాకారులు తయారుకారు. వారి ప్రతిభ కళాకేంద్రాల్లో ప్రకాశవంతం కావచ్చును. కాని కళాకేంద్రాల స్థాపనవల్ల కళాకారులు పుట్టుకరారు. అటువంటి కేంద్రాలు కళాకారుల్ని అనేకప్రాంతాలకనువుగా తయారుచేయడానికి దోహదమిస్తాయి.

చిత్రంయొక్క మంచిచెడ్డలు ఆధారపడివున్న థియేటర్లలోని ప్రొజక్టర్ల టెక్నికల్ స్టాండర్డు ఒకవిధంగా వుండడంలేదు. డిస్ట్రిబ్యూషన్లో మంచిచిత్రాలకు చాల అన్యాయాలు జరుగుతున్నాయి. ఎందుకంటె ఈమంచిచిత్రాలకు డిస్ట్రిబ్యూషన్ హక్కువున్నవ్యక్తి స్వయంగా తనుపెట్టుబడిపెట్టిన యితరచిత్రాలమీదే ఎక్కువశ్రద్ధ తీసుకుంటాడు.



కప్పలకు పొడలు ఎల్లావచ్చాయి?

హిందూ దేశంలో ఎక్కడో లూషాయిగుట్ట లని కొన్ని కొండ లున్నవట. ఆ ప్రాంత మందు అరణ్యంలో జంతువు లన్నియు అల్లకల్లోలముగా ఒక నాడు తగవులాడుకొన్నవి. దానికి కారణ మేమిటంటే?

ఒక ముసలివాడు చెట్లు కొట్టి కాలక్షేపం చేసుకొనేవాడు. ఒక నాడు చెట్లు నరకుచుండగా వాని కత్తి మొఱకుపోయినది. దగ్గరగా నున్న ఒక యేటిలో ఒక రాయి మీద దానిని నూఱుకొని పదును పెట్టెను. ఇంతలోనే ఒక ఎండ్ర కాయ అతనికాలు కఱచెను.

అతని కేమి తోచక గబగబ ఒక చెట్టుదగ్గరికి వెళ్లి దానిని కొట్టి వేసెను. ఆ చెట్టు "అయ్యా, ఇదేమయ్యా! నన్ను ఇట్లు నఱికి వేసినావు? నా చేతులనిండ బోలెడు పళ్లు వున్నవే! అవి రాలిపోవు సమయమున నిట్లు చేసితివి?" అని చెప్పి దుఃఖించెను.

అయితే ఆ చెట్టు మహామంచిదా? తాటిపండంత పెద్దకాయను అక్కడ ఒక కప్ప ఆడుకుంటూ వుంటే దానిమీద రాల్చించి. దాని కొక పెద్దదెబ్బ తగిలి, అది "ఏమయ్యా చెట్టూ! నీ కాయలను ఎక్కడ పట్టిన నక్కడ ఇంత ఖాళీ జాగా యుండగా నామీదనే రాల్చవల యునా? బాగుంది, బాగుంది!" అని విచారించింది.

ఆకప్ప మాత్రము సామాన్యురాలా? ఆ కుంటి కాళ్ళతోటి నడుస్తూ వెళ్లి సమీపంలో అక్కడ ఒక చీమలపుట్ట వుండగా దాని మీదికి దుమికింది. చీమలు సామా

శ్రీమతి గొల్లపూడి శారదాదేవి

న్యమైనవి కావు! అవి అక్కడుండిన ఒక పామును కఱచినవి! పాము ఒకపంది నొక్క కాటువేసినది! పంది తిండ్రించి ఇటూ అటూ పరుగెత్తి పరుగెత్తి ఒక అరటిచెట్టును ఊడలాగింది. ఆచెట్టుగెలలో ఒక ఋషిపక్షి ఒంటికాలుమీద నిల్చొని తపస్సు చేయుచున్నది! దానికి తపోభంగమై పరుగెత్తి పరుగెత్తి చేటలలాంటి చెవులుగల ఒక ఏనుగ చెవులలో దూరింది! ఆయేనుగ పిచ్చెత్తినట్లు పరుగెత్తి పరుగెత్తి అక్కడ ఒక ముసలమ్మ గుడిశ ఉంటే దానిని బోర్ల తోసింది. అక్కడనుంచి ఆమె కయ్యమునకు కాలు దువ్వడము మొదలుపెట్టింది.

ఇట్లాగ ఒకరిగోల ఒకరికి తెలియకుండా ఒకరిమీద ఒకరుపడుచు, ఒకరి నొకరు దూషించుకొనుచు; తప్పు పట్టుచు అల్లకల్లోలముగా ఉండిరి ఆఖరుకి ముసలవ్వ తెగించింది., ఏనుగు మీదపడ్డది. నీవల్ల నాకెంతో నష్టము, కష్టమువచ్చింది. నాకిప్పుడుండ యిల్లు, వండ పొయ్యిలేదు. నానష్టమునకు పరిహారమిస్తే కాని వూరుకో''నని గట్టిగా చెప్పింది.

అప్పటికి యిప్పటికి కూడ మనిషంటే అందరికీ హడలు. 'అమ్మా! నన్నేమిచేయమంటావు? గబ్బిలంలాగ ఆపక్షి వచ్చి నా చెవిలో దూరబట్టి నాకేమియు తోచక, అటు, ఇటు పరుగెత్తి నీయింటిమీద పడ్డాను కాని, అన్యాయంగా మీవంటివారిని హింస పెట్టడం నాకేమి సరదా యేమి?'' అని మెల్లగా బ్రతిమాలి తప్పించుకున్నది.

ఆపాళముగా ముసలిది ఋషి పక్షి వద్దకు వెళ్ళి నీవల్ల నాకే నష్టమువచ్చినది. పరిహారమిస్తావా యియ్యవా?' అని సాధించింది.

'అమ్మా! అడవిపంది వచ్చి అరటిచెట్టు నూడబెరుకుట నాకు కూడ నిలువ నీడలేక కొట్టుకుంటూ

ఏనుగ చెవులో వేలాడుదామని వెళ్ళినాను. నేనేమి చేయగలనని బూపిపతి వలవలని ఏడ్చింది.

పండిదగ్గరకు వెళ్లితే పండి చెట్టు మీద, చెట్టు పాముమీద,. పాము చీమలమీద, చీమలు కప్పమీద, కప్ప కాయల చెట్టుమీద, చెట్టు చెట్టుసరి కే వా ని మీ ద, వాడు ఎండ్రకమీద ఏవో నేరములు చెప్పి తప్పించుకున్నారు. ఈఎండ్రకి ఎవరిమీదా తప్పపెట్టలేకపోయింది. ఆఖరుకి అది దొరికింది. ఈ జంతు జాలమంతా దానిమీద పగతీర్చు కుందామని నిశ్చయించుకొన్నవి.

"నగే నిన్ను నీటిలో ముంచి వేయుటకు మేమందరము సిద్ధుల మయి వున్నాము. వేడినీళ్లలో మునుగుతావా. చల్లనీళ్ళలో మునుగుతావా?" అని ప్రశ్నించినవి.

"సరే నేను చన్నీళ్లలో మునిగి పోతా" నని అది చెప్పింది. నీటి లోని ఎండ్రకకు నీటిలో, అందు లోనూ చన్నీటిలో భయమేముంది? అన్నీ కలిసి దానిని ఒకగుంటదగ్గరకు తీసుకొనిపోయి లోతుగా ముక్కి, అది చచ్చి మీదకు తేలితే చూదామని కని పెట్టుకొని కూర్చున్నవి.

ఎండ్రకాయ యెప్పుడైనా నీటిలో చచ్చునా? అది హాయిగా అక్కడే వుండిపోయింది.

"అరె, ఇదేదో మాయచేసి మనను మోసగించింది. దీని కింపు వలన పోయేదేమీలేదు. దీని నెట్లైనా శిక్షించవలె" నని అవి అన్నియు తలచినవి.


గుంటలో నీళ్లన్ని ఏనుగ తాగే సినది. వేడినీళ్లకుండ ఒకటి లక్కడ తెచ్చి పెట్టారు. ఎండ్రకనుఆకుండలో వేసినారు. మీద ఒక మూత కూడ పెట్టినవి. ఉడికిపోతేతిందామని కని పెట్టుకొని కూర్చున్నవి.

దానికి చుట్టుచుట్టుమని వేడితగిలి అది ఉడకడము ప్రారంభించినది. కప్పగారు వంటబ్రాహ్మణుడైనాడు. "మూత దిట్టముగా వున్నదా? ఎం డ్రుక బాగా ఉడుకుచున్నదా? అని అడగడము మొదలుపెట్టినవి వంట వాడిని. "అయ్యో నీళ్ళింకా చాల వున్నవి. అవన్నీ యిగిరిపోవలెను. ఇదిగోదీనిని మెల్లిగా త్రాగేసి, దానిని వేగిర ముడికించెద" నని చెప్పుచు నీటి చుక్కలతోపాటు యెండ్రుకను కూడ కబళించుచు తిరిగిమూత పెట్టు చు కప్ప కాలక్షేపము చేయజొచ్చెను.

'ఏమండీ కప్పగారు, వంట అయిందా?' అని అందరునుతొందర పెట్టజొచ్చిరి. 'అయ్యో, వంటా తినడంఅయింది. నానోరుపెద్దఅయిం ది, దేమో, ఆదినానోట్లోకి ప్రమాద వశమున దూరిపోయినది, నాకడుపా పట్టదు. ఆయాసము ఎక్కువయింది' అని కప్ప ఆయాసపడునట్లు నటిం చెను. "ఓరి దొంగా, మమ్మల మోసగించి నీవొక్కడివే తిన్నావా? నీకు తగిన ప్రతీకారము చేయక మానము జాగ్రత!" అని అవన్నియు ఒక్కసారి కోపంతో రేగి దాని వీపల్లతెగపొడిచినవి దానిది మొండి ప్రాణముగనుక ఎట్లో బ్రతికిపోయి నది. నాటినుండి నేటివరకు ఆజాతి కప్పల కన్నింటికీ ఒడలనిండా పొడలుమాత్రము ఉన్నవి.



అమెరికాలోని బోస్టన్ శిశుకళాకేంద్రంలో తరిఫీదు పొందుతున్న బాల శిల్పి.



మూలం : ట్రెజర్ ఐలండు

రచన : ఆర్. యల్. స్టీవెన్సన్

5

అనుకరణ :

“నళినీమోహన్”

మళ్లీ తెలివిరాకుండానే హంటరు కూడా చచ్చిపోయాడు. కెప్టెన్‌కు ప్రాణభయం లేదుగాని, చాలరోజులవరకూ లేవలేదు.

ఆరోజు రాత్రి మిగిలినవాళ్లం నలుగురమూ ఏక్షణంలో వచ్చి దొంగలు మీదపడతారో అని కళ్లల్లో వత్తులు పెట్టుకొని కూర్చున్నాం. కాని, వాళ్లు అటువంటి ప్రయత్నమేమీ చెయ్యలేదు.

మర్నాడు మధ్యాహ్నం డాక్టరు కొన్ని సామానులు తీసుకుని, ఒక తుపాకీ బుజాన వేసుకుని, అడవిలోకి బయలుదేరేడు. బెంజమిన్ గన్ కోసం వెళ్లేడని గ్రహించాను. కొంతసేపు నేను కొయ్యకోటలోనే కూర్చున్నాను. ఏమీ తోచింది కాదు. గన్ తాను తయారుచేసిన ‘డింగీ’ ని దాచేన్న చోటు గుర్తుకు వచ్చి, ఓ మారు చూసిరావాలనిపించింది. ఆ మాట ఎవరితో చెప్పినా కదలనివ్వరు. అందుచేత ఎవ్వరితోటీ చెప్పకుండా చాటుగా రెండు పిస్తోళ్లు జేబులో వేసుకుని, చల్లగా బయటికి జారుకుని, అడవికి అడ్డుపడ్డాను.

గన్ పడవ ఉన్న చోటికి వెళ్లాలంటే సిల్వర్ ముఠా విడిదిచేసిన ప్రాంతంమీదుగా వెళ్లాలి. దాని వలన ప్రమాదం ఉంది. అందుచేత చుట్టు తిరిగి బయలుదేరేను. కొంత దూరం పోయేసరికి సముద్రం కనిపించింది. సముద్రంలో దూరాన ఓడ, దానిమీద ఇద్దరు మనుష్యులు కనబడ్డారు. సిల్వర్ అప్పుడే ఓడనుంచి తిరిగివస్తున్నాడు. కొంతసేపు వారివంక చూస్తూ నిలబడ్డాను. ఇంతలో సూర్యాస్తమయం అయింది. ఆలస్యం అయిపోతోందని బెన్‌గన్ డింగీని దాచిన వేపుగా పరుగెత్తేను. అక్కడ వెతగ్గా వెతగ్గా ఒక మారుమూల పొదలమధ్య కొన్ని గొఱ్ఱెచర్మాలక్రింద అతడు చెప్పిన డింగీ కనబడింది. దానిని పడవ అనడానికి వీలులేదు. పెద్ద మానును కొట్టి, దొలిచి తయారుచేసిన దోనె అది. దానిపక్కని నడిపేటందుకు జంట తెడ్డు కూడా ఉంది.

బయలుదేరేటప్పుడు మొదట అనుకొన్నది దోనెను చూసిరావాలని మాత్రమే. కాని, తీరా వచ్చి చూసేక దానినోమారు నీళ్లల్లోకి ఈడ్చి ఎల్లాగ నడుస్తుందో చూడాలనిపించింది. అప్పటికప్పుడే చీకటి పడిపోయింది. అయినా నేను మానలేదు. దానిని నీటిలోకి ఈడ్చి, ఎక్కి కూర్చున్నా.

అది చిత్రమైన దోనె. ఎంత తంటాలుపడ్డా చెప్పినట్లు నడవదు. గిరగిర తిరుగుతూ ఉన్నచోటనే సున్నాలు చుట్టుతోంది. కాని, అది పోటుతిరిగిన వేళ కావడంచేత నీటివిసురుకి ఆదోనె సముద్రంలోకి వెళ్లిపోవడం మొదలుపెట్టింది. చెప్పినట్లు వినని పడవలో సముద్రంలోకి కొట్టుకుపోవడం చూస్తే నిజానికి భయం వెయ్యవలసిందే. కాని, ఎదర నల్లగా ఓడ ఒకటి కనిపిస్తూంటే భయానికి బదులు కొంటెఊహ ఒకటి మనస్సులో పుట్టింది. ఓడకు

సిన లంగరుతాడు కోసివేస్తే తమా ాగా ఉంటుం దనిపించింది.

ఆలోచన తట్టడమే తడువు ంటనే బలపడింది.

ఇంతలో నాదోనె నీటివిసురికి డను సమీపించింది. నేను కొంచెం యత్నంచేసి, నా దోనెను ఓడ క్కకి చేర్చి, చేతికి దొరికినగొళ్లెం కటి పట్టుకుని నిలబెట్టేను. అక్క కి లంగరు పగ్గం అందుతోంది. టి విసురికీ, గాలి ఒత్తిడికీ పగ్గం గిసిఉంది. ఆ సమయంలో తాడు ోసేసేనంటే చచ్చేటంత దెబ్బ ాడుతుంది. అందుచేత కాస్తసేపు గేను. ఇంతలో గాలి తగ్గింది. పగ్గం దులయింది. వెంటనే జేబులో ంచి చాకు తీసి దానిని కోసేసేను. ోస్తూండగానే ఓడ నీటివాలుకి ందకి దిగిపోతోంది. పైన కాపలా ిన్న దొంగలు ఇద్దరూ తాగి బ్బులాడుకుంటున్నారో ఏమో పెద్దగొడవ వినిపిస్తోంది. వాళ్లు ఓడ సముద్రంలోకి దిగిపోతున్న సంగతిని ూడనేలేదు. అదీ బాగానే ఉంది. నేను తొందరగా నాదోనెను ఓడ పక్కనుంచి తప్పించుకోకపోతే ఏ కెరట మో ఓడను పెట్టికొడుతుంది. ఆ భయంతో ఓడపక్కభాగం పట్టుకుని, దానివెనుకవైపుకు నా దోనెను నెమ్మదిగా గెంటుతూ పోతున్నా. అల్లాగ గెంటేక చేతికి ఏదో తాడు తగిలింది. వట్టి ఆక తాయితనానికీ దానిని పట్టుకు లాగేను. కొంతదూరం వచ్చి, అది పట్టుపట్టింది.

ఆ తాడును చూశాక నా కో ఆలోచన తట్టింది. దానిని పట్టుకుని ఓడమీదకు వెళ్లి లోపలివాళ్లు ఏం చేస్తున్నారో చూసే? వెంటనే ఆ తాడుకొసను దోనెకు కట్టేసి, నేను తాడుపట్టుకుని ఓడపైకి పాకేను. కొంతదూరం పైకి వెళ్ళే సరికి ఓడలోని ఒక గదికిటికీ కన బడింది. దానికమ్మీ చేతితో పట్టు కుని, లోపలికి తొంగిచూశాను. నా ఎదుట కనబడిన దృశ్యం చూసే సరికి నాఒళ్లు కంపరంపుట్టింది. దొంగలు ఇద్దరూ తాగిన నిషాలో ఒకరిగొంతుక ఒకరు నులుముకొనే



టందుకు కుస్తీలు పడుతున్నారు. నాకు భయంవేసింది. ఇంక పైకిపాక లేకపోయాను. పట్టు తప్పి, జట్టున జారిపోయి నాదోనెలో వెల్లకిలా పడ్డాను. వెంటనే ఓడనుంచి దూరంగా పోవాలని తాడు విప్పే శాను.

అప్పటికప్పుడే ఓడా, దాని వెన క్కాలనే నా దోనే సిల్వరుదొంగల ముఠా విడిది చేసినచోటికి ఎదురుగా వచ్చేశాయి. ఓడ దిగిపోవడాన్ని చూసి, వాళ్లు పడవలలో వస్తా రేమో నని భయంవేసింది. కాని, అందరూ తెగతాగి తందనా లాడు తున్నారు. ఒక్కళ్ళూ మమ్మల్ని చూడనేలేదు. ఓడ మరింత దిగి పోయి, దీవియొక్క దక్షిణం వైపుకి వచ్చింది. 'బతికాములా' అను కున్నాను. ఇంకమీద ఓడ సముద్రం లోకి పోతుంది. నా దోనెను దానిపక్కనుంచి తప్పించి, ఒడ్డుకి చేర్చక పోతే అదికూడా ఓడ వెనకాలే సముద్రం లోకి వెడుతుంది. ఓడ పక్కనుంచి తప్పించడా నికి తెడ్డుతీశాను. కాని, ఇక్కడ మరో ఇబ్బంది వచ్చింది. ఎంత గింజు కున్నా దోనెసుళ్ళుయుడు తుందే కాని, ఓడ వెనుక నుంచి తప్పుకోవడం లేదు. ఎంతోసేపు ప్రయ త్నం చేసి, అలిసిపోయి, నిరాశతో దోనెలో వెల్ల కిలా పడుక్కున్నాను. అల్లా ఉండగానే కొద్ది సేపటిలో నిద్రపట్టి పోయింది.

మళ్లీ తెలివివచ్చేసరికి బాగా తెల్లవారిపోయింది. తల ఎత్తి చూస్తే గట్టుకి సమీపంలోనే నాపడవ నెమ్మ దిగా జరుగుతోంది. నే నున్న ప్రాంతాన, నీటివారనే రెండు బండలు పడి ఉన్నాయి. వాటి మీదా, వాటి మధ్యా కెరటాలు

మహా గంద్రగోళంగా ఉన్నాయి. అక్కడ ఒడ్డుకి చేర్చడం సాధ్యమయ్యేపనికాదు.

ఆలోచిస్తూ కొంతసేపు కూర్చున్నా. కొంచెందూరంలో ఒడ్డున ఇసకలిప్పలు కనిపించినాయి. అక్కడిదాకా దోనెను గెంటుకుపోగలిగితే అనుకొంటూ గుట్టలవైపు చూసేను. కాని, దోనె వాటిని దాటేస్తూ ముందుకుపోవడం చూసేసరికి నాకు ఆశ్చర్యంవేసింది. తోయకుండానే దోనె ఎల్లాగ వెడుతోందీ అని ఆలోచించాను. అప్పుడు సిల్వర్ చెప్పిన ఒకసంగతి గమ్మున గుర్తుకు వచ్చింది. మావోడదీవిని సమీపించినరోజున అతడు కెప్టెన్‌తో ఒక సముద్రప్రవాహం ఒడ్డు వెంబడే దీవిఉత్తరంగా ప్రవహిస్తోందని చెప్పేడు. నాదోనె ఇప్పుడా ప్రవాహంలో ఉందన్నమాట. ఆ ఆలోచన తట్టేక ప్రాణం లేచివచ్చింది.

మళ్ళీ కొంతసేపు కూర్చున్నా. ఎండ ఎక్కుతోంది. నాకు దాహం వేసింది. త్వరగా ఒడ్డు ఎక్కాలనే ఆదుర్దాతో తెడ్డువెయ్యబోయాను. మళ్ళీ దోనె అడ్డం తిరిగి సుళ్లు కొట్టడం ప్రారంభించింది. ఒక పెద్ద కెరటం వచ్చి నన్ను తడిపేసింది. దోనె మునిగిపోతుందేమో నన్న భయంతో అడుగుకు కరిచిపట్టుకుని మాట్లాడక పడుక్కున్నాను. నేనూ పడుక్కోగానే దోనె నిలదొక్కుకుని ప్రవాహంలో పడింది. దోనెలో పడుక్కొనిఉంటే అది సరిగ్గా నడుస్తోంది. కూర్చుని నడపబోతే అది సుళ్లుకొడుతుంది. ఇంక ఆ దశలో నేను చేయగలదిమాత్రం ఏముందీ? కదలకుండా దానిలో పడుక్కొని, మధ్యచెయ్యి నీటిలో పెట్టి తెడ్డులాగ ఉపయోగించి గట్టు వైపు దోనెను తిప్పుతున్నాను.

అలా నేను చారాదూరం కొట్టుకుపోయాను. ప్రక్కనే చెట్లు కనబడుతున్నాయి. కాని, నా ప్రయాణం తెగడంలేదు. నాకుగొంతు ఆరిపోతోంది. ఆశ కనబడ్డంలేదు

అప్పుడే నాదోనె దీవిమలుపు తిరిగింది. కొంచెందూరంలో నాముందు మా ఓడ నడుస్తోంది. దానిలో దొంగలు ఉన్నారని ఎరిగి ఉన్నా, దాహం భరించలేక కేకలు పెట్టేను. కొద్దిసేపటిలో ఓడ ఆగింది. కొద్దిదూరం వెనక్కి తిరిగివచ్చింది. నిలబడింది. మళ్లీ అంతలో గాలి పోసుకుని తెరచాప బిగిసింది. ఓడ మరల కొంతసేపు చట్టున ముందుకు పోయింది. మళ్ళీ ఆగింది. వెనక్కి వచ్చింది. ఇల్లా రెండుమూడుమార్లు జరిగేసరికి పరిస్థితి అర్థమయింది. ఓడలో ఎవరూ లేరన్నమాట. దానిలో ఇద్దరూ సముద్రంలో ఉరికి చచ్చిపోయారో, ఒకరి నొకరు చంపుకున్నారో ఏదో జరిగిందను కున్నాను. తెరచాపలు ఎత్తి ఉండడంచేత అవి గాలిపోసుకొని ఓడ తనంత తానే పరుగెత్తుతోంది. గాలి లేకుంటే నిలబడిపోతోంది.

ఇప్పుడు నా కో ఆలోచన తట్టింది. ఏవిధంగానైనా తంటాలు పడి, ఓడని పట్టుకుని, ఓ మూలకి చేర్చినట్టయితే మావాళ్లు బ్రహ్మానందపడుతారు. పైగా నా దాహం వెంటనే తీరుతుందికూడాను. ఆ ఆలోచన తట్టడమేతడవుగా దానిని కార్యరూపంలో పెట్టేను. దోనెలో బోర్లా పడుక్కుని, చేతులు బయటికి వే తెడ్లులాగ ఉపయోగించి, ఓడవై నకు నడపసాగేను. కాని, నడి వాళ్లు లేక గాలిపరుగున పరవ తొక్కుతూన్న ఓడను తెడ్డుకూడ వెయ్యడానికి వీలులేని దోనెతో పట్టుకోవడం మాటలా? అయినా నేను పట్టువదలలేదు.

ఎన్నోమార్లు ఆశనిరాశల మధ్య కొట్టుమిట్టాడి ఎండ వాటాలేవేళ ఓడపక్కకి చేరేను. రాత్రి విప్పి వేసిన తాడు చేతికి దొరికింది వెంటనే దాని నందుకుని పైకిపాకేను నేను తాడునందుకున్న మరక్షణంలో ఓడ ఒక పెద్దకెరటంమీద లేచి, నా దోనెమీద పడి ముంచివేసింది. ఒక్కక్షణంలో నాచావు తప్పిందన్నమాట.

తాడు పట్టుకుని రాత్రిలాగే పైకి పాకేను. కిటికీలోనుంచి గది లోకి దిగి ఓడమీదకు వెళ్లేను. దొంగలిద్దరూ అక్కడే ఉన్నారు. ఒకడు చప్పగా చచ్చిపోయాడు. రెండోవాడు కత్తిగాయాలతో, తాగిన మైకంతో ఒళ్లు తెలియకుండా పడిఉన్నాడు.

నా అడుగుల చప్పుడికి వాడికి తెలివి వచ్చి, సారా కొంచెం తెచ్చి పెట్టమన్నాడు. నేనుకిందకిదిగిపోయి ఇన్ని మంచినీళ్లు తాగి, బిస్కట్లు జేబులో పోసుకుని, వాడికోసం ఒక సారాసీసా పట్టుకువచ్చాను. వాడు దానిమూతి పగలగొట్టి, గడగడా తాగేశాడు. కొద్దిసేపటికి తేరుకున్నాడు, గాయాలకి కట్లుకట్టుకొనేటందుకు గుడ్డలు తెచ్చి పెట్టమన్నాడు. తెచ్చి యిచ్చాను. వాడిరెండుకాళ్ల మీదా గాయాలు తగిలేయి. వాటిళ్ల

ట్లు కట్టుకుని కూర్చున్నాము.

కొంత సేపున్నాక వాడే ప్రారం
ంచాడు.

"నువ్వు ఓడని ఎల్లాగ నడపాలో రగవు. నేను చెప్తాను. ముందు ుకింత తినడానికి తెచ్చిపెట్టు."

ఆమాటలు నిజమే. నేను వెంటనే వెళ్ళి ఇంత తిండి తెచ్చి ఎదుట పడ శాను. వాడు తిన్నాక ఏం చెయ్యాలో నేను చెప్పేను.

"ఓడని ముందున్న చోటికి తీసుకు కూడదు. దీవికి ఉత్తరంవైపున య్య ఉందని మ్యాపులో ఉంది. నం ఓడను అక్కడికి పట్టించాలి."

దొంగ ఒప్పుకొని, అక్కడే వార్చొని, నేను ఏం చెయ్యాలో చెప్తున్నాడు. ఆ ప్రకారమే నేను ఓడను నడిపించాను. సాయంకాలం అవుతూండగా ఎదుట కయ్య కన డింది. కొద్దిసేపటిలోనే ఓడ యోలో ప్రవేశించింది. రెండు వైపులా ఒడ్డుమీదిచెట్లు దట్టంగా సుబురుగా ఉన్నాయి. వాటిమధ్య సుంచి ఓడ పట్టించాను.

ఓడ కయ్యలో ప్రవేశించాక ంగ నన్ను ఎందుకోగాని ఓడ పలికి పంపించడానికి ప్రయత్ని స్తున్నా డనిపించింది. లేకపోతే వాడికి కావలసిన సారా అక్కడే ఉండగా ద్రాక్షసారామీద మక్కు వయిందనడంలో ఉద్దేశం ఏమిటి? కాని, నా అనుమానాన్ని ప్రక టించకుండా, వాడి ఉద్దేశం కను క్కొనేటందుకు నరే నని కిందికి బయలుదేరి, మరో వైపు నుంచి చప్పుడు చెయ్యకుండా చల్లగా పైకి వచ్చి ఓమూల నక్కేను. వాడు నన్ను చూడలేదు. నేను దూరంగా వెళ్ళే ననుకున్నాక కాలు ఎంతో బాధగా ఉన్నా, అతికష్టంమీద పాకుతూ కొంతదూరం వెళ్ళి, అక్కడ ఉన్న కైజా రొకటి తీసుకుని బట్ట లలో దాచుకొన్నాడు. తిరిగి వచ్చి ఏమీ ఎరగనట్లు తన చోటులో కూర్చున్నాడు.

వాడిఎత్తు నాకు అర్థమయింది. ఆ గాయాలతో వాడు ఓడను ఒడ్డుకి చేర్చలేడు. అందుచేత ఆపని నాచేత చేయిస్తాడు. నాపని తీరినతరవాత నన్ను చంపడానికి కత్తిని సంపా దించేడు. ఆపని అయినాక ఏ తుపా కీనో కాల్చితనవాళ్లకిసంజ్ఞచేస్తాడు.

నా స్థితీ అదే. నన్ను చంప డానికి కత్తిని సంపాదించేడనే కోపంతో నా జేబులోని రివాల్వ రుతో వాడిని కాల్చి, చంపేస్తే ఓడని ఒడ్డుకు చేర్చే పద్ధతి నాకు తెలియదు. కనుక వాడిని చంపెయ్యడానికి వీలులేదు. కొన కంటా ఓపికపట్టి, జాగ్రత్తగా కని

పెట్టి ఉండడమే దారిఅనుకున్నాను. చప్పుడు కాకుండా కిందకిదిగి వెళ్లి వాడు అడిగింది తీసుకువచ్చాను.

దొంగకూడా ఏమీ ఎరగనట్లే చెయ్యవలసిన పనులు పురమాయిస్తున్నాడు. కొద్దిసేపటిలోనే ఓడను గట్టుకి నిలబెట్టి లంగరువేశాను. ఆ సందడిలో నేను ఒక్కక్షణం ఏమరిపాటున ఉన్నాను. అది వాడు కనిపెట్టికుంటూనే కత్తి తీసుకుని మీదికి వచ్చేశాడు. నేను ఒక ఇరుకులో చిక్కుకున్నాను, పారిపోవడానికి దారి లేదు. చాప కొయ్యచుట్టూ వాడికి దొరకకుండా అటూ ఇటూ తప్పుకుంటూ తిప్పడం మొదలు పెట్టేను.

ఇంతట్లోకే పెద్ద కెరటం వచ్చింది. ఆ తాకుడికి ఓడ ఊగిసలాడింది. ఆ అదుటుకి ఇద్దరమూ కింద పడిపోయేము. నేను గభీమని లేచాను. అందుబాటులో ఉన్న తెరచాపకొయ్యతాళ్లు పట్టుకొని గబగబా పైకి పాకి కొంతదూరంలో పైన ఉన్న అడ్డకొయ్యమీద కూర్చున్నాను. సావకాశంగా జేబుల్లో ఉన్న పిస్తోళ్లు రెండూ తీసి, రెండుచేతుల్లోనూ పట్టుకొని సిద్ధంగా కూర్చున్నాను.

దొంగ గాయాలమూలంగా గభీమని లేవలేకపోయాడు. లేచేక తానుకూడా కాలు ఈడ్చుకుంటూ చేతుల బలంమీదనే తాళ్ళుపట్టుకుని నాదగ్గిరికి పాకి రావడం మొదలుపెట్టాడు. నేను పిస్తోలు చూపేను. దొంగ మధ్యలో ఆగి, నన్ను మాటలలో మరిపించి, తాడుమధ్యలో ఒక చేతితో వేళ్ళాడుతూ, రెండో చేత్తో కైజారు నామీదకు విసిరేడు. అది సరాసరి వచ్చి, నాజబ్బలో దిగి, తెరచాప కొయ్యలో దిగబడింది. కొద్దిలో తప్పిందికాని, ఆదెబ్బకు నేను చావవలసిందే. అల్లా జరగలేదు. పైగా ఆ అదురికి నాచేతులలో ఉన్న పిస్తోళ్లు ఒక్కమాటు పేలేయి ఆ గుండు తగిలి దొంగ సరిగ్గా కింద నున్న నీటిలో పడిపోయాడు.

నేను చూసి చూసి కైజారును బయటకు లాగలేకపోయాను. కాని అది లోతులా దిగలేకపోవడంచేత ఒకమారు చెయ్యి బాధకు కదిలేసరికి ఊడివచ్చింది. చర్మం చీరుకుపోవడం తప్ప నాచేతి కేమంత పెద్దగాయం తగలలేదు. రక్తం మాత్రం బాగా కారుతోంది. నేను వెంటనే దిగివచ్చి : కట్టు కట్టుకున్నాను. తర్వాత : ఓడపైభాగం శుభ్రపరచడానికి పూనుకున్నాను. ఓడమీద నున్న రెండో దొంగ శవాన్ని నీళ్లల్లోకి తోసేశాను. తాగి పారవేసిన సీసాలూ, అవీ పారవేశాను. తెరచాపలు దింపలేకపోయాను. అందుకని తాళ్ళు కోసేస్తే అవే పడిపోయాయి. అక్కడికి ఓడ సురక్షితం అయినట్లే.

అప్పటికప్పుడే చీకటి పడిపోతోంది. నేను ఓడమీదనుంచి ఒక తాడు పట్టుకుని క్రిందనున్న నీళ్లలోకి జారేను. అప్పటికి పాటువల్ల ఓడ ఇంచుమించుగా గట్టెక్కినట్లుగానే ఉంది. నేను దిగినచోట మొలలోతు కన్న ఎక్కువ లేదు. ఒడ్డు ఎక్కేను.

ఆప్రాంతం నాకు తెలియదు. కాని అక్కడికి కనబడుతూన్న రెండుగుట్టలమీద పుట్టిన వాగు ఒకటి సిల్వర్‌ముఠావాళ్ళు విడిది చేసినచోటికి దగ్గరలోనే సముద్రంలో కలుస్తోందని నాకు తెలుసును. ఆగుట్టలవద్దకు పోయి, ఆవాగును పట్టుకుంటే మరి ఫర్వాలేదు.

బాగా చీకటి పడిపోకపూర్వమే వాగును పట్టుకోవాలని పరుగు ప్రారంభించాను. కొంతదూరం వెళ్ళాక ఆ ప్రదేశం పరిచితంగా కనబడింది. నిలబడిచూస్తే మొదటి రోజున నేను బెంజమిన్ గన్‌ను కలుసుకున్నచోటు అదే అయింది. ధైర్యం కలిగింది. మిగిలినదారి అంతా ఎరిగినదే, కష్టం లేదు. నడిచివెళ్లినా చీకటిలో వెళ్ల లేమనే భయం లేదు. కాని, మావాళ్లని త్వరగా కలుసుకోవాలనే ఆదుర్దాతో పరుగుపరుగున కొయ్యకోట వైపుకి వెళ్లేను.

నేను వెళ్ళేటప్పటికి అంతా నిద్రపోతున్నారు. బయట ఎవ్వరూ కూడా కాపలా లేరు. ఏం జరిగిందో ఏమో నన్న ఆలోచన కూడా లేకుండా నేను కోటడిదాటి ఇంట్లోకి వెళ్లేను. ఏమీ ఎరగనట్లు పడుకొని, పొద్దుటే అందరూ ఆశ్చర్యపడేటట్లు చేయ్యాలనుకుంటూ చప్పుడు చెయ్యకుండా ఓమూలకిచేరి పడుకొన్నాను.

ఎవరివో కాళ్ళు నాకు తగిలేయి. వెంటనే "ఎవరు వారు?" అని పలకరింపు. అది సిల్వర్ గొంతుక. నాకు ఆశ్చర్యం భయం వేసింది. ఇక్కడ సిల్వర్ ఎందుకు వచ్చాడూ? మావాళ్లుఏమయ్యారూ? ఆలోచించడానికి కూడా

కామాక్షమ్మ!

(14-వ పేజీ తరువాయి)

స్కారం పెట్టి లేచాను. రెండు చేతులూ జోడించి ఆవిణ్ణి ప్రార్థించాను.

"మీ నూతిలో నీరు చుక్కయినా మేము తియ్యలేదు. తియ్యబోము మీతో ఎటువంటి సంబంధం మాకు లేకుండా ఉండాలనే మా ప్రయత్నం. మీరుకూడా కనికరించి మమ్మల్ని మీనోటిలో పడేసుకోక ఎలాగో బ్రతకనివ్వండి" ఈమాటలకి కామాక్షమ్మ తృప్తిపడలేదు. "నా యిల్లు ఎందుకు వదలాలి? నాకింత అగౌరవం అశాభంగం ఎందుకల్గించాలి? కారణం చెప్పండి? అంది.

"మీయింట్లో మాట సౌఖ్యం లేకపోవడం మాట అలాగుండగా రక్షణకూడా లేదు. అదీగాక మాకీ వాతావరణం నచ్చలేదు. మకు నచ్చిన ఇల్లు దారికి మేము వెళ్లిపోతే మీకెందుకు ఇంత కష్టం కల్గిందో మాకు తెలియకుండా వుంది" అని సమాధానం చెప్పి నేను బయటపడ్డాను.

నేను ఎంత విశ్వాసంతో ఈపని చేసానో అది ఆవిణ్ణి అంత గాయపరచింది. దెబ్బతిన్న పులిలాగ గాండ్రుమంటూ కామాక్షమ్మ మామీద తిరిగి దెబ్బతీసింది. నేను మళ్లీ సాయంకాలం ఇంటికి వచ్చేసరికి చాలా గందరగోళం జరిగింది. సొట్ట మాస్టారు. మా గుమ్మంముందు పట్టీలు కొండూ చాలా దుర్భాషలు ఆడాడు. ఆసమయానికే సరిగ్గా మాయింటియజమానికూడా అక్కడ తటస్థించడం వుంచింది. అయింటికి ఈ యింటికి మధ్య నున్న దారిని మూయించడానికి కంకట్టాడు. దానితో ఆ ఇరుగుపొరుగుఇళ్ల యజమానులకు ఆదారిమీద ఎవరికి ఎంతవరకు హక్కున్నదనే విషయం గురించి తర్జనభర్జనలు జరిగాయి పరిస్థితి విషమించిపోయింది. నన్ను సాయంకాలం రాగానే తనని వచ్చి చూడమని మాస్టారు చెప్పిపోయాడు. నావల్ల తప్పేమీ లేదని చెప్పడానికి నేను మాస్టారు దగ్గరికివెళ్ళాను. నన్ను చూచి మాస్టారుచాలా చల్లబడ్డాడు.

"ఏమయినా మీరు మంచిచెడ్డలు తెలుసుకొని మరీ ప్రవర్తించాలి. మీరు ఎంతజాగ్రత్తగా ఉంటే అంత మంచిది!" అని హెచ్చరించాడు. పరిస్థితుల బాగా తెలిసిన మాస్టారు. కాని కామాక్షమ్మ మమ్మల్ని క్షమించేటట్టు లేదు.

"నాకు తీరని అప్రతిష్ఠ తెచ్చారు— నాయిల్లు మర్యాదస్థులు ఉండదగినది కాదన్నాడు. నా వినాశనాన్ని కోరినాకు సాష్టాంగదండం చేసావా. వీడికి తడాఖా తెలీదు. పాతిక వేలకి పరువునష్టానికి దావా తెస్తాను. కూచోంటే పది నెలనా జైల్లో కూచోబెడతాను. నాఆస్తిఅంతా ఖర్చుఅయినాసరే వీణ్ణి హతమారుస్తా" నని దీక్ష బూనిరది కామాక్షమ్మ.

నాగుపాము పగపూనివుంది. ప్రమాదం ప్రళయంతో సమానమయినది. నేను ఎంత జాగ్రత్తగా ఉంటేమాత్రం ఏం లాభం, కామాక్షమ్మ అన్నంతపనీ చేసింది. నన్ను నా కుటుంబాన్ని నిరాధారంగా నడివీధిలో పడేసింది.

భోగిపండుగ. మా 'బాబు' కి. భోగిపళ్లు పోయించి నలుగురు బంధువుల ఆశీర్వచనాలు ఇప్పిద్దా మని ఊళ్లో ఉన్న మా అక్కయ్యగారింటికి వెళ్లాం. సాయంకాలం మేము ఇంటికి తిరిగివచ్చేసరికి చీకటిపడింది. బండిల్లోంచి దిగి గుమ్మంలో కాలు పెట్టగానే మా ఆవిడ అంది.

"ఇంట్లోదీపం వెలుగుతోంది, మీరు గాని వెలిగించారా? అని.

ఇంటితలుపు తాళం వేసి తెరవబోతే రాదు. లోపల గడియ బిగించి వుంది. నాయింట్లో శత్రులు నిప్పు పెట్టారు. ఈసరికి నా సర్వం నాశనమయిపోయివుంటుంది. పెరటివైపు పరుగెత్తి వెళ్లి చూస్తే పెరటిగోడకి కన్నం పెట్టివుంది. పెరటితలుపు బారుమని నోరుతెరచి ఏడుస్తూంది. ఇల్లంతా చిందరవందరగా కల్లకోడులాగుంది. నా సంపత్తు అంతా కొల్లగొట్టారు. నాయింట్లో పూచికపుల్లకూడా నిలవలేదు.

పట్టుబట్టలు, వెండిగిన్నెలు, డబ్బాదస్కం, కట్టుగుడ్డలు, బిందెచెంబూ," అన్నీ నా ఇంట్లోని నిలవలన్నీ హరించారు. నాకిక ఇల్లే అవసరం లేకుండా చేసారు.

పోలీసులకి కబురిచ్చాను. రాత్రల్లా కావలా కాసారు. మర్నాడు ఇరుగుపొరుగు వీధ సోదా ఇళ్లు సోదా చేసారు. నూతులు చెరువులు వెదికించారు. ఎక్కడా పోయిన వస్తువుల ఆచూకీ దొరకలేదు. సోదా ఫలించలేదని ఎవరిదారిని వాళ్లు వెళ్లిపోయారు. మాస్థితి పండుగరోజుల్లో ఊరంతా మహానందంగా పిండివంటలు చేసుకొని తిని, కొత్తబట్టలు కట్టుకొని నవ్వులతో నిండివుంటే, మాకు పొయ్యికిందికి కర్రలులేక పొయ్యిమీదికి గింజలు లేక వంటచేసుకునేందుకి గిన్నెలు లేక, మార్చి కట్టుకునేందుకు గుడ్డలేక, ఇంటికే కాదు ఒంటికికూడా ఏ అపాయం ఏక్షణాన వస్తుందో అన్న భయంతో పిడికిట ప్రాణాలు పెట్టుకొని చంటివాణ్ణి పెట్టుకొని భగవంతునిమీద భారంవేసి ఒంటికాలు మీద నిలబడ్డాం.

స్పష్టంగా ఇది కామాక్షమ్మచేతిదెబ్బే కంటికి కనిపిస్తూంది. ఆ ఉదయమే ఇంటికి సున్నం వేసిన ఆవిడఅడుగుజాడలు మా యింట్లో రాక్షసిపాదచిహ్నాలలాగ కనిపిస్తున్నాయి. మాయింటిమర్మము ఆయుపుపట్టు కామాక్షమ్మకి తప్ప ఇంకెవరికీ తెలీదు. అయితే ఏం లాభం; ఆ రెండు అంతస్తుల మేడచూసి భయపడే ప్రజల్లాగ పోలీసులూ జంకారు.

నాకు తెలుసు అ యిల్లు వెతికిస్తే పోయిన వస్తువులు పూచుపుల్లసహితంగా దొరుకుతాయని. కాని నా సాహసం చచ్చింది. దెబ్బతిని లేవలేని సింహంలాగ నిశ్వసిస్తూంది. నోరెత్తలేకపోయాను. తల వంచుకున్నాను. "కామాక్షమ్మా ఘటికురాలవు!"

ఇలా ఎందరెందరి కోపంలో కూల్చి కామాక్షమ్మ ఆరెండుఅంతస్తులుమేడ,ఇంకా మరికొన్ని ఇళ్లు కట్టింది. భూమీ, పుటా కొనింది. తవిత్తి పెంచింది. ఇది ఇలా పెరిగిపెరిగి పాపం బద్దలయినప్పుడు ఒక్కమారు దగ్ధమయినప్పుడు తెలుస్తుంది. ఇన్నాళ్లుగా చేసిన పాపము, ఎంత ప్రయోజనం లేనిదో. అప్పుడు కలిగే పశ్చాత్తాపానికి అంతువుండదు. అయితే అదేదో మనకు పైన భగవంతుడు చెయ్యవలసిన పని. నా మట్టుకు మాత్రం కామాక్షమ్మపేరు వింటే గుండె గడగడలాడ్తుంది, ఆడది సాహసిస్తే ఎంతపనయినా చేస్తుంది. అభాగ్యుని ముందు పురుషుని ప్రతాపం గడ్డిపోచకన్న పనికిమాలినది. నాస్థితి అంతే అయింది.

వ్యవధి లేదు. ముందుబయటపడాలి. గభీమని లేచి పరుగెత్తాను. ఇంతలోనే ఆ అలికిడి విని, అందరూ లేచారు. నేను పరుగెత్తిపోతుంటే ఒకడు నన్ను పట్టుకున్నాడు. నేను ఇంతదూరమూ వచ్చి, చివరకు వీళ్ళ చేతులలో చిక్కేను.

కొరియా బలిపీఠం

(7-వ పేజీ తరువాయి)

దిని తరిమివేశారు. చీనా-జపాన్ యుద్ధంలో అనేకమంది కొరియా దేశస్థులు గొరిల్లా దళాల్లో చేరి జపాన్ వారితో పోరాటం సాగించారు. ఈ గొరిల్లా పోరాటంలో మంచూరియాలోని కొరియా దేశస్థులు చీనా కమ్యూనిస్టులతో చేరారు. అప్పుడు కొరియా ప్రవాస ప్రభుత్వానికి చీనా ప్రభుత్వ సహాయం లభించే. ఆ ప్రవాస ప్రభుత్వం చుంకింగ్ కు మార్చబడింది. 1940లో ఈ ప్రవాస ప్రభుత్వానికి కిమ్ కూ అధ్యక్షుడైనాడు. డా॥ రీ వాషింగ్టన్ లో ప్రవాస ప్రభుత్వ రాయబారిగా వెళ్ళాడు. ఈ కాలంలో చీనా రాజకీయాల ప్రభావం కూడా కొరియా ప్రవాస ప్రభుత్వంపై ప్రసరించింది. చీనా జాతీయ ప్రభుత్వం కిమ్ కూ ప్రత్వాన్ని బలపర్చింది. రెండో పక్షానికి చెందిన (సైబీరియన్-మంచూరియన్ పక్షం) నాయకులు కొన్ని వేలమంది అనుచరులతో యెనాన్ నగరానికి పారిపోయి, అక్కడ చీనా కమ్యూనిస్టుల సహాయంతో కొరియన్ ప్రజాస్వాతంత్ర్యసంఘాన్ని స్థాపించారు.

రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ అదృష్టం తిరుగుముఖం పట్టగానే ఉభయ వర్గాలవారూ కొరియాలో ఉద్యమాలను బలపరుస్తూ, అక్కడకూడా రెండు 'పక్షాల్ని' ఏర్పరచారు. జపాన్ ఓటమి అనంతరం కొరియాను జపాన్ పరిపాలకులనుంచి, జపాన్ సైన్యాలనుంచీ విడుదల చెయ్యడంకోసం అమెరికన్ రష్యన్ సైన్యాలు కొరియా ప్రవేశించడానికి కొద్దిరోజుల ముందు, 1945 సెప్టెంబర్ 6 వ తేదీని, గొరిల్లా యుద్ధం సాగించిన కొరియన్ రాజకీయ పక్షాలన్నీ (పై ఇరువర్గాలకు చెందినవి) సియూల్ నగరంలో సమావేశం జరిపి, కొరియన్ జాతీయ ప్రభుత్వాన్ని నిర్మించుకోడానికి నిర్ణయం చేశాయి. ఈ సమావేశానికి కొరియాలోని అన్ని రాష్ట్రాల నుంచీ ప్రతినిధులు వచ్చారు. "అమెరికన్ వర్గానికీ" "కమ్యూనిస్టు వర్గానికీ" మధ్య ఒప్పందం కుదిరింది.

కమ్యూనిస్టు నియంతృత్వ స్థాపనకు పట్టుబట్టరనీ, వ్యావసాయిక రాజకీయ సంస్కరణాల కోసం ఒత్తిడిచెయ్యరనీ, అన్యదేశాలలో మాదిరిగానే ప్రజాస్వామ్యస్థాపనకు అంగీకరించగలరనీ కమ్యూనిస్టు వర్గం వాగ్దానమిచ్చింది. జపాన్ వారికి చెందిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనపర్చుకుని వ్యావసాయిక భూమిని వ్యవసాయకూలీలకు పంచి ఇవ్వడానికి అన్ని వర్గాలవారూ నిర్ణయించారు. డా॥ రీ, కిమ్ కూ మొదలైనవారు ప్రవాసం నుంచి తిరిగివచ్చేవరకూ ల్యూ ఆన్వర్యకింద పరిపాలన నిర్వహించడానికీ, ఆ నాయకులు రాగానే వారికి ప్రభుత్వాన్ని ఒప్పగించడానికీ సియూల్ సమావేశం నిర్ణయించింది.

కాని సియూల్ నగరంలో సెప్టెంబర్ 8 వ తేదీని దిగిన అమెరికన్ సైనికాధిపతి జనరల్ హాడ్జె ఈ సమావేశాన్నీ వారి నిర్ణయాల్నీ తోసిపుచ్చాడు. జపాన్ లో వలెనే మిగతా మిత్రరాజ్యాల ప్రతినిధుల్తో ఒక కమీషన్ నియమించి ఈ కమీషన్ కు జనరల్ మెకార్థర్ వంటి అధిపతి వల్ల కొరియాలో అమెరికన్ సైనిక పరిపాలన నెలకొల్పాలని అమెరికన్ విదేశాంగశాఖ సంకల్పించింది. కాని పోట్స్డాం సమావేశంలో అగ్రరాజ్యాధిపతులు భిన్నమైన నిర్ణయం చేశారు. పర్వతమయ ప్రాంతమైన కొరియాలో సైనికాక్రమణ దుష్కరమనే భావంతో రష్యన్ సైన్యాలు అమెరికన్ సైన్యాలు కలిసి కొరియాను జపాన్ సైన్యాలనుంచి విముక్తపరచాలని నిర్ణయించారు. ఆ నిర్ణయం ప్రకారం కొరియాలో 38 వ అక్షాంశానికి ఉత్తరభాగాన్ని రష్యన్ సైన్యాలు, దక్షిణభాగాన్ని అమెరికన్ సైన్యాలూ ఆక్రమించుకున్నాయి. ఆక్రమించిన వెంటనే అమెరికన్ ఆక్రమిత ప్రాంతంలో జపానీ పరిపాలకుల సహాయంతోనే పరిపాలన సాగనివ్వాలని జనరల్ మెకార్థర్ ఉత్తరువు చేశాడు. దానితో అమెరికన్ సైన్యాల నాహ్వానించడానికి వచ్చిన రాజకీయ నాయకులు, ఉద్యమకారులు నిరసన ప్రకటించారు. వెంటనే జపానీ పోలీసులు ఉద్యమకారులపై తుపాకులు కాల్చారు. ఉత్తరాన రష్యన్ సైనికాక్రమణాధికారులు జపానీ అధికారుల్ని అరెస్టుచేసి పాలనాధికారాన్ని వెంటనే కొరియన్ ప్రజాస్వాతంత్ర్య సంఘానికీ, జాతీయ స్వాతంత్ర్యపక్షానికీ, డెమోక్రటిక్ పక్షానికీ ఒప్పగించారు. సియూల్ నగరంలో అమెరికన్ సైనికాధికారుల ఆధ్వర్యం కింద జపానీ పోలీసులు ఉద్యమకారులపై తుపాకులు కాల్చినవిషయం తెలియగానే, వాషింగ్టన్ నుంచి అమెరికన్ ప్రభుత్వం జనరల్ హాడ్జెకు ఉత్తరువులిచ్చి జపానీ వారిని అధికారం నుంచి తొలగించింది.

తరువాత మాస్కోలో అగ్రరాజ్యత్రయ విదేశాంగమంత్రులు సమావేశమై కొరియాలో జాతీయప్రభుత్వస్థాపనకు అయిదేళ్లు వాయిదా వెయ్యడానికి నిర్ణయించారు. ఈ అయిదేళ్లలోనూ కొరియాలోని అన్ని రాజకీయపక్షాల ప్రతినిధులతోనూ ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని స్థాపించి రష్యన్ అమెరికన్ సైనికాధిపతులిద్దరి "సంరక్షకత్వం" (ట్రస్టీషిప్) కింద ఈ ప్రభుత్వం చేత పరిపాలన సాగించాలని మాస్కో సమావేశం నిర్ణయించింది.

రాజకీయపక్షాల ప్రతినిధులలో ఎవరిని ఆహ్వానించి సంప్రదించి ప్రభుత్వాన్ని నిర్మించాలనే విషయంపైన అమెరికన్ రష్యన్ జాయింట్ కమీషన్ లో ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ సమాలోచనలు రెండేళ్ళపైగా కొనసాగి నిష్ఫలమైనాయి. అమెరికన్ వర్గం డా॥ రీ, కిమ్ కూ మొదలైనవారి పక్షాల ప్రతినిధులను ఆహ్వానించారు గాని గొరిల్లా యుద్ధాన్ని సాగించిన కొరియన్ ప్రజాస్వాతంత్ర్య సంఘ ప్రతినిధుల్నీ, కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధుల్ని ఆహ్వానించనివ్వలేదు. దక్షిణ కొరియాలో కార్మిక సంఘాల్ని అణచివేసి నాయకుల్ని అరెస్టుచేసి సంప్రదింపుల్లో పాల్గొననివ్వలేదని రష్యన్ సైనికాధిపతి ఆరోపించాడు.

ఈ రెండేళ్ళలో రష్యన్ అధికారులు మంచూరియానుంచీ, సైబీరియా నుంచీ, కొరియా దేశస్థులు అనేక వేలమందిని ఉత్తర కొరియా తీసుకువచ్చారు. వ్యావసాయిక భూమిని జపానీయజమానులనుంచీ కొరియన్ ధనవంతులవద్దనుంచీ స్వాధీనపర్చుకుని భూమిలేనికర్షకులకు పంచిపెట్టారు. అక్కడ అన్యరాజకీయ పక్షాల్ని అణిచివేసి కమ్యూనిస్టుపక్షాల్ని బలపరిచారని జనరల్ మెకార్థర్ అమెరికన్ ప్రభుత్వానికి నివేదించాడు. ఉత్తరకొరియాలోని పరిశ్రమలన్నిటినీ తామే స్వాధీనపర్చుకుని కొరియన్ల తరఫున తామే నిర్వహిస్తున్నట్లు రష్యన్ అధికారులే చెప్పుకున్నారు.

దీనివల్ల కొరియాలో రాజకీయపక్ష ప్రతినిధుల సమావేశం గురించి రష్యన్ అమెరికన్ అధికారవర్గాలమధ్య అంగీకారం కుదరలేదు.

కొరియానుంచి అమెరికన్ సైన్యాలు రష్యన్ సైన్యాలూ కూడా నిష్క్రమించినట్లయితే సమస్య దానంతటదే పరిష్కారమైపోతుందనీ, జాతీయప్రభుత్వ స్థాపనను కొరియావాసులకు విడిచిపెట్టడం మంచిదనీ

రష్యన్ విదేశాంగమంత్రి మోలటోవ్ అమెరికన్ విదేశాంగమంత్రి మార్షల్‌కు సూచించాడు. ఈసూచనను అమెరికన్ ప్రభుత్వం వెంటనే నిరాకరించింది. కాని కొరియాలో, ముఖ్యంగా దక్షిణకొరియాలో డా॥ రీ డెమోక్రటిక్ పార్టీ మినహా మిగతా రాజకీయపక్షాలన్నీ ఆమోదించాయి. అమెరికన్ సైన్యాలు దక్షిణకొరియాలో ఉండి దేశమంతా కమ్యూనిస్టు పరం కాకుండా కాపాడాలని డా॥ రీ కోరాడు. దీనితో డా॥ రీ డెమాక్రటిక్ పక్షంలో సభ్యుల సంఖ్య కొన్నివేలనుంచి అరువందలకు పడిపోయింది. కిమ్ కూ ఈపక్షంనుంచి విడిపోయి జాతీయప్రజాస్వామ్యపక్షాన్నొకదాన్ని స్థాపించి, మోలటోవ్ సూచనను అంగీకరించాలని ఆందోళన ప్రారంభించాడు. తరువాత ఉత్తరకొరియాలో రష్యనులు ప్రభుత్వాన్ని స్థాపించినప్పుడు కిమ్‌కూ పయంగ్‌యాంగ్ నగరం వెళ్లి అక్కడ ప్రభుత్వంలో మంత్రిగా చేరాడు. రష్యనులు స్థాపించిన ప్రభుత్వంలో కమ్యూనిస్టుపార్టీ, జాతీయపక్షం, జాతీయప్రజాస్వామ్యపక్షం మొదలైన రాజకీయపక్షాలు అయిదు పాల్గొన్నాయి. నియంతృత్వం స్థాపించబోరనీ, జపాన్‌వారివి తప్ప కొరియన్ల ఆస్తుల్ని స్వాధీనపర్చుకోనరనీ కమ్యూనిస్టులు వాగ్దానమిచ్చారు.

రష్యన్ అమెరికన్ జాయింట్ మిలిటరీ కమిషన్ రెండేళ్ల సంప్రదింపుల్లో అమెరికా ఒక సూచన చేసింది. ఉభయప్రాంతాల్లోనూ విడి విడిగా ఎన్నికలు జరిపి, ఉభయప్రాంతాల శాసనసభల్ని రెండు ప్రధాననగరాల్లోనూ సమావేశపరిచి, ఆ సమావేశాల్లో శాసనసభల్లో ప్రతినిధుల్ని మళ్లీ ఎన్నుకుని ఆప్రతినిధుల్తో జాయింట్ కమిషన్ సంప్రదింపులు జరిపి ఉభయప్రాంతాలకూ కలిపి ఒకే ప్రభుత్వాన్ని నిర్మించాలని సూచించింది. ఈసూచనను ఆమోదించినట్లయితే కొరియా విభజన స్థిరపడిపోగలదనీ, కొరియా విభజనకు అంగీకరించజాలరనీ రష్యన్ అధికారులు సూచనను నిరాకరించారు. అందువల్ల కొరియాను విభజించియైనాసరే అక్కడ తమ కనుకూలమైన ప్రభుత్వాన్ని స్థాపించి ఆప్రభుత్వంసహాయంతో దక్షిణకొరియాలో తమస్థావరాల్ని స్థిరపరుచుకోవాలని అమెరికా (జనరల్ మెకార్థర్) మొదటినుంచీ అభిప్రాయపడినట్లు బోధపడుతుంది. ఉభయప్రాంతాలలోనూ రాజకీయపక్షాల వైషమ్యం మితిమీరిన పరిస్థితిలో, సైనికాక్రమణ ఉండగా ఎన్నికలు జరిపినట్లయితే, అది ఐక్యరాజ్యసమితి వారి కమిషన్ అజమాయిషీ క్రిందనైనాసరే కొరియావిభజన స్థిరపడిపోక తప్పదని రష్యా వాదించింది.

కొరియా భవిష్యన్నిర్ణయసమస్యను ఐక్యరాజ్యసమితిలో 1947 సెప్టెంబర్‌లో అమెరికన్ ప్రతినిధి ప్రతిపాదించాడు. రష్యన్ ప్రతినిధి ప్రతిఘటించాడు.

ఉభయసైన్యాలూ కొరియానుంచి వైదొలగిపోతేగాని కొరియా అంతటికీ ఒకే ప్రభుత్వాన్ని స్థాపించడం సాధ్యపడదని రష్యన్ ప్రతినిధి వాదించాడు.

కాని ఐక్యరాజ్యసమితి రాజకీయ సంఘం ఒక కమిషన్‌ను నియమించి ఆ కమిషన్ అజమాయిషీ కింద ఉభయప్రాంతాల్లోనూ సార్వజనీన వయోజకవర్గప్రాతిపదిక పైన స్వేచ్ఛగా ఎన్నికలు జరపాలని నిర్ణయించింది. ఆ ఎన్నికల్లో వచ్చే జాతీయశాసనసభ కొరియా రాజ్యాంగాన్ని నిర్ణయించి ప్రభుత్వాన్ని స్థాపించాలని కూడా నిర్ణయించింది. కాని 1945 లో మాస్కోలో జరిగిన ఒప్పందాన్నే అమలుజరపాలనీ, సైనికాక్రమణ ఉండగా ఎన్నికలు స్వేచ్ఛగా జరుగవనీ, అందువలన ఉభయసైన్యాలూ నిష్క్రమించిన తరువాతనే ఎన్నికలను ఏర్పాటుచెయ్యాలనీ, రష్యన్ ప్రతినిధి వాదించి, ఐక్యరాజ్యసమితి కమిషన్ నియామకానికి అంగీకరించలేదు.

ఐక్యరాజ్యసమితిలో తన ప్రాబల్యాన్ని స్థిరపర్చుకుని రష్యన్ వర్గాన్ని తటస్థవర్గాన్నికూడా ఓడించి తన నిర్ణయాల్ని సమితి సభ్యులందరిపైనా అమెరికా రుద్దగలుగుతోంది. ఈపరిస్థితిలో ఐక్యరాజ్యసమితినిర్ణయాలు రష్యాకి అంగీకారయోగ్యంకాకపోవడం సులభగ్రాహ్యమే. ఈకారణంవల్లనే ఇంక ఐక్యరాజ్యసమితి నిరుపయోగమైనదని భావించి 1950 లో రష్యన్‌వర్గం సమితి సంఘాలన్నిటినుంచీ నిష్క్రమించింది. 1947 అక్టోబర్‌లో సమితివారు నియమించిన కొరియన్ కమిషన్‌లోని తొమ్మిదిదేశాల ప్రతినిధులలో ఇద్దరుమినహా ఏడుగురు పూర్తిగా అమెరికా అనుచరులే. ఆయిద్దరిలో భారతప్రతినిధి తటస్థవర్గానికి చెందినవాడు. రష్యన్ వర్గానికి చెందిన యుక్రేన్ ప్రతినిధి మాన్యుయల్ స్కీ కమిషన్ సభ్యత్వాన్ని నిరాకరించాడు.

కమిషన్ దక్షిణకొరియాలో ఎన్నికల్ని మాత్రం అజమాయిషీ చెయ్యగలిగింది, ఉత్తరకొరియాలో ప్రవేశించడానికి రష్యన్ అధికారులు అనుమతి నివ్వలేదు. దక్షిణకొరియాలో ఎన్నికల్ని నిరోధించడానికిగాను ఉత్తరకొరియానుంచి అనేకులు రహస్యంగా ప్రవేశించారు. బహిరంగంగా ఎన్నికల్లో పాల్గొని డా॥ రీ పక్షంతో పోటీ చెయ్యడానికి కిమ్‌కూ ఉత్తరకొరియాప్రభుత్వం నుంచి రాజీనామా చేసి, దక్షిణకొరియా ప్రవేశించాడు. సియోల్ నగరంలోనే ఎన్నికలముందు కిమ్ కూ హత్యచెయ్యబడ్డాడు.

కమిషన్ అజమాయిషీకింద దక్షిణకొరియాలో ఎన్నికలు జరిగాయి. డా॥ రీ అధ్యక్షతకింద ప్రభుత్వం నిర్మించబడింది. రాజ్యాంగాన్ని కూడా శాసనసభ నిర్ణయించింది. ఈ రాజ్యాంగంప్రకారం అమెరికన్లకు కొరియన్లతో సమానంగా ఆస్తిహక్కులు, పౌరస్వత్వాలు ఇవ్వబడినాయి. 1948లో ఉత్తరకొరియాలో తాత్కాలికప్రభుత్వం ఆధ్వర్యం కింద ఎన్నికలు జరిగాయి. దక్షిణకొరియాలో కూడా పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యం కింద రహస్యంగా ఎన్నికలు జరిగాయనీ, ఈ ఎన్నికల్లో గెల్చిన ప్రతినిధులు, ఉత్తరకొరియాలో ఎన్నికైన ప్రతినిధులు కలిసి పయంగ్‌యాంగ్ లో సమావేశమై కొరియా అంతటికీ ప్రాతినిధ్యం వహించగల ప్రభుత్వాన్ని నిర్మించినారనీ రష్యన్ అధికారులు ప్రకటించారు. ఈ ప్రభుత్వానికి కిమ్‌ఇల్‌సుంగ్ ప్రధానమంత్రి. కమ్యూనిస్టులు, జాతీయరాజకీయపక్షవాదులతో మిశ్రమప్రభుత్వం స్థాపించబడింది. 1948డిసెంబర్‌లో రష్యన్ సైన్యాలు ఉత్తరకొరియానుంచి నిష్క్రమించాయి.

తరువాత ఐక్యరాజ్యసమితికమిషన్‌ను పునర్నిర్మించి ఉభయప్రభుత్వాలమధ్యను సమాధానం చేకూర్చడానికి యత్నించాలనీ, శాంతిని కాపాడాలనీ ఉత్తరువు లిచ్చింది. కమిషన్ అజమాయిషీకింద ఉత్తరకొరియాలో ఎన్నికలు జరగలేదు కాబట్టి, ఉత్తరకొరియాప్రభుత్వాన్ని సమితి పరిగణించలేదు. దక్షిణకొరియాప్రభుత్వాన్ని మాత్రమే పరిగణించింది.

డా॥ రీ ప్రభుత్వం కొత్తరాజ్యాంగాన్ని నిర్ణయించినతరవాత కొత్తఎన్నికలు జరప

వలసివచ్చింది. ఈ ఎన్నికలు జరిపేసమయానికి అమెరికన్ సైన్యాలు నిష్క్రమించవలసివచ్చింది. కాని డా॥ రీ అమెరికన్ సైన్యాలుండాలనీ, కమ్యూనిస్టుల దురాక్రమణనుంచి కాపాడాలనీ కోరాడు.

కొనిదినాలలో డా॥ రీ ప్రభుత్వంపట్ల అసంతృప్తి నానాటికీ తీవ్రమయింది. అమెరికన్ సైన్యాలున్నప్పుడే సరిహద్దువద్ద సంఘర్షణలు కమ్యూనిస్టుల దాడులు గొరిల్లాల విధ్వంసక చర్యలు సంభవిస్తూఉండేవి. ప్రజలు అధికారులతో సహకరించలేదు. ఆర్థికస్థితి నానాటికీ క్షీణిస్తూవచ్చింది. పారిశ్రామికబలంగల ఉత్తరకొరియా ఆహారానికి దక్షిణకొరియాపైన ఆధారపడిఉంటుంది. దక్షిణకొరియాలో వ్యవసాయంమాత్రమే మిగిలినందువల్ల, రైతులకు దుస్థితిఏర్పడినందువల్ల ఉభయప్రాంతాలకీ దేశైక్యత అనివార్యమనేవిషయం బోధపడింది. 1949జూన్‌లో అమెరికన్ సైన్యాలు నిష్క్రమించాయి. ఆనాటినుంచీ అమెరికన్ ఆర్థికసహాయం, ఆయుధసామగ్రిసప్లై దక్షిణకొరియాకు ప్రాణావసరమైనాయి. పోలీసులబలం లేకపోతే ప్రభుత్వం నిలవజాలని పరిస్థితి ఏర్పడింది.

ఉత్తరకొరియాలో కమ్యూనిస్టులు క్రమంగా బలపడ్డారు. చీనా అంతర్యుద్ధంలో కమ్యూనిస్టులపక్షాన పోరాడిన వేలాదిసైనికులు ఉత్తరకొరియాకు తిరిగివచ్చారు. అనేకులు దక్షిణకొరియాలో చేరి గొరిల్లాదళాలుగా ఏర్పడ్డారు. 1950మేలో జరిగిన ఎన్నికల్లో 54 రాజకీయపక్షాలు, స్వతంత్రఅభ్యర్థులు పాల్గొన్నారు. స్వతంత్రఅభ్యర్థులే అధికంగా ఎన్నికైనారు. ఈ ఎన్నికలలో స్థిరమైన ప్రభుత్వం దక్షిణకొరియాలో ఏర్పడ్డం అసంభవమని తేలిపోయింది. అమెరికన్ సైన్యాలు నిష్క్రమించిన ఏడాదికి, ఎన్నికల్లో ప్రభుత్వపక్షానికి పరాజయం కలిగిన అనంతరం ఉత్తరకొరియాసైన్యాలు దక్షిణకొరియాపై దండయాత్ర ప్రారంభించాయి

కొరియాయుద్ధం రష్యా,అమెరికాల మధ్య వైరాలవల్లనే పరిణమించినమాట నిస్సందేహం. ఉభయప్రాంతప్రభుత్వాలమధ్యనూ సమాధానం సాధ్యపడలేదంటే, డా॥ రీ ఉత్తరకొరియావాసులతో గాని, కిమ్ ఇల్ సుంగ్ దక్షిణకొరియాప్రభుత్వంతో గాని రాయబారాలు జరపడానికైనా అంగీకరించలేదంటే, రష్యాఅమెరికాలే కారకులు కమిషన్ నివేదించింది. ఈ నివేదిక 1950 సెప్టెంబర్ ఐక్యరాజ్యసమితిసభా వేళంలో చర్చించవలసిఉంది.

కొరియాఅంతర్యుద్ధంలో జోక్యం చేసుకోడానికి అమెరికా పూర్వమే నిశ్చయించుకున్నట్లు స్పష్టంగా తెలుస్తున్నది. అలా జోక్యంచేసుకుంటుందని తెలిసినందువల్లనే డా॥ రీ పట్టుదలతో సమాధానానికి రావడానికి నిరాకరించాడు.

కొరియాలో జోక్యంచేసుకోనిపక్షంలో అమెరికాపరపతి ఆసియాలో పూర్తిగా నష్టమైపోయేదే, తూర్పుఆసియాదేశాలకు రష్యన్‌వర్గదేశాలపట్ల కల భయసందేహాలు క్రమంగా తగ్గి, కొన్ని మైత్రికోసం ప్రయత్నించి ఉండేవి. ఆసియాఆర్థికసంపదపైన ఆధారపడిఉన్న పశ్చిమయూరోపియన్ దేశాల ఆర్థికస్థితి భగ్నమైపోయేదే. అప్పుడు రష్యా యూరప్ అంతనీ ఆక్రమించుకున్నా ఆటంకం లేకపోయేదే. అట్లాంటిక్ పాక్ట్ పేకమేడవలె కూలిపోయేది.

కాని ఆసియాదేశాలకు ఏపక్షంలో చేరినా గండం తప్పదు. ఆయుధసామగ్రి సప్లై తప్ప వాస్తవంగా ఆర్థిక సహాయం చెయ్యడం ఎరగని అమెరికా, కొరియాలో గెలుపొందేపక్షంలో వారి వ్యాపారప్రాబల్యానికీ, రాజకీయప్రాబల్యానికీ ఇంక తిరుగుండదు యూరోపియన్లు అమెరికన్ల ఆర్థికప్రాబల్యాన్ని నిరోధించ యత్నిస్తున్న ఆసియాదేశాలింక తలొగ్గక తప్పని పరిస్థితి రావచ్చును.

ప్రచ్ఛన్నయుద్ధంలో, ప్రచారంలో, వ్యాపారప్రాబల్యవ్యాప్తిలో ఓడిపోయిన అమెరికా ప్రత్యక్షయుద్ధానికి సిద్ధపడుతూనే ఉంది. అమెరికావిజృంభించడానికి కొరియా నాంది.

కాని రష్యా ప్రత్యక్షంగా ఈ యుద్ధంలో పాల్గొనక పోవచ్చును ఆసియాలో అమెరికన్లపట్ల వైషమ్యం పుట్టించడం ప్రధానాశయంగా గల రష్యా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగవలసిన అగత్యం లేదు. చీనాలో చీనాకమ్యూనిస్టులే

(36-వ పేజీ చూడుడు)

మాటా మంతి:

అర్బ్రా అనే స్వీడిష్ పట్టణంలో, ప్రజలకు, ట్రాం ప్రయాణాలు, ఇళ్లల్లో విద్యుద్దీపాలూ, పిల్లలకు చదువులూ, ఉచితంగా ప్రభుత్వం అమరుస్తుందట. కారణం ఈ ఊరికీ ప్రజలకూ ఉమ్మడిగా ఉన్న అడవుల మీదవచ్చే రాబడితోనే ప్రజలకివి అన్నీ ప్రభుత్వం ఉచితంగా సమకూర్చిపెట్టే అవకాశం గ్గిందట - చైనాలో చాలామంది రైతులు, తమ భూముల్లోనే చిట్టడవులు పెంచుకొని, అటు రాబడివల్లను, ఇటు అడ, ఆకుల ఎరువులవల్ల భూసారం పెంచుకోటం వల్లనూ, రెండువిధాలా బాగుపడుతున్నారట.

సస్యశ్యామలమై వెలసిన భారతధాత్రికి ఈనాడు ఈ ఉపమానాలు చూపించి, చెట్లు పెంచమని మహోత్సవాలు దేశవ్యాప్తంగా ప్రారంభించి, అసలు ప్రపంచంలో చెట్లు మానవునికి, ఆహారవిహారాది సమస్తవిషయాలలోనూ ఎల్లా ప్రయోజనకరాలో, ఒకటవ క్లాసుపిల్లలకు చెప్పినట్లు ప్రభుత్వం చెప్ప ప్రారంభించింది. కేవలం వాక్శూరత్వమే కాకుండా, క్రియాశూరత్వంకూడా ప్రదర్శించటానికి. కొన్ని కోట్లు ప్రజాధనాన్ని సద్వినియోగం చెయ్యటం ఆరంభించి, ప్రధానమంత్రి మొదలు, పల్లెటికోట కుట్టాడివరకూ, వృక్షశాస్త్రజ్ఞానము ఉందీ లేదూ అనే విచక్షణలేకుండా ప్రతివానిచేత ఒక మొక్క నాటింపిస్తూంది. ఈ మొక్కలు నాటటానికి, తోట, దొడ్డి, అడివి, ఎడారి, నడిరోడ్డూ, అన్న విచక్షణ అంత కనపర్చక పోయినా, ప్రచారపత్రాలలో, బంజరులు, చెరువుగట్లు, కోరడులు, గయ్యాళీ భూములు, మొదలైన వాట్లల్లో పెంచటం మంచిదని సూచననిచ్చింది.

స్వయంగా విజయాన్ని సాధించుకోగలిగారు. అమెరికా ప్రత్యక్షంగా పోరాడని పక్షంలో దక్షిణకొరియా క్షణంలో కమ్యూనిస్టుల వశమైపోయేది. కాని ఇప్పుడు అమెరికనులు స్వయంగా యుద్ధానికి దిగినందువల్ల జయాపజయాలు ముందుగా నిర్ణయించడం దుర్ఘటం. కాని ఒక్క విషయాన్ని ఖండితంగా చెప్పవచ్చును. ఎన్నికల్లో ఓడిపోయిన డా॥ రీ ప్రభుత్వాన్ని నిలబెట్టడానికి స్వయంగా యుద్ధంలోకి దిగిన అమెరికన్ల ఆధ్వర్యంకింద ఎటువంటి ప్రభుత్వం నెలకొల్పబడినా అది అట్టే కాలం నిలవదు. కమ్యూనిస్టులకు అది చాలు. అదీ కాక ఆసియా అంతటా అమెరికా విధానమూ, ప్రజల వైఖరీ మారగలదు.

వనమహోత్సవం

వృక్షాలవల్ల ఫలితాలేవేవున్నాయో, ఆ ఫలితాలు సక్రమంగా అందాలంటే, ప్రభుత్వం అడవులను పెంపొందించాలనీ, ఆ పనికి, భారీవ్యవహారం సాగించటానికి కావలసిన పెద్దగుంపుల్లో కూలీలను నియమించి ప్రతి ప్రదేశంలోను కొన్ని కొన్ని ఎకరాలమేర, ఉమ్మడిగా అడవులు పెంచాలనీ, అనేది, సుస్పష్టమైనా, ప్రభుత్వం కేవలం ప్రజలలో వృక్షాభిమానం ప్రబోధరూపంగా కల్పించదలచుకొంది. కాబట్టి, ఎక్కువ శంకలను వెలువర్చవలసిన పనిలేదు.

ఈనాడు నాటే చెట్లు, గతరెండు మూడేళ్ళలో ఇల్లాంటి వేడి పుట్టినప్పుడు నాటినవాటి మాదిరే అవుతాయేమో అని అశుభం, అనుకోవటంకూడా అంత మంచిదికాదు. నివాసానికి జాగా లేక ఏకా సణ్ణాయినా ఆవరణ ఉంటే ఇంకో పెద్దో ఉపయోగించే పాకో వేసి, నివాసానికి, అర్థిక మాంద్యాన్ని కొంత అరికట్టుకోగలచే పట్టణగృహస్థులు, ఈ చెట్లను పోషించి వాట్లవల్ల వచ్చేగాలి శుభ్రమైనదన్న సత్యాన్ని తక్కిన జీవితసత్యాలన్నిటికన్న అగ్రస్థానంలో స్థాపించి, పూజచేయటం కొంత కష్టమేమో. అయినా ప్రభుత్వభక్తిమార్గం దైవభక్తి మార్గమంత సులభసాధ్యం కాకపోయినా, జీవితసౌలభ్యానికి, దైవభక్తికన్న ఇదే తరణోపాయం కాబట్టి, వాళ్ళుకూడా ఇందులో ఉడుతాభక్తి చూపించకతప్పదు.

ఇక పల్లెటివాసులకో.

"వేపచెట్టు చాలామంచిది. దీని బెరడు, ఆకు, ఈనెలు, దీని జిగురు, దీనినుండి వచ్చేకల్లు, మొదలైనవి సర్వవ్యాధులకు మంచి ఔషధములుగా పనిచేయగలవు. దీని మ్రాను తలుపులకు ద్వారబంధములకు ఉపయోగించును. దీనిగాలి చాలా ఆరోగ్యకరమైనది,"

అని పల్లెటి వృద్ధులమధ్య చెప్పి, "ఏమిటోయ్ చెప్పవు బలే కొత్త కొత్త విషయాలు చదువుకొన్నావయ్యా, లండనులో చెప్పారా, అమెరికాలో చెప్పారా బాబూ నీకు" అని వాళ్లు నవ్వనారంభిస్తే, "బొగ్గుగనులలు బొగ్గు మోసికెళ్లినవాళ్లలాగా ప్రబోధకులు హాస్యాస్పదులు కావలసి వస్తుందేమో! అయినా ప్రభుభక్తిలో, ఈ అపహాస్యాలూ, చిన్న చిన్న కష్టాలూ లెక్కచెయ్యవలసినవికావు.

పోనీ కాదని ప్రభుత్వం కరపత్రంలోని తక్కిన చెట్లపేర్లు ఎత్తుకొంటే, వాటిపేర్లు వాళ్లకు చెప్పేలోపల, ప్రచారకుడే, నాలుగు ప్రౌసుడిక్షనరీలు, ఐదు వస్తుగుణదీపికలు పరిశోధించి, బాటనీపారిభాషిక పదాలు నేర్చుకొంటేనేగాని గడిచి గట్టెక్కటం కష్టం. "కైనోట్రీ, ఫ్రగ్నమ్, గ్లిరిసిడియా, మాకు లెటా, ప్రోసోపిస్, జూలీఫ్లోరా" ఈ చెట్లు నాటమని పల్లీయులకు చెప్పగలిగినవాడు, ఒక్క వృక్షశాస్త్రంలోనే కాక, శబ్దశాస్త్రపండితుడయి కూడా ఉండాలి. కాని భక్తిమార్గంలో ఈ కష్టాలు అతిస్వల్పాలు.

ఇల్లాంటి స్వల్ప అభ్యంతరాల కేమిగాని, ప్రభుత్వం చెప్పినట్లు, చెట్లు లేనిదే, మేఘాలువచ్చి వానలు కురవ్వు, పంటలుపండవు. గిన్నెలోకి గిన్నెకిందికి, సంబారాలు దొరకవు, ప్రజలకు సమృద్ధి లేదు. అదీ కాకుండా చెట్లు, సాక్షాత్తు భగవంతుడు సృష్టించిన నోరులేని జీవము. దాన్ని పెంచి పోషిస్తామని కంకణం కట్టుకొంటేనే ప్రజలకు ప్రభుసేవా, భగవత్సేవాకూడా, ఉభయతారకంగా ఇట్టే లభిస్తాయి. కాబట్టే, ఈవారం ప్రతివారు ఒక చెట్టు నాటండి. దాంతో మన ప్రభుత్వంకూడా, చెట్లునాటి పెంచిన భారత ప్రజకు కొన్నాళ్లలో, స్వీడన్ అర్బ్రా ప్రజలకు లాగా ఉచితంగా, రైలుప్రయాణసౌకర్యాలు, ఉచితంగా విద్యుద్దీపాలూ, పిల్లలకూ పెద్దలకూ ఉచితవిద్యాసౌకర్యాలూ కల్పించవచ్చును.

నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

30

ఏకశిలానగరమున శిలాప్రాకారనిర్మాణము చురుకుగా సాగిపోవుచున్నది.

కేశవశ్రీస్వయంభూనికేతనములలో వైకుంఠైకాదశి మహోత్సవముగా జరుగును. అక్కడ కేశవభక్తులకును స్వయంభూశేశ్వరభక్తులకును విరోధము లేదు. పలువురు ఉభయభక్తులు. అక్కడ నేపర్వమునందును ఉభయదేవాలయములలో పూజలు విశేషముగా జరుగును. ఒక్కటే భేదము! ఆ పర్వము, విష్ణుదేవప్రీతికరమైనచో కేశవాలయమున పూజ ప్రధానము, శివప్రీతికరమైనచో స్వయంభూదేవాలయమున పూజ ప్రధానము. కేశవాలయమున నర్చకులు వైఖానసులు; స్వయంభూదేవాలయమున నర్చకులు శివార్చకులు. అనాదిగా స్మార్తులు అభిమానించు దేవాలయములలో నిదే యాచారము!

గణపతిదేవులు చిన్నతనమున దేవగిరిలో చెరసాలలో నున్న దినములందు ఓరుగల్లును కాకతీయసామ్రాజ్యమును మిక్కిలి యలజడిగా నుండెను. అప్పుడు దానికి పొరుగున నున్న హొయిసల బల్లాలరాజ్యము మాత్రము శాంతముగా నుండెను. అందుచే కాకతీయరాజ్యములోని చాతుర్వర్ణ్యప్రజలు పలువురు హొయిసలుల రాజ్యములో తలదాచుకొనబోయిరి. అక్కడ నప్పుడు శ్రీవైష్ణవమతము ప్రబలముగా నుండెను. శ్రీమద్రామానుజులను స్వయముగా చూచినవారును, వారి కైంకర్యముచే ధన్యులైనవారును, వారి యుపదేశములు ఆలకించినవారును, వృద్ధవైష్ణవు లప్పుడు సహస్రాధికముగా నక్కడ నుండిరి. అట్టివారి భక్తిప్రపత్తులచే ముగ్ధులై వారి తేజః ప్రభావములకు మురిసి, వారి వాదపటిమచే నాకృష్టులై, యక్కడి చాతుర్వర్ణ్యజనమును రామానుజమతము విరివిగా నవలంబింపసాగెను. అక్కడివారితోపాటు కాకతీయరాజ్యమునుండి వెళ్లిన ప్రజలును పలువురామత మవలంబించి వైష్ణవులైరి.

శ్రీవైష్ణవుల బల మతిశయించినయెడల నెల్ల, అనాదిగా వైఖానసు లర్చకులుగా నున్న దేవాలయములలో, ఈ నూతనవైష్ణవుల ప్రాబల్యము నెమ్మది నెమ్మదిగా నెక్కువకాజొచ్చెను. దానితోపాటు పన్నిద్దరాళ్వారుల ప్రతిష్ఠలు ప్రారంభించెను. పూర్వము ద్రావిడవేదపారాయణము భక్తులైనవారు. కొందర రభిమానముతో నా దేవాలయములలోగూడ జేసెడివారు. కాని యిప్పు డది యితరస్తోత్రములు చదువుచున్నట్లే అందులో నొకటిగా నుండెడిది. తర్వాత తర్వాత నది నియతముగా చేయవలె నను విధి నెమ్మదిగా కొన్ని దేవాలయములలోని కెక్కసాగెను. కైంకర్యాదులలో వైదిక మంత్రములను వదలి ద్రావిడపాశురములు ప్రయోగించుటకు వైఖానసు లిష్టపడుచుండుటలేదు.

వైఖానసులకును ఈ నూతనవైష్ణవులకును నిలువుబొట్టును విష్ణుభక్తియు సమానమే యైనను ఎన్నియో అవాంతరభేదము కలవు. ఆ బొట్టులోకూడ వైఖానసులకు క్రింద పాద ముండదు. నూతనవైష్ణవులలో పలువురకు పాద ముండును, కొందర కు... తిరుచూర్ణమురంగులోకూడ భేదము లుండును. వితంతువులు ... తీయించుటలోనను, భగవదారాధనలో ఘంటావాదనము చేయుట యందును ఆచారభేదములు కలవు. వడఘలై శాఖ ఇంకను ... వృద్ధికానందున నూతనవైష్ణవుల యాచారములు మొత్తము ... వైఖానసుల పద్ధతులకు విరుద్ధముగానే ఉన్నవి. ఈ నూతన... ఏకాదశీశ్రాద్ధ వర్జనము చేయుట, దేవతారాధనములో ఘంటావాదనము చేయకుండుట, సహగమనము చేయని వితంతువులు కేశము ... కొనుట యట్టి యాచారముల నవలంబించుచుండుటచే, వైఖానసుల కెక్కువ కష్టముగా నుండసాగెను.

ఈ చిన్నచిన్న యాచారము లెట్లున్నను, వారి భేదములలో ముఖ్యమైనది చక్రాంకణము! వైఖానసులు గర్భచక్రాంకణము చేసికొందురు. అనగా వైఖానసస్త్రీ గర్భవతిగా నుండగానే అష్టమమాసమున కొన్ని హోమాదికములు చేసి, శంఖచక్రాంకితమై సంస్కృతమైన పాయసమును ఆమెచే ప్రాశన చేయింతురు. ఈవిధముగా గర్భమునందలి శిశువునకు చక్రాంకణమగును. అది కానివారు దేవాలయాదులలో భగవదారాధనకు అనర్హు లని వారి సిద్ధాంతము!

ఈ విధముగా నాగర్భవైష్ణవులు కాక, నూతనముగా వైష్ణవము పుచ్చుకొన్నవారికి గర్భచక్రాంకణము లేదుగదా! మొదలు చక్రాంకణమే లేకుండెను. శ్రీమద్రామానుజులు తప్తచక్రాంకణము నంగీకరించె ననియు నంగీకరింపనే లేదనియు రెండువాదములు ప్రబలియుండెను. కాని మొత్తముమీద కొంతకాలమునుండి ఈ నూతనవైష్ణవులు తప్తచక్రాంకణము చేయించుకొనుట పరిపాటి యైనది. తప్తచక్రాంకణ మనగా, తప్తమైన వస్తువుతో రెండు భుజముల

[illegible] చిహ్నములు శాశ్వతముగా నుండునట్లు వేయించుకొనుట. ఇది యొకానొక మంత్రసంస్కారముతో జరుగును. ముఖ్యముగా ఈ సంస్కారమే ఈ నూతనవైష్ణవులను వైఖానసుల నుండి వేరుచేసి గుర్తించుటకు అనువైన బాహ్యచిహ్నముగా నుండెను.

కాకతీయసామ్రాజ్యమున గణపతిదేవులు శాంతి నెలకొల్పిన నాటిదిగా, పల్లాల కర్ణాటకరాజ్యమున పూర్వము తలదాచుకొనబోయిన కాకతీయప్రజలు పలువురు మరల స్వస్థానములకు నెమ్మదిగా చేరుకొనసాగిరి. వారివెంట నీ రామానుజమతమును కాకతీయరాజ్యమున బ్రాకజొచ్చెను. అక్కడ వైష్ణవమత మవలంబించిన బ్రాహ్మణులు శ్రీవైష్ణవసంజ్ఞతో తిరిగి వచ్చిరి. వారిలో పలువురు వేదవేదాంగవిదు లుండిరి. ఎన్నియో సంబంధముల బురస్కరించుకొని; కర్ణాటులగు శ్రీవైష్ణవులును, ఉద్దండులగువారు, కొందరిచ్చటికి వచ్చిరి. వారితోపాటు శ్రీవైష్ణవుల ప్రాభవమును కాకతీయసామ్రాజ్యమున నతిశయింపజొచ్చినది. వారి కిక్కడి స్మార్తపండితులతోను శైవులతోడను వివాదములు పెరుగజొచ్చినవి. వైఖానసులు ఎక్కువభాగము భగవత్కైంకర్యములలో నియుక్తులై యుండుటచే, వారిలో నితరవిద్వత్పరిశ్రమ బహుకాలముగా క్షీణించియుండెను. కాని యిప్పుడు విష్ణుపారమ్యమును సమర్థించు శ్రీవైష్ణవపండితుల రాకడ వారికి కొంత నూతనచైతన్యము కలిగించెను. దానితోపాటు వారిపై శ్రీవైష్ణవుల యొత్తిడియు ప్రారంభించినది.

కేశవస్వామి యాలయమునకుగూడ శ్రీవైష్ణవులు వచ్చుచుండిరి; గాని యచ్చటి యాచారములను మార్చుటకు ఇంతకుమున్నెప్పుడును వారు ప్రయత్నించియుండలేదు. వా రచ్చటికి వచ్చి మహాన భక్తితో ద్రావిడపాశురములు పఠింతురు. దాని కెవరి కేమి యభ్యంతరము ?

వైకుంఠైకాదశి ధనుర్మాసమున పుష్యశుద్ధైకాదశినాడు వచ్చును. ఆ పర్వనిర్ణయములో స్మార్తులకు శ్రీవైష్ణవులకు వైఖానసులకు నీషద్భేదము లున్నవి. ఒక్కొక్కరోజు హెచ్చుతగ్గులు వచ్చును. శ్రీవైష్ణవులు సందేహము కలిగినచో శ్రీరంగక్షేత్రమునందలి నిర్ణయమును పాటింతురు. ఈ సంవత్సర మట్టి భేదము వచ్చినది. స్మార్తులకైన మరునాడు శ్రీవైష్ణవుల కైనది. ఇప్పటికి వారముదినములనుండియు నా దేవాలయావతరణములో వాదప్రతివాదములు సాగుచుండెను. వైఖానసులు మొత్తముమీద స్మార్తపక్షమే యవలంబించిరి. ఈ సందడిలో తిక్కనసోమయాజుల మహాభారతరచన సరిగా సాగుచుండుట లేదు.

కేశవస్వామియాలయములోని యర్చకులు వైఖానసులైనందునను, వారందరును స్మార్తనిర్ణయము ననుసరించువారైనందునను, ఈనాడే వైకుంఠైకాదశీమహోత్సవము వారు జరుపుచుండిరి. శ్రీ వైష్ణవుల కది కంటకముగా నున్నది గాని యేమి చేయగలరు ?

త్వరలో నుత్తరాయణపుణ్యకాలము రానున్నది ! దానికై ముందుగనే ఈనాడు విశ్వమూర్తి యగు శ్రీమహావిష్ణువు ఉత్తర ద్వారము తెరపించి భక్తులకు దర్శన మిచ్చును. ఇక నారాయణునితోపాటు భక్తులును ఉత్తరాయణము తిలకింప సిద్ధముగా నుందురు. దానినే స్మార్తులు ముక్కోటిఏకాదశి యందురు. దాని కాపేరెట్లు వచ్చెనో, అపదముల కూర్పు ఎట్లు సాధ్యమో, చెప్పలేము; కాని ఆ పేరుకు అశేషమగు సాంప్రదాయికము సాక్ష్యము. [illegible] లైనను దాని నూహింపవచ్చును.

మనోజ్ఞముగా మంగళతూర్యారవములు మ్రోగుచుండ బ్రహ్మరథ మెక్కి, శ్రీ కేశవస్వామి తెల్లవారుజాముననే భక్తులకు ఉత్తరద్వారదర్శన మిచ్చి, మహావైభవముతో విశాలమగు దేవాలయావరణమున నూరేగుచుండెను. భక్తులు తండోపతండములుగ మూగి యాయుత్సవవిగ్రహములకు కానుక లర్పించుచుండిరి. భూచక్రగొడుగులు సాగుచుండ, అర్చకులు వింజామరలు వీచుచుండ చలువచప్పరములో సర్వాభరణభూషితుడైయున్న యా కేశవస్వామిని ఆనాడు చూచినవారివే కన్నులు !

ఆ సమయముననే స్వయంభూదేవాలయమునగూడ విశేషముగా నభిషేకార్చనలు జరుగుచుండెను. ఆ సమీపముననే నూతనప్రతిష్ఠితుడగు నన్నమేశ్వరుని యాలయమున యథావాక్కుల అన్నమయ్యయు రుద్రాభిషేకము నిర్వర్తించుచుండెను. ఆ యాలయముఖమండపమున శివభక్తులు గుంపులుగా మూగి భక్తివినమ్రులై ప్రమథగణముల వలెనే యలరారుచుండిరి.

అట్టి సమయమున నూతనవైష్ణవుల తండ మొకటి భజన చేయుచు నాలయప్రదక్షిణము చేయుచుండెను. కేశవశ్రీస్వయంభూదేవాలయము నావరణము నలుచదరముగా నుండి ఒక్కొక్క ప్రక్కను రమారమి రెండువందల విండ్లప్రమాణ ముండును. సరోవర మున్నవైపున గాక మిగిలిన మూడువైపులను రాజవీధి కావల జనసంకులము లగు గృహముల శ్రేణులు కలవు. ఆ ప్రాకారము భజన చేయుచు చుట్టివచ్చునప్పటికి నాలుగుగడియలు పట్టును.

ఆ శ్రీవైష్ణవుల కానాడు వైకుంఠైకాదశి కానందున లోపల నూరేగుచున్న కేశవస్వామిని దర్శింపవలె నను నుత్సుకత లేదు. ఆ నూతనవైష్ణవతండమునకు అగ్రేసరుడై శ్రీవైష్ణవు డొక్కడు నడచుచుండెను. ఎరుపు కలసిన పచ్చనిదేహముపై దీర్చిన ద్వాదశోర్ధ్వపుండ్రములును అతని దేహశోభను మరింత నతిశయింపజేయుచుండెను. అందును రెండు భుజములందును తేలియున్న తప్తచక్రాంకణములు చూడ శ్రీమహావిష్ణువే యీరూపమున నవతరించెనా యనిపించుచుండెను. అతడు చూడగా నీదేశపు వాడుగా లేడు. కర్ణాటదేశము నుండి క్రొత్తగా వచ్చినవానివలె నున్నాడు. కర్ణాటదేశమున వైష్ణవులును శైవులును ఒకరినొకరు దూషించుకొనుట పరిపాటి. శివాతిశయము చెప్పవలె నన్న విష్ణువును దూషించుటయు, విష్ణ్వతిశయము చెప్పుటకు శివనింద చేయుటయు నచ్చటి యాచారము. వారికి పరపక్షులపై నంత ద్వేషము, ఎదిరి యిష్టదైవములను తెగడుచుండుటతో శాంతించుచుండెను.

ఆ కర్ణాటశ్రీవైష్ణవు డీ క్రిందివిధముగా నందుకొని పాడుచుండ నా గుంపులోనివా రాతనివెంట నదియట్లే ఉచ్చరింప సాగిరి :

నీ పాదోద్భవనీరము శిరమున
నిత్యము దాల్చుట నీలకంధరుని
పునుకలపేరులు పూసిన బూదియు
పూనిన పుర్రెయు పూతము లయినవి ;
కొలుతుము కేశవ, కులిశధ్వజహల
కలితభవచ్ఛిద్ క్రమపదద్వయి !

"భద్రంబగు నీ పదములు పాడుట
రుద్రాంశూచితరుద్రఘూచరం
డష్టైశ్వర్యము లంది మాపుకొనె
నడుగుచు తిరిపెం బవని జరించుట ;
నారాయణ నీ నామసహస్రము
శ్రీరాజితముగ జిహ్వ భజింతుము !

*　　*　　*

"కమలనయన నీ కారుణ్యామృత
విమలకటాక్షము విరిసి పర్వుటను
సుకృతి యగుచు నాసురసేవ్యుం డగు
వికృతాంబకు డా వికటన యనుడును,
సారసపత్రవిశాలవిలోకము
నీ రమ్యాకృతి నిరతము చూపుము !

ఈ భజనపరులు అన్నమేశ్వరుని యాలయముముందుకు వచ్చి యీ పాట యావేశముతో పాడుచుండిరి. అందును చివరిభాగము ముమ్మారు పాడిరి. 'ఆసురసేవ్యుడు' 'ఆసురసేవ్యుడు' 'ఆసుర సేవ్యుడు !'

అన్నమేశ్వరుని యాలయముముందర నున్న శివభక్తులు అది మొదటిమారు వినియే హుంకరించిరి. ఆ పాట లోపల నభిషేక మొనరించుచున్న అన్నమయ్యకు కూడ వినబడినది. వారట ప్రమథులు చేసిన హుంకారమును ఆయనకు వినబడినది.

రెండవమారు విని వారు మరల హుంకరించిరి. రెండవమారును ఆ పాటయు, వారట ప్రమథుల హుంకారమును, యథావాక్కుల అన్నమయ్యకు వినబడినది. ఆసురసేవ్యుని దలపించుటలో నాతనికి ఆసురప్రకృతి ప్రకోపించినది. రోషము పిచ్చలించినది. కాని యది యాతడు నిగ్రహించుకొనుచుండెను.

మూడవమారు ఆ పాట వారు పాడిరి. మూడవమారు అది విని ప్రమథులు హుంకరించిరి. మూడవమారును అన్నమయ్య కవి వినబడినవి !

రుద్రాభిషేకము చేయుచున్న యథావాక్కుల అన్నమయ్యకు అభిషేకభంగ మైనది. ఒక్కసారిగా నాతడు క్రోధదుర్నిరీక్ష్యు డయినాడు. అతని దేహమే పొంగి యీ చిన్న దేవాలయమంతయు నిండినట్లయ్యెను. ఒక్కమారాతడు వెనుదిరిగి చూచెను ! చూచెను, అంతే !

అతడు తన ఫాలభాగమున మూడు విభూతిరేఖలు తీర్చి యుండెను. వాని మధ్యభాగమున నాతడు డంతవరకు కుంకుమను పెట్టుకొని యుండలేదు. లోపలినుండి రక్తమే స్రవించెనో యేమయ్యెనో గాని, ఆ మూడువిభూతిరేఖల మధ్యభాగమున ముందు ఎర్రగా చెమర్చినట్లయ్యెను ; ఉత్తరక్షణమున నచ్చట కుంకుమాంకిత మయ్యెను ; అంతలో నందుండి రక్తమే స్రవించుచున్నట్లుండెను.

రక్తము కాదది ! రక్తమురంగుగా నున్నను అది క్రిందికి పారుటలేదు. గొట్టముతో చిమ్మినట్లు ముందుకు ప్రసరించుచున్నది. అది యొక కాంతిప్రసారము ! అగ్నిప్రసారమే ! సాంబసదాశివుని వికటాంబకము శ్రీవైష్ణవులు తలపించుటచే నవి యా భక్తాగ్రేసరుని నొసట ప్రత్యక్షమైనది.

అక్కడ మ్రాగియుండిన శివభక్తులకే భయమైనది. వారు రెండుచేతులు శిరోగ్రముల జోడించి "హర హర మహాదేవ శంభో!" యని మాటిమాటికి గొంతెత్తి యరచుచు మ్రొక్కుచు నా కాంతిపుంజమునకు తొలగి దారి యిచ్చిరి. ఆ కాంతిపుంజముకూడ గంగాయమునానదీప్రవాహములవలె రెండై, సూటిగా పోయి వాకిట శివనింద చేయుచున్న శ్రీవైష్ణవాగ్రేసరుని రెండుకన్నుల లోనికే ప్రవేశించెను ! ఏమైనదో ! ఆ శ్రీవైష్ణవుని రెండుకన్నులు మూసెను ! ఆత డంకట నిలువలేకనే పోయి కన్నులు తిరిగి నారాయణస్మరణము చేయుచు క్రిందబడిపోయెను.

అన్నమయ్య యట్లే వెనుదిరిగి చూచుచుండెను. అతని భ్రూమధ్యమునుండి పొంగి స్రవించుచున్న యా తేజోధార యా వైష్ణవతండముపై నెల్ల ప్రసరించుచుండెను. అది ప్రసరించినచోట నెల్ల అది కాల్చివేయుచుండెను. దానితో నా నూతనవైష్ణవతండమున వారెల్లరు వీపులు కాలినవారును బుజములు చూడినవారును రొమ్ము లంటుకొనినవారును నైరి.

'హరి హరీ!' 'నారాయణా, నారాయణ !' 'రంగనాథా ! రంగనాథా ! రంగనాథా !'

ఏమున్న నేమి! గజేంద్రుని రక్షించిన యా వైకుంఠధాముడు,లక్ష్మీదేవితోకూడి యాడుచున్న చతురంగక్రీడ చాలింపలేదు. ఆతని నయనములే సూర్యచంద్రులు ! అందులో నొకటగు చంద్రనయనమున నేదో నలుసు పడినట్లయి యాతడి ప్పుడా కన్ను శ్రీచేలాంచలముతో తుడిచికొనుచుండవోలును !

లంకలో అగ్ని ముట్టుకొన్న హనుమంతుని తోకవలెనే అన్నమయ్యఫాలాగ్నియు ప్రసరింపసాగెను. దాని కాగలేక చెల్లాచెదరై వైష్ణవులు భజన చాలించి పారిపోయిరి.

వారి కగ్రేసరు డగు నా రంగనాథుడు వచ్చునే పడియుండెను !

*

లేఖలు

పల్లెలలో రేడియో

అయ్యా!

నిరక్షరాస్యులైన పల్లెటూరి ప్రజానీకానికి విజ్ఞాన ప్రబోధం సలుపగలిగే సదుద్దేశంతో పంచాయితీ బోర్డులు రేడియోని సంస్థాపిస్తున్నవి కాని రేడియోలదగ్గరా, పార్కుల్లోనూ పంచాయితీబోర్డులు తమ నియంతృత్వాధికారాన్ని చలాయిస్తున్నవి. ఇంకా ఎక్కడెక్కడ ఇలా జరుగుతున్నదో తెలియదు కాని, మా గ్రామంలోమాత్రం ప్రతి రోజూ ఇది జరుగుతూన్నది.

ప్రసారం ప్రారంభమయ్యే సమయానికి పాఠకమంది ఎదురుచూస్తూ కూర్చున్నా పంచాయితీబోర్డువారికి దయకలిగితేమాత్రమే Speaker ని తగిలించడం— తగిలించినా తెలుగువార్తలు సమాప్తమవడమే తడవుగా ఎంతమంది కూర్చునివున్నా రేడియోని కట్టేసి వెళ్ళిపోతూండడం పరిపాటయిపోయింది—7½ గం—లకు కాని "గ్రామస్తుల కార్యక్రమం" పూర్తి కానేకాదు—ప్రత్యేకం గ్రామస్థుల కోసమే ప్రసారం చేయబడుతూన్న గ్రామస్థుల కార్యక్రమాన్నే గ్రామస్థులు వినలేకపోతున్నారు. పోనీ ఒకమనిషికూడా కూర్చుని ఉండందే ఎవరికోసం తెరిచివుంచమని కట్టివేసినా ధర్మమే. అంతేకాని ఎందరున్నా 7-15 అవగానే కట్టెయ్యడం మాత్రం అన్యాయం

ఘంటసాల సుబ్బరాయశాస్త్రి.
ద్రాక్షారామం.

రైలుప్రయాణీకుల యిబ్బందులు

అయ్యా!

"పోలీసుచర్య" కు ముందు, భద్రాచలం రోడ్డు స్టేషనునుండి బెజవాడకు ఒక క్యారేజీ వుండేది. దీనివలన బెజవాడవైపుకు యిచటనుండి పోవు ప్రయాణీకులకు చాలా అనుకూలముగా వుంటూండేది. తరువాత యీ క్యారేజీ "పోలీసుచర్య" లో అంతమయింది. కమ్యూనిస్టుల అల్లరులవలన, యీవూరికి వచ్చు రైళ్ల వేళలు మార్చుటవలన, బెజవాడవైపుకు హైద్రాబాద్ వైపుకు వెళ్లే ప్రయాణీకులు గంటలతరబడి డోర్నకల్ స్టేషనులో ఆగిపోవలసివస్తోంది. ఎండవానలకు డోర్నకల్ ప్లాట్‌ఫారమే శరణ్యమవుతోంది.

యీ నెల 15 వ తేదీనుండి, రైల్వేఅధికారులు, యిచటనుండి సాయంకాలము గం॥ 6. 40 లకు బయలుదేరు రైలుకు, సరాసరి సికింద్రాబాదు పోవుటకు ఒక ప్రత్యేక క్యారేజీని వేసినారు. యిందువల్ల హైద్రాబాదు పోవు ప్రయాణీకులకు చాలా సౌకర్యంగా వుంది.

యీ పరిస్థితులలో, రైల్వేఅధికారులు, యిచటనుండి బెజవాడకు కూడా ఒక క్యారేజీని ఏర్పాటుచేసిన, ప్రయాణీకులకు చాలా సౌకర్యం వుంటుంది. కాబట్టి యిందువిషయమై రైల్వేఅధికారులు శ్రద్ధవహించి తగిన ఏర్పాట్లు చేస్తారని విశ్వసిస్తున్నా.

ఎం. రాజారావు.
సింగరేణి.

కోడేరు - నల్లచర్ల రోడ్డు

అయ్యా!

తాడేపల్లిగూడెంలో కోడేరు-నల్లచర్ల రోడ్డుకు సిమ్మెంటుకాంక్రీటు శాంక్షను కాబడినందుకు ప్రజలు చాలా హర్షించియున్నారు.

కాని సదరు పని 9 నెలలక్రితమే టెండర్లు పిలిచి కంట్రాక్టరును ఏర్పరచినప్పటికిన్నీ, పనికి కావలసిన సిమ్మెంటు షాపులలో యుండికూడా యింతవరకు ఆ రోడ్డు 9 మైళ్లపొడవులోనూ ఎక్కడా ఒక్క సిమ్మెంటుస్లాబు వేయలేదు.

పని యింతవరకు ప్రారంభించకపోవుటకు కారణము కంట్రాక్టరు యొక్క అన్‌వర్కబుల్ రేట్సు అని విదితమౌతున్నది. అన్‌వర్కబుల్ రేట్సుకు పని కాదని క్రిందఆఫీసర్లు వ్రాసినప్పటికిన్నీ పైఆఫీసర్లు ఆ రేట్లకే పని చేయించమనడం చాలా శోచనీయం. పని పూర్తిఅగుటకు కొంచెం టైముగాక పైగా పట్టే 2,3 సం॥ల కాలమునకు అగు అదనపు స్పెషల్ సిబ్బందిఖర్చులున్నూ యీలోపున యేర్పడే అరుగుదలకు అయ్యే ఎక్స్‌ట్రా ప్రొవిజనులున్నూ యీతక్కువరేట్లకు మించియుండగలదనువిషయం పైఆఫీసర్లకు తెలియని విషయం కాదు. దీనికై సంవత్సరంక్రింద తెచ్చిన సిమ్మెంటు గడ్డకట్టడంమూలంగా కూడా నష్టం రావచ్చును. ఇకనైనా సకాలములో పని పూర్తిచేయించి ప్రజలలో పని అవదేమో నని కలిగిన భయాందోళన లేకుండా చేయించవలసినదిగా కోరడమైనది.

మాధవరావు.
తాడేపల్లిగూడెం.

కరువురోడ్లు


అయ్యా!

ఇచ్ఛాపురంతాలూకాలో రోడ్ల మరమ్మతులు వెంటనే జరగాల్సిఉంది. గతఉత్తర విశాఖకరువుకాలంలో యెడ్వైజరీగవర్నమెంటు యీజిల్లాలో కరువునివారణకు రాకపోకల అవసరం గుర్తించి, రోడ్లువేయించింది. అందులో ఇచ్ఛాపురంనుండి ఉద్యానంమీదుగా సోంపేటవరకున్నూ, జగతి-శిలగాం, మాణిక్యపురం-కంచిలి, రోడ్లుపూర్తిఅయినవి. కవిటి-నెలవంక, తిప్పానపుట్టుగ-నెలవంక, ఇచ్ఛాపురం-కొళిగాం, రోడ్లు సగంపనిలో ఆగిపోయినవి. కరవు ఆగిపోయిందన్న కారణంతో.

ఇప్పటికి 4,5, సంవత్సరాలనుంచి వీటికి, మరమ్మతులు లేవు. రోడ్లన్నీ-ముఖ్యంగా యిసుకనేల అగుటచేత ఉద్యానప్రాంతంలోని రోడ్లు పూర్తిగా శిథిలావస్థలో నున్నవి. బండ్లు, మనుష్యుల, రాకపోకలకు హానికరంగా నున్నది. యీ రోడ్లు యింతవరకు జిల్లాబోర్డుకు గాని హైవేస్ డిపార్టుమెంటుకుగాని చెందక తల్లీ దండ్రీ లేని బిడ్డలు అయివున్నవి. వీటి మరమ్మతులు గురించి తాలూకా కాంగ్రెస్, కిసాన్ కాంగ్రెస్, జిల్లా కాంగ్రెస్ లు మూడునాలుగుసంవత్సరాలనుంచీ బహువిధాలుగా ఆందోళనచేస్తూన్నది యిటీవల యీ రోడ్ల మరమ్మతులకు రెండులక్షలు ఖర్చు అవుతుందని ప్రభుత్వం ఎస్టిమేటు వేసినట్లు తెలుస్తున్నది. కాని పనులు యింతవరకూ యెక్కడా ఆరంభించలేదు. ఇచ్ఛాపురంనుంచి సోంపేటవరకు గల అవకతవక రోడ్లలో బస్ సర్వీస్ కూడా వున్నది. కాన ప్రభుత్వంవారు వెంటనే యీ రోడ్లను హైవేస్ డిపార్టుమెంటుద్వారా మరమ్మతులు చేయించాలి. సగంపనిలో ఆగిపోయిన కవిటి-నెలవంక రోడ్డు, ఇచ్ఛాపురం-కొళిగాంరోడ్డు పనులు పూర్తి చేయించాలి. ప్రభుత్వం గమనించాలి.

ఇట్లు
పండా. రంగస్వామి.
ప్రగడపుట్టుక.

ఆగ్నేయాసియా పర్యటన అనంతరం ఇండియాకు నెహ్రూ రాక.



ఇండొనీషియా వగైరా ఆగ్నేయాసియా పర్యటన ముగించుకొని భారతదేశానికి తిరిగివచ్చిన ప్రధాని నెహ్రూకు పాలం విమాన కేంద్రంలో స్వాగతం. ఈ స్వాగతోత్సవంలో కేంద్ర మంత్రివర్గ సభ్యులూ, విదేశరాయబార ప్రముఖులు చాలామంది పాల్గొన్నారు.



ప్రధాని గత ఆదివారం కలకత్తాలోని "ఫోర్టువిలియం" కోటను సందర్శించారు. ఆకోటలో నిపదాతినాకాదళాధికారులతో గోష్ఠిలో ఉన్నా

Rgd. No. M. **4479**

ఆంధ్రవిజ్ఞానసర్వస్వము

ప్రథమ ద్వితీయ సంపుటములు

ప్రథమసంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ పుటలు గలవు. ఇందు 'అ' నుండి "అధ్వర్యు" వరకును గలవిషయము గలదు. త్రివర్ణపటములు ౮' ఇతర పటములు ౧-౨౫, వివిధ విషయములు ౮౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ లకు మించిన పుటలు కలవు. "అక్ష" మొదలుకొని "అశ్విని" వరకు గలవిషయము గలదు. త్రివర్ణపటములు ౧౦. వానిలో ౨ అమరావతీ స్తూపమునకును, ౨ అనాహతమునకును చెందినవియు, ౬ దేశచిత్రపటములును గలవు. ఇవిగాక మరి ౫ సాదాదేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళాసంపదను వ్యక్తముచేయు అమరావతీస్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతీశిల్పమునకు సంబంధించిన హాఫ్‌టోన్ బొమ్మలు రమారమి ౧౦౦ ను, వేషభూషాదుల వెల్లడించు బొమ్మలు ౫౦ వఱకును గలవు. మరియు అభినయ మను వ్యాసమున భరతశాస్త్రమునందలి వేఱు వేఱు హస్తములను సూచించు బొమ్మలు ౫౭ ను, 'అనాహతము' నందు షట్చక్రాదుల చిత్రములును గలవు. ఇట్లు ఆ యా వ్యాసములకు చెందిన చిత్రములును మొత్తము మీద ౨౫౦ కి పైగా నున్నవి. వివిధ విషయముల సంఖ్య ౮౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీచర్మముతోడను, బంగారురేఖలతోడను సంపుటీకృతము. ప్రతి సంపుటమున ౬-౦౦ పుట లుండును.

ప్రతి సంపుటము వెల రూ. ౧౦.

పోస్టు ఖర్చులు: రూ. ౧-౮-౦.

రైలు ద్వారా దగ్గర వూళ్లకు ఖర్చులు అ. ౧౨.

మేనేజరు,

ఆంధ్రవిజ్ఞానసర్వస్వకార్యాలయము,

నెం. 7, తంబుశెట్టివీధి, మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras